ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రి



4 అణాలు

24-12-52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL



తాడిపత్రిలోని శిథిలశిల్పాలు

—ఫోటో శ్రీ ఎ. రాఘవరావు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 45
సంచిక 18
24-12-52

Founder . K. NAGESWARA RAO

నందన పుష్య శుద్ధ అష్టమి బుధవారము



ఆంధ్రరాష్ట్రం కోసం ఆత్మబలిదానం చేసిన మహాపురుషుడు శ్రీ పొట్టి శ్రీరాములుగారు.

సవరణ

'నౌకరి', 'బేస్తు' అను కథానికలు ప్రచురించబడిన 22, 27 పేజీలు పొరపాటున తారుమారు అయినందువల్ల, 'నౌకరి' (22 వ పేజీ) కథానిక తరువాయి 28 వ పేజీలో చదువుకోవలసిందనీ, 23 వ పేజీలో ఉన్నది 'బేస్తు' (27 వ పేజీ) అను కథకు తరువాయిగా గుర్తించవలసిందనీ పాఠకులకు మనవి.

—సంపాదకుడు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :—అనీల్ పిక్చర్స్ వారి "షీషమ్"లో నూతన్.

★ ఆత్మబలిదానం ★

తాను నమ్మిన న్యాయాన్ని సాధించడానికి అహింసావ్రతనిష్ఠయే పరమోత్కృష్టమైనదనే అచంచల విశ్వాసంతో కఠోర దీక్షవహించి ఆత్మ బలిదాన మొనర్చిన శ్రీ పొట్టి శ్రీరాములుగారు నిరాశా నిస్పృహలవల్ల నిర్వీర్యమౌతున్న జాతిని పునరుజ్జీవన మొనర్చారు.

"గాంధీజీ నిర్యాణం అనంతరం ప్రజలకు అహింసాసిద్ధాంతము, సత్యాగ్రహ సిద్ధాంతాలపట్ల విశ్వాసం నశించింది. నేను ఒక ప్రత్యేకరాష్ట్రంకోసంగాని మద్రాసునగరంకోసంగాని ప్రాయోపవేశం చేయడంలేదు. ప్రజలనైతిక నిష్ఠను పునరుద్ధరించదలిచాను" అని శ్రీరాములుగారు వారి మిత్రులతో అన్నారట.

నాయకులను పరిపాలకులను బట్టే ప్రజలు. శ్రీరాములుగారి పలుకులలోని సత్యాన్ని గురించి కాంగ్రెస్ వాదులూ కాంగ్రెస్ నాయకులూ చింతించాలి. మాటిమాటికీ గాంధిమహాత్ముని నామముచ్చరిస్తూనే, రాజకీయవైరాలలో చిక్కుకుని సత్యాసత్యాలను, న్యాయాన్యాయాలను విస్మరించిన నాయకులు ప్రజలపట్ల తమకర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించలేకున్నారు. ఇంతవరకూ రాష్ట్రసాధనకోసం కృషి చేసిన నాయకులందరూ నిరాడంబరి అయిన ఒక సామాన్య కాంగ్రెస్ సేవకుడు చేయగలిగిన మహత్తర త్యాగాన్ని చూసి సిగ్గుతో శిరస్సులు వంచుకోవాలని కళావెంకట్రావుగారన్నమాట నిజం.

ఇతఃపూర్వం జరిగిన ప్రాయోపవేశాలూ, ఆందోళనలూ పరిపాలకులలో హృదయపరివర్తన తేలేకపోయినవి. గాంధిమహాత్ముని సిద్ధాంతాలపట్ల విశ్వాసంతో పరిపాలన సాగిస్తున్నట్లు ప్రకటిస్తున్న పరిపాలకులు నిరాహారదీక్షలూ సత్యాగ్రహాలూ అనుచితమైనవని నిరసిస్తున్నారు. గాంధిమహాత్ముని పరమ శిష్యులైన ఆశ్రమవాసులు పరిపాలకులకూ ప్రజలకూ కూడా దూరమైపోయారు. కాంగ్రెస్ పరిపాలనలో కూడా అన్యాయాలు జరిగినప్పుడు న్యాయాన్ని ఏరీతిగా సాధించాలో, ప్రస్తుత పరిస్థితిలో గాంధిమహాత్ముని సిద్ధాంతాలను ఎలా అమలు జరపాలో తెలియక ప్రజలేగాదు, కాంగ్రెస్ ఆశయాలపట్ల విశ్వాసంగలవారుకూడా నిస్సహాయులై దిక్కులు చూస్తున్నారు.

ప్రత్యక్ష నిదర్శనం ఆంధ్ర రాష్ట్రోద్యమం కనపడుతూనే వుంది. ప్రభుత్వాలను నమ్ముకుంటే రాష్ట్రం సిద్ధించలేదు. శాసన బద్ధమైన ఆందోళన విధానాలను అవలంబించి ఆంధ్రదేశ నాయకులు రాష్ట్రాన్ని సాధించలేకపోయారు. ఇంక కర్తవ్యమేమిటో ఎవరికీ బోధపడలేదు.

ఇక్కడే మరొక క్లిష్టసమస్య కూడా సంభవించింద. మద్రాసు నగర భవిష్యత్తును గురించి ఆంధ్రులు ఆలోచన మానుకుని

వజ్రసంకల్పం: కఠోర దీక్షా సమాప్తి.


ఎడమ్మపక్క చిత్రం —

58 రోజుల నిరాహార దీక్ష అనంతరం నిర్యాణం చెందిన శ్రీ పొట్టి శ్రీరాములు గారు.



క్రింది చిత్రం :—

చెన్నపట్నంలో అపూర్వమైన ఈ దీక్షను వారు కొనసాగించినది ఈ గృహంలోనే. ఇది శ్రీ బులుసు సాంబమూర్తిగారి వసతి



ఆత్మబలి దానం

మితిమీరిన ప్రాంతీయతతో నే తృప్తి పడాలని ప్రధాని నెహ్రూగారు కట్టుదలపట్టారు. హృదయపూర్వకంగా కాకపోయినా, కనీసం ఏకో రాష్ట్రం లభిస్తుందనే ఆశతో ఆంధ్రదేశనాయకులు చాలమంది ఇందుకు ఒప్పుకున్నారు. అయినా రాష్ట్రం లభించలేదు. అయితే ఈ తర్జనభర్జనలలో మద్రాసు నగరాన్ని తరతరాలనుంచీ నివాసస్థానంగా ఏర్పరచుకొంటున్న ఆంధ్రుల మనోవాంఛను గురించి అంతగా ఎవరూ పట్టించుకోలేదు. మద్రాసు నగరంపై హక్కులను విడనాడుకోవాలని పట్టుబట్టుతున్న నెహ్రూగారు కూడా మద్రాసులోని తమిళులు, కన్నడులు, కేరళులు, ఆంధ్రులు అభిమతాన్ని గురించి గాని, నగరంలో ఆంధ్రులకుకూడా న్యాయం చేకూర్చవలసిన అవసరాన్ని గురించి గాని, పూర్తిగా విస్మరించారు. ఆంధ్రులు, తమిళులు ఒప్పందం ప్రకారంగా చెన్నపట్నాన్ని [illegible] చేసి ఉంటే, నగరంలోని ఆంధ్రులకు కొంతయినా తృప్తి కలిగేది. ఎట్టి ఒప్పందానికిగాని, ఎట్టి సమాలోచనలకుగాని తావులేని పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఇందుకు విశ్వాసంలేని ఆంధ్రదేశనాయకులే కాదు, పరిపాలకులు కూడా బాధ్యత వహించక తప్పదు.

“ఒక నగరంవిషయమై తగాదా వచ్చినప్పుడు, దానివిషయమై ఎట్టి న్యాయాన్యాయ విచారణా లేకుండానే ఒకరు హక్కు వదులుకోవాలని మన అగ్రనాయకులు చెప్పడం విచారకరం” అని శ్రీరాములుగారు భావించారు. రాయలసీమవాసులు, నెల్లూరు జిల్లావాసులూ కూడా మద్రాసు నగరం గురించి అత్యంత ఆందోళన చెందుచున్నారు.

న్యాయాన్యాయాలను పరిగణించని నిర్ణయాలూ, పరిపాలనా విధానమూ ప్రజల ఆదరాన్ని పొందజాలవు. అట్టి నిర్ణయాలను, పరిపాలనా విధానాన్ని ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతాన అమలు జరపడంవల్ల ప్రభుత్వంపట్లనూ నాయకులపట్లనూ ప్రజలవిశ్వాసం నశిస్తుంది. ప్రజలవిశ్వాసంగల నాయకులు న్యాయాన్యాయాలను పరిశీలించి చేసే నిర్ణయాలైతే ప్రజలు శిరసావహించడానికి అవకాశం ఉంటుంది.

“ప్రధాన మంత్రీ, కాంగ్రెస్ అధ్యక్షులూ అయిన పండిట్ జవహర్లాల్ నెహ్రూగారు మదరాసునగరాన్ని గురించి ఆంధ్రులకు, తమిళులకు మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి బాధ్యతను స్వీకరించ నిరాకరిస్తున్నారు. ఈ నగరం విషయంలో ఆంధ్రులు తమిళులు ఉభయులకూ గౌరవప్రదమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలనికూడా (నెహ్రూగారు) కోరుతున్నారు. ఆయనకు ఇష్టంలేనిపనిని, ఆయన నిరాకరిస్తున్న బాధ్యతను సత్యాగ్రహంవల్లనూ ఉపవాసదీక్షలవల్లనూ ఇతర మార్గాలవల్లనూ బలవంతంచేసి మెడలువంచి ఆయనచేత ఒప్పించడానికి ప్రయత్నించి లాభం లేదు”, అని శ్రీరాములుగారు నిరాహార దీక్షారంభంలో స్పష్టపరిచారు. “ఇంగితం ఉన్న ఆంధ్రులను తమిళులను ఒక్కచోట చేర్చి ఈ నగరం విషయమై మదరాసువాసులందరికీ, మదరాసుతో సంబంధం వున్నవారందరికీ సంతృప్తికరమైన ఒప్పందాన్ని సాధించవలసివుంది... అందునిమిత్తం నేను నా ఓపికంతలో ఒక పని చేయగలను. ఆమరణోపవాసదీక్ష వహించి ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకురాగలనన్న ఆశ నాకున్నది” అని ప్రకటించి శ్రీరాములుగారు శ్రీ బులుసు సాంబమూర్తిగారి వసతిలో తమ దీక్షను ప్రారంభించారు.

అందరూ నిర్వివాదమైన ప్రాంతాలతో రాష్ట్రనిర్మాణానికి సంసిద్ధంగా ఉన్నప్పుడు “మీరు కూడా దానికి అంగీకరించడం ధర్మం కాదా” అని వారి మిత్రులు ప్రశ్నించినప్పుడు “అసలు దేనికీ కూడా అగ్రనాయకులలో కదలిక రాలేదు” అని శ్రీరాములుగారు జవాబిచ్చారు. ఈ పరిస్థితిలో “అహింసలో నమ్మకం ఉన్నవారు తమకేమీపట్టనట్లు నిద్రపోతే, హింసావాదులయినవారు ప్రాణహాని పరిష్కార దుస్సాధ్యమైన పరిస్థితులను కల్పించగలరని” శ్రీరాములుగారు అభిప్రాయపడ్డారు.

స్వామి సీతారాంగారి ఉపవాసాలు, సత్యాగ్రహం, ఎన్నికల ఫలితాలు మొదలైనవేవీ రాష్ట్రనిర్మాణానికి అగ్రనాయకులను సుముఖులను చేయలేకపోయినా, ప్రజలకు అహింసావాదంపట్లనూ శాంతబద్ధమైన ఉద్యమాలపట్లనూ విశ్వాసం సన్నగిల్లడంలో ఆశ్చర్యంలేదు. ఈ పరిస్థితిలో గాంధీమహాత్ముని సిద్ధాంతాలపట్ల అచంచల విశ్వాసంగల శ్రీరాములుగారు, ప్రజలు హింసావాదమునకు మొగ్గకుండా రాష్ట్రము సాధించుకోవలెనని ఆకాంక్షించడంలో దోషం లేదు.

“ఎవరో కొందరు ఆత్మార్పణ చేస్తే గాని రాష్ట్రం రాదు” అని శ్రీరాములుగారు భావపడ్డారు.

ఇట్టి పరిస్థితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కొంతగాకపోతే కొంతయినా ఆంధ్రదేశ నాయకులు కూడా బాధ్యతవహించాలి. అహింసా ప్రతినిధి స్వరూపులైనవారి ఆత్మబలిదానాన్ని పరిపాలకులు నాయకులు నిర్లక్ష్యపరచడంలో, వారే దేశంలో హింసావాదాన్ని బలపరిచినవారౌతారు. అహింసాత్మకమైన [illegible] ఇట్టి [illegible] కూడా [illegible] పోరు. దేశంలో [illegible] చెందుతున్నది; చెలరేగగలవని ముందే గ్రహించడం ఎవరికీ కష్టంకాదు. అహింసాత్మకమైన ఉద్యమంలో కూడా హింసకూ ఉద్రేకాలకూ తావులేకపోలేదని గాంధీమహాత్ముడే గ్రహించారు.

ఇప్పటికైనా [illegible], [illegible] అయిన ప్రకటనలు చేయడం కాని అగ్రనాయకులు ప్రజలను తృప్తిపరచడం అవసరం. ముందుచేసే ప్రకటనలు లేకపోతే [illegible] ప్రజలకు కల్పించిన [illegible] ఆశాభంగం కలిగించడం ఎవరికీ క్షేమంకాదు. [illegible] ప్రకటించడం అందరికీ మేలు. ప్రజాస్వామ్యంలో ప్రజల [illegible] అభిప్రాయాన్ని ప్రకటించుకోవడం మేలు. ప్రజలలో అట్టి విశ్వాసాన్ని స్థాపనచేసి ప్రజలకోరాన్ని సాధించినప్పుడే ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది. శ్రీ రాములుగారు ఆశించినట్లు వారి తరువాత మరొకరు ఆత్మార్పణకు పూనుకొనకుండా, ప్రజలలో కల్లోలం వ్యాప్తి చెందకముందే అన్నివర్గాలవారికీ గౌరవప్రదమైనదైన ఆంధ్రరాష్ట్రం అవతరించవలెనని అందరూ ఆశించాలి.

[సూర్యనారాయణ. 17-12-1952]

కాలక్షేపం

శ్రీగల భాగ్యశాలి కడ
 జేరగవత్తురు తారుదారె; మా
రాగమున ప్రయాసమున
 కాదట నోర్చియునైన నిల్వను
ద్యోగము చేసి;-రత్నినిలయుం
 డని కాదె సమస్త వాహినుల్
సాగరు జేరు టెల్ల ముని
 సన్నుత మద్గురుమూర్తి భాస్కరా!

తా॥ నాకు గురుస్వరూపుడవైన భాస్కరా! ఎంత దూరప్రయాణ ప్రయాసకైనను, ఆదరణభావ భరితులై ఓర్చుకొని తమంత తామే ధనవంతునివద్దకు చేరిఅక్కడనే ఉండుటకు జనులు యత్నిస్తారు. అది ఏవిధంగా అంటే, సముద్రుడు రత్నాకరుడనే కారణంచేతనే సమస్తమైన నదులున్నూ చాలా దూరంనుంచి ప్రవహించి వచ్చి ఆ సముద్రంలోనికే చేరుచున్నవి. (సముద్రంలో ముత్యాలు పగడాలు లభించుటవల్ల సముద్రానికి రత్నాకరుడనే పేరు ఏర్పడింది.)

భాస్కరశతకంలోని మొట్టమొదటి పద్యమే యిది. ఈ శతకమును మారద వెంకయ్య అనే కవి రచించెనని బ్రౌన్‌దొర గారు వ్రాసియున్నారు. ఈ భాస్కర శతకం వ్రాసిన కవికూడ ఒక భాగ్యశాలి చెంతజేరి తన ఉపాధికి లోపం లేకుండా జీవితమును గడిపి ఉంటాడు: ఈ కవి యీ పద్యంలో చూపించిన ఉపమానమును బట్టి చూడగా నదులు ఎంత సహజసిద్ధంగా సముద్రములోనికి ప్రవహించి ఆ సముద్రంలో లీనమై ఉంటాయో, భాగ్యశాలి వద్దకు చేరెడి జనులుకూడా అంత సహజసిద్ధంగా విధాయకంగా చేరి, ఆ భాగ్యశాలినే ఆశ్రయించుకొని ఉంటారని ఈకవి యొక్క అభిప్రాయం. ఆయా ప్రభువుల ఆస్థానములను ఆశ్రయించుకొని చాలా మంది కవులు, గాయకులు, శిల్పులు జీవిస్తూ ఉండేవారు. అటువంటి ప్రభువుల వద్దకు జేరకపోతే, యీ పండిత తండములు మరెవ్వరి అండజేరి యుండగలవు? ఆ విధంగా ఆలోచిస్తే, ఆ విధంగా తర్కిస్తే, ప్రజలైనవారు ప్రభువులను ఆశ్రయించుకొని జీవింపక మరెవ్వరిప్రాపున జీవింప కలరు? అయితే, ఇంకొక ముఖ్యమైనధర్మ సందేహం ఈ సందర్భంలో కలుగుతుంది. "శ్రీగల భాగ్యశాలి" ఎవ్వరినీ ఆశ్రయించకుండానే బ్రతుకుతున్నాడా? ఎవరికి అతడు ప్రభువై ప్రభుత్వంచలాయిస్తున్నాడో వారివల్లనే అతడు తన రాజ్యాన్ని రాజ్యాధిపత్యాన్ని నిలువబెట్టుకో గల్గుచున్నాడు. కొంత పరివార జనమున్నూ భట సమూహమున్నూ తనవెంట ఉంచుకొని పరరాజులవల్ల తనకు అపాయము లేకుండా రాజైనవాడు ఆత్మరక్షణ చేసికొనుచున్నాడు. తన సైన్యం తనకు ఎదురుతిరిగితే, రాజు గాజులు తొడిగించుకొనవలసివస్తుంది. ప్రజలకు పతియైన వాడు ప్రజలకు పత్నియై కాపురం చెయ్యవలసి వస్తుంది. దీనినిబట్టిచూస్తే రాజును కాపాడేది ప్రజలు. ప్రజలను కాపాడేది రాజు అని అన్వయించాలి. కాని, అన్యరాజ్యాలవారు దండెత్తివచ్చినప్పుడు స్వసైన్యబలం చాలనప్పుడు రాజు పరాజితుడై పరలోకగతుడుకూడా కావచ్చు. కాని, ప్రజలు అంతమాత్రముచేత నామరూపాలు లేకుండా నాశనమైపోరు. మరొక రాజు అధికారానికివస్తాడు. అప్పుడతనికి హారతులెత్తి అడుగులకు మడుగులొత్తక తప్పదు. కనుక, రాజు దొక గౌరవ

(55-వ పేజీ చూడండి)

రాజారామమోహనరాయిగారి దత్తపుత్రుడు

1880 సంవత్సర ప్రాంతంలో భారతదేశమందు జరుగుచుండిన "సహగమనమును" మాన్పించి నటువంటియు, బ్రహ్మసమాజమును స్థాపించినటువంటియు, రాజా రామమోహనరాయిగారు "రాజారాం" అనునొక పిల్లవానిని పెంచుకొన్నారు. రామమోహనరాయిగారు మరణించినప్పుడు రాజారాంకు వయస్సు 12 సం॥లు. రాజారామమోహనరాయిగారు ఇంగ్లండులోనే మరణించిరి. ఆయన దత్తపుత్రుడైన "రాజారాం" గురించిన విశేషములు ఎవరికీ తెలియవు. కాని, 1883 సం॥లో శ్రీమతి అన్నా-లెటిషియా-లీ-బ్రెటన్ అనే ఆంగ్లవనిత *"Memories of Seventy years"* ("70 సంవత్సరముల అనుభవ విశేషములు") అనే గ్రంథం వ్రాసింది. ఆ గ్రంథంలో "రాజారాం" గురించి యిలా వ్రాయబడింది.

"ఇతనికి యింగ్లండులోనే చదువు చెప్పించవలెనని నిర్ణయించి రెవరెండు సామ్యుయల్ ఫుడ్ గారికి ఆ పిల్లవానిని రామమోహనరాయి గారు ఒప్పగించారు. ఈ పిల్లవాడు మాయింటికి వస్తూపోతూ ఉండేవాడు. అతడు మంచి చురుకైన తెలివిగల పిల్లవాడు. ఒకసారి అతడు "ఒథెల్లో" (షేక్సుపియరు కవి విరచితమైన ఇంగ్లీషు నాటకము)నందు "ఒథెల్లో" అను కథానాయకుని పాత్రను ధరించి బాగా నటించాడు. అతని చదువు పూర్తిఅయిన తర్వాత ఇండియాకు వెళ్లెను. అక్కడ గవర్నమెంటు ఉద్యోగం ఒక సివిలు డిపార్టుమెంటులో సంపాదించి సఖ్యంగా తెలుస్తూ ఉన్నది."

గోమాషి

బళ్ళారి ప్రాంతాన శ్రీధరగడ్డలో కరువు క్యాంపుకి ఛార్జి ఆఫీసరుగా జాయినయిం తరవాత ఇంతగా ఏనాడూ హైరానపడలేదు జ్వాలాపతి. పొద్దుపొడిచింది లగాయతూ చీమలబారులా బస్తీనించీ పల్లెటిదిక్కునించీ పాటకజనం మూటా ముల్లీ నెత్తిన పెట్టుకుని పిల్లా మేకా తగ్గించుకుని పొద్దు వాటారే దాకా ఎడతెరిపి లేకుండా వస్తూనే వున్నారు. డెల్టాలో వొత్తయిన చేలూ పచ్చని తోటలూ చూడ మరిగిన కళ్ళకి ఇక్కడ నెరియలుపడ్డ నల్ల రేగడిగడ్డలో భూదేవి కటికగుండె తగులుతుంది. దెబ్బతిన్న మదపుటేనుగుల్లా గాయపడి నెత్తుగోడుతూ కనిపించే కొండల బారులు అన్నివేపులనించీ చూపుల్ని అటకాయిస్తాయి.

ఆ ప్రాంతాలలో వానపాటూ గట్టా సలక్షణంగా వున్న రోజులలోనే పంటలు అంతంతమాత్రం. ఇహను అతివృష్టి గాని అనావృష్టి గాని సంభవించిందంటే, పైరుగాలి ఏవంత జంకిందంటే ప్రజలు కాలే కడుపులు చేతులతో పట్టుకుని అల్లాడుతూ వలసపోతారు. ఆ యేడు మాగాణి పంటకి ప్రసిద్ధిపొందిన సిరిగుప్ప తాలూకాలో గూడా ఎకరాకి పందుం గింజలయినా రాలినపాపాన పోలేదు. గ్రాసం లేక పశువులు బక్కచిక్కిపోయాయి. పంటమీదవున్న చేలు గూడా తెంపిపోసిన మోళ్లా అన్నట్టు చింకిపాతలతో తగ్గిపోయే ప్రజానీకంతో సానుభూతిగా దిస్సమొలతో నిలిచిపోయాయి.

తను ఎంతమందికని ప్రవేశమియ్యగలడు? ఈ క్యాంపులో ఇంతమందికంటె ఎక్కువ జేర్చుకుందుకు వీలులేదన్న నియామకం వీళ్ళకేమి తెలుసు? క్యాంపులో ప్రవేశం దొరక్క నిలిచిపోయిన అన్నార్తులసంఖ్య మితిమీరిపోతోంది. అక్కడికీ కొంతమందిని సుంకేశ్వరి క్యాంపుకి బదలాయించి సర్దుబాటుచేశాడు. ఎంతచేసినా దిగడిపోయిన అలగాజనమింకా వుండనే వున్నారు. సుంకేశ్వరిలోగూడా కూలీల సంఖ్య భర్తీ అయిందని వర్తమానమొచ్చింది. ఇహ నేమిటి చేసేది? ఏమీ పాలుపోలేదు.

రాత్రి మాటుమణిగింది. నల్ల కొండల చిక్కని చాయలు అంతకంటె చక్కని చీకటిలో కలిసిపోయి కరిగిపోతున్నాయి. కాన్పువారిలదగ్గర సమ్మెట దెబ్బలు వొకటీ ఆరా వినపడుతూనే వున్నాయి. అవలి కొండ మలుపులో రోడ్డురోలరు వొదిలి కంకరరస్తా వేస్తున్న కూలీలజట్టు తిరుగుమొహం పట్టి పల్లెటిపదాలు పాడుకొంటూ బ్రదుకులేని ఆనందం భర్తీచేసుకుంటున్నారు. క్యాంపులోనించీ కిచెన్ సూపరెంటు గావుకేకలు పెడుతున్నాడు. ఆవేపుని గిలకలబావిలో బుంగలు మునుగుతున్నాయి— బైట జల్లిబండిలో కంకేళ్లు కంచెలమీద రాసుకుంటున్నాయి. ఎంతకీ నిద్రపట్టదు జ్వాలాపతికి. దానికి తోడు కడుపులో కోలాహలంగా వున్నదతనికి. అక్కడిజనం ఇనపరేకుల్లాంటి జొన్నరొట్టెలు తిని ఇట్టే హరాయించుకోగలరు. తనూ తన వర్గస్తూ తినే గజేంద్రభోగాలూ, మదగజేంద్రభోగాలూ, ఢిల్లీ భోగాల క్రింద లెఖ్ఖపెడతా రక్కడ. అవే వొంటబట్టించుకోలేకుండా వున్నాడు తను...అమ్మణ్ణి


శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

తల్లిదగ్గర మారాం చేస్తోంది... రెండు ఝాముల వేళ గాఢంగా నిద్రపట్టిందతనికి.

ఉన్నట్టుండి హటాత్తుగా మెలుకువ వచ్చింది జ్వాలాపతికి. వంటయింటో అలికిడి యేదో నిశ్శబ్దాన్ని చీలుస్తోంది. భార్య అన్నపూర్ణ అమ్మణ్ణిని పక్కన వేసుకుని నిద్రపోతోంది కిటికీదగ్గర. అవాళ పండగ. అంచాత వోళిగలు చేసుకున్నారు. చిత్రాన్నమూ వడలు గట్టా వంటింటో పుష్కలంగా వున్నాయి. ఎలకలు గాని ఏమయినా హంగామా చేస్తున్నాయేమో నను కున్నాడు. కాని పాత్రలూ, కంచాలూ, చెంబులూ అతిపొందికగా తీస్తున్నట్టూ వడ్డన చేస్తున్నట్టూ అనిపించిందతనికి. తళుక్కున గుర్తుకొచ్చింది. వంటయింటో వెండిసామాను విపరీతంగా వున్నది. తన మనుగుడుపుల కిచ్చిన కంచమొక్కటే నూటయిరవై తులాలు. ఎవడో జొరబడి ఇవన్నీ మూటగట్టుకుని పోతున్నాడా? ...వీధతలుపులు బార్లా తెరిచివున్నాయి. వంటింటో కీనీడ లెవో తచ్చాడుతున్నాయి...కొంప మునిగింది. కెవ్వున కేకలు వేస్తే? వీళ్లదగ్గర ఏటకత్తు లుంటాయంటారు మెడమీదకి విసిరి తుర్రుమంటే? చల్లగా గీరి భార్యని "నిద్రలేపుదా" మనిపించింది. ఇహ వావిడ గుచ్చిగుచ్చి యక్షప్రశ్నలు వేస్తుంది. సమాధానాలు చెప్పలేక చావాలి. ఈ సందట్లో చేజిక్కించుకున్న మూట కాస్తా చంక నెట్టుకుని కన్నపుదొంగ కాలికొద్దీ వుడాయించగలడు. ఏమీ పాలుపోక వొళ్లంతా ముచ్చెమటలు పోసినై. నఖశిఖ పర్యంతమూ కంపం పుట్టుకొచ్చింది. ఏదో ఆవేశ మొచ్చింది. చివ్వున లేచి వంటింటి తలుపు గభాల్న వేసి ఇవతల గొళ్లెం పెట్టి 'దొంగ దొంగ'ని కేకలు పెట్టాడు. దొంగ బోనులో పడ్డ బండీ ఓండువులా చిక్కడిపోయాడు. అమ్మణ్ణి అన్నపూర్ణని కావిలించుకుని బావురుమని యేడుస్తోంది. జ్వాలాపతి అరుగుమీద నిలబడి ఇంటికప్పెగిరిపొయ్యేలా పొలికేకలు పెడుతున్నాడు రంకెలు వేస్తున్నాడు. దానితో ఇరుగుపొరుగిళ్ల జనమంతా విరగబడ్డారు.

అంతకూడా ఎవరైనా దొంగని పట్టుకుంటే విచిత్రం చూదామని చక్కా వచ్చినవారే. అంతా వొకటిగా నిలబడితే దొంగ పట్టుబడి తీరతాడని అందరికీ తెలుసును. కాని ఏ వొక్కడూ కలిసిరాడని ప్రతి వొకడికీ గట్టినమ్మకం. జ్వాలాపతి వెర్రికేకలు పెట్టడం మినహా దొంగ ఎక్కడున్నాడో చెప్పాలన్న సంగతి కూడా మరిచిపోయి వూరుకున్నాడు. అతన్ని అనీ లాభం లేదు. వొచ్చిన మనుషులకైనా ఆరాలు అడగాలిసిన అవసరమున్నట్టు తట్టనే లేదు. ఆఖరికొక బుద్ధిమంతుడు అడగనే అడిగాడు. దొంగ ఎక్కడున్నాడో తేల్చుకుని అమాంతం వాటేసుకుందామని కాదుగాని, దొంగ ఎటువేపునించీ వొచ్చి హటాత్తుగా దెబ్బతీస్తాడో తెలుసుకుని తను జాగర్తలో వుండడ మెందుకైనా మంచిదని. చివరికి దొంగ ఎక్కడ చిక్కడిందీ చప్పగా తేలిపోయింది. దానితో గొళ్లెం పెట్టివున్న వంటయింటి ధరిమేనా వొక్కడూ వెళ్ళడు. అంతా పంచపాళీలో పోగై సమాలోచనలు ప్రారంభించారు. ఎంత తీవ్రంగా చర్చించినా గొళ్లెం తియ్యాలిసిన మొనగాడెవడో నిర్ధారణకాలేదు. కాని గొళ్లెం తియ్యగానే ఎవరెవరు ఏమేమి చెయ్యాలోమాత్రం తనని మినహాయించుకుని ప్రతివొక్కడూ అతిచవుకగా సలహాలు పుంఖానుపుంఖంగా ఇచ్చేస్తున్నాడు.

ఈ సందు చూచుకుని దొంగ కాస్తా వంటింటి వెనకాతల సామానుగదిలోనించీ తను వేసుకున్న కన్నపుదారి గుండా తనే లక్షణంగా బయటపడి పెరటి తలుపులు



తెరుచుకుని పీకినపడ్డాడు మరి నడిపీథిని బరిమీదపడ్డ దొంగవల్ల ప్రమాదం తక్కువనిపించిందో యేమో అంతా బాణాకర్రలు వేసుకుని వెంటబడ్డారు

దొంగ పట్టుబడ్డాడు

క్షణంలో వాణ్ణి రెక్కలు పట్టుకుని ఇంట్లోకి బరబరా ఈడ్చుకొచ్చారు దొరుకుత మనిషో పశువో కూడా ఎవరూ పట్టించుకోలేదు చేతులో ఏముంటే దానితోటి సత్తువకొద్దీ తలా వొకదెబ్బా తీశారు కొంతమంది పుల్లకఱ్ఱలతో డొక్కల్లో దూసుకుపొయ్యేలా పొడిచారు మరికొంతమంది బడితెలు తీసుకుని నెత్తిన ఢంగున మోగేలా చావమోదారు కర్ర నొసలిమీద పడుతోందో కంతలమీద పడుతోందో తలపుర్రెమీద పడుతోందో ఎవడికీ గమనింపులేదు సమయానికి చేతిలో ఏమీ లేకుండా రిక్తహస్తంగా వొచ్చిన కొంతమంది ఆ సామీలు తీరా మోసి దొంగని కొట్టనివాళ్ళకింద లెక్కకొచ్చి పోతామేమోనని బెంగటిల్లిపోయి పక్కనున్న వాడిచేతిలో కర్రలాగిపుచ్చుకుని ఆ మహోత్కర్షంలో తామూ వొక చెయ్యి వేశామనిపించుకుని తృప్తిపడ్డారు

దొంగ ఎట్లాగూ దొరికాడు కదా అని ఇంట్లో ఏమున్నదో ఏమి పోయిందో ఆరా చూడుకుంటున్నాడు జ్వాలాపతి చంద్రహారమూ వంకీలజతా కనపట్టంలేదన్నది అన్నపూర్ణ అవిగాని చేజిక్కించుకున్నాడేమోనని దొంగమొలలో నలుగురూ తడిమి చూశారు కాని అవుపళ్ళేదు "అప్పుడే ఎవడికైనా అందించేశాడేమో—వీళ్ళెప్పుడూ వొంటరిగా కన్నం వేశేందుకు రారు" అన్నాడొక బుద్ధిమంతుడు

"అప్పుడే వూరు దాటిపోయివుంటాయి కూడాను" అని బళ్ళపరివాడొక మోతుబరి నగలు వెతకాలిసిన బాధ్యత నెత్తి నించీ కిందికి దింపినందుకు అందరూ తేలికపడ్డారు ఆ నగలున్న ఉద్రేకంలో అందరికీ మళ్ళీ రోషం తిరగబెట్టింది ఈ సారి మరొక తట్టువరస దెబ్బలు పడగానే దొంగ తాళలేక వంటింట్లోకి దూరాడు జొరబడి గదుము చెవగ్గర మూర్ఛల్లా ముద్దలా కుప్పగూలి వెక్కుతు కక్కుకున్నాడు

అన్నపూర్ణ నిదానంగా చూచింది దొంగంటే రాక్షసిలా పెద్దపెద్ద కోరలూ గడ్డాలూ భీకరాకారంగా వుంటాడనుకుంది పదిహేను పదహారేళ్ళ పసివాడు! ప్రపంచంలో ఇంకా కళ్ళయినా తెరవని కుర్రకుంక! వీడా దొంగ? నిలువునా నీరయిపోయింది అన్నపూర్ణ

చచ్చిన పాముని చంపడానికి అంతా పోగయ్యారు మళ్ళీ అన్నపూర్ణ అటకాయించింది ఏమిటది? దున్నపోతుని బాదినట్టు బాదేస్తున్నారు! "కుర్రాడు చచ్చిపోతేనో" అని కేకలు పెట్టింది ఆ వుపాహస్విచ్చినొక్కినట్టయి అందరిగోనూ తళుక్కున మెరిసింది "చచ్చిపోతాడేమో" అన్నది గాని ఆ యిల్లాలు, నిజంగా చచ్చిపోయాడేమోనని బెదురు పుట్టింది చాలామందికి దానితో ఎర్రటోపీలూ, లారీకర్రలూ, పంచాయితీ రిపోర్టులూ, శవపరీక్షలూ, జైలుకటకటాలూ, అండమానుదీవులూ స్ఫురణకొచ్చాయందరికీ ఇహ క్రమంగా గుంపు పల్చబడింది

అంతలో నగలు దొరికినయ్యంటే దొరికినయ్యన్నారు, జ్వాలాపతికి చెమట కొచ్చింది క్రితం రాత్రి "ఎందుకయినా మంచిది. రోజులు బావుళ్ళేదు ట్రంకులో

భర్తృహరి సన్యసించినాడా ?

ప్రాచీనకాలములో భర్తృహరి వ్రాసిన "సుభాషితము" సంస్కృతములో వ్రాయబడిన గొప్ప గ్రంథము. ఆ శ్లోకములు తెనుగులోనికి భాషాంతరీకరింపబడెను. ఏనుగుల లక్ష్మణకవి యీ సంస్కృత సుభాషితమును చక్కని తెనుగు పద్యములలో రచించెను. ఈ తెనుగుపద్యముల సుభాషితంకూడా చాలా సుప్రసిద్ధమైన తెనుగు గ్రంథంగా ఉన్నది. భర్తృహరిసుభాషితంలోని తెనుగు పద్యములు విద్యార్థులకు, విద్వాంసులకు బాగా పరిచితములైన పద్యములు.

ఈ భర్తృహరి ఏనాటివాడో, అతని జీవితకథా విశేషము లేవియో నిశ్చయంగా నిర్ధారణగా తెలియడంలేదు. ఇతడు తన సుభాషితములో మూడు శతకములను వ్రాసియున్నాడు.

(1) నీతిశతకము

(2) శృంగారశతకము

(3) వైరాగ్యశతకము.

"యీ - ట్సింగ్" అనే పేరుగల ఒక చైనా యాత్రికుడు సుమారు రెండు వేల ఏండ్ల క్రిందట చైనానుండి భారతదేశమునకు వచ్చెను. ఈదేశములోని బౌద్ధమత పుణ్య క్షేత్రములను బౌద్ధవిద్యాపీఠములను పండితులను సందర్శించుటకు వచ్చెను. "యీ-ట్సింగ్" తన భారతదేశ పర్యటన విశేషములను వివరిస్తూ ఒక గ్రంథమును చైనా భాషలో ఆనాడు వ్రాసెను. ఈ ప్రాచీన చైనా యాత్రికుని గ్రంథములో యీ క్రింది విషయము వ్రాయబడెను.

"భర్తృహరి" యీ ప్రపంచ విషయ సౌఖ్యములందు చాలా అనురక్తుడై యుండెడివాడు. కామియై, ఐహిక సౌఖ్యాసక్తుడైయుండిన భర్తృహరి బౌద్ధ సన్యాసియగుటకు చాలాసార్లు యోచించెను. కాని, విషయ సౌఖ్యములను విడిచిపెట్టుటకు అతని మనస్సు ఒప్పుకోలేదు. ఇతనికి సన్యాసము యిప్పించవలెనని ఏడుసార్లు బౌద్ధగురువులు ప్రబల ప్రయత్నం చేసిరి.

చిట్టచివరకు సన్యసించి యుండవచ్చును.

★ దొంగామనిషి ★

ఎంతభద్రంగా దాచినా పెట్టెపెట్టేవికంగా ఎవడైనా కాజెయ్యగలడు. అంచాత అజాగర్తగా పూజలగదిలో దేవతార్చనపెట్టిలో తాళం లేకండా పడేసివుంచితే అక్కడ నగలుంటాయని నరమానవుడెవడికీ వూహకంద"దని తను చెప్పిన వుపాయం జ్వాలాపతీ మర్చిపోయాడు. పెనిమిటి చెప్పిన మీదట నగలు తనచేత్తో తనస్థలం మార్చిన సంగతి అన్నపూర్ణకీ గుర్తులేదు ఆ ఖంగారులో. అయితే దొంగ ఏమి కాజేసినట్టు, ఏమి దాచేసినట్టు అన్నది సమస్య అయి కూచుంది అందరికీ. ఏదో చోరీ చేసే వుంటాడు. అదిమాత్రం రూఢి.

అన్నపూర్ణ అంతా వెతికింది. ఏమీ పోలేదు. పళ్ళెంలో చిత్రాన్నంమాత్రం తరిగింది. వెండిగిన్నెలో పరమాన్నం మచ్చుకైనా లేదు. తప్పేలాలో తోడు కొంటూ తోడుకుంటూవున్న గొడ్డిగేదె పెరుగు సగానికిసగం మాయమయింది. వెండి అరిటాకులో అన్నం కలుపుకుని తిన్న ఆనవాలు స్పష్టంగా అవుపిస్తోంది. అంతే. "కడుపునిండా అన్నం తిందామని వొచ్చినట్టున్నాడు అభాగ్యుడు. మధ్యస్థంలో మనం అల్లరి పెట్టాము" అన్నాడు జ్వాలాపతి. "సగం తిని అర్ధాకలితో లేచిపోతున్న దరిద్రనారాయణు అన్యాయంగాపట్టుకుని కొట్టేశారు మీరు..."అన్నది అన్నపూర్ణ.అంతా తెల్లబోయారు. వాడు ఇంతాజేసి, ఆకలికి తట్టుకోలేక నాలుగు మెతుకులు కొరికిపోదామని ఇంటో జొరబడ్డ అనాథ అని తేలింది. చివరకి జ్వాలాపతి మనస్సు కరిగింది, ప్రమాదం గుర్తించాడు. ఏదో ఒకపెద్ద గజదొంగని పట్టుకున్న ప్రతిష్ఠ నిష్కారణంగా నేలపాలైపోతున్నందుకు చాలామందికి ఆశాభంగం కలిగింది. అంత త్వరగా దొంగని మనిషిగా గుర్తించాలిసిన అవసరమొస్తుందని ఎవ్వరూ అనుకోలేదు. ఏమి చేస్తారు? తప్పనిసరిగా అంతా గాయాలకి కట్లుగట్టే ప్రయత్నంలో పడ్డారు. కాని ఆకస్మికంగా పుట్టుకొచ్చిన దయారసాన్ని వెనక్కినెట్టి ఒక భయం అందరినీ ఆవరించింది. ఇది ఖూనీ కేసు కింద తయారయితే?

దానితో 'అరిపూస నాదగ్గర పుష్కలంగా వుంది తీసుకొస్తా'నని వొకడూ, 'మంగలి వీరన్న కట్లుగట్టడంలో మంచిచెయ్యి, వాడి హస్తవాసి మంచిది, చిటికలో లాక్కొస్తాను చూస్తూవుండం'డని మరొకడూ, 'నాదగ్గర మేలిరకం వాతరాక్షసముంది కాళ్ళూ చేతులూ చల్లబడితెయ్యేమో కని పెడుతూ వుండం'డని ఇంకొకడూ - ఇట్లా ప్రతి ఆసామీ మరొహాణ్ని వుండమని పురమాయించి అందరూ చల్లచల్లగా తలోకదారినీ ఇళ్లకి జారుకున్నారు. కడాపటికి ఖంగారుపడుతో జ్వాలాపతీ, కన్నీళ్లతో అన్నపూర్ణా కవురంపి రప్పించిన క్యాంపు డాక్టరూ మిగిలారు. జ్వాలాపతి మణికట్టు పట్టుకు చూచాడు. నాడి దొరకడంలేదు. అన్నపూర్ణ ముకుపుటాల దగ్గర వేలుపెట్టి చూచింది. వూపిరి సోకుతున్నట్టులేదు. డాక్టరుమాత్రం చకచకా అయొడిన్ రాసి సూచరింగ్ నీడిల్‌తో కుట్టి గాజ్ పీస్ యాక్రిప్లావిన్ లోషన్‌లోముంచి పొడిదూది పైనవేసి బ్యాండేజి చేశాడు. తలకి కట్లుకట్టాడు. కాళ్లకి, చేతులకి..వొళ్లంతా గాయపడినవాడికి ఎక్కడెక్కడ కట్లుకట్టాలో ఏమి తేలుతుంది?

పసివాడు కొంచెం తెప్పిరిల్లి కదిలాడు. అన్నపూర్ణా జ్వాలాపతీ చేతులు జోడించి కనపడే డాక్టరుకీ కనపడని దేవుడికీ దణ్ణాలు పెడుతున్నారు, ఈ పాదిత్యం తమకి చుట్టుకోకుండా కాపాడమని.

పసివాడిలో రవంత కదలిక కనిపించింది. నీరసంగా "అమ్మ - అయ్య—" అంటూ వేలు చూపిస్తున్నాడే దిక్కుకో. జ్వాలాపతికి మసకమసగ్గా గుర్తుకొచ్చింది. నిన్నరాత్రి ఖాళీలేదని తను తిప్పేసిన బడుగు రైతుకుటుంబం తాలూకా ఈ పసివాడు? అతని కేమీ తోచలేదు. వాళ్లు వూరిబైట మర్రిచెట్టుకింద మూటలు దింపుకుని వుసూరుమంటూ దిక్కులు చూస్తూ కూచోటం అతనెరుగును. అతన్ని చూశాడుకూడా. కాని, ఏమిటి చేసేది?

ఏదో ప్రమాదం కమ్ముకొచ్చేస్తోంది. పసివాడి మొహాన్ని నల్లని చాయ ముసురేసినట్టు ఆవరిస్తోంది. అన్నపూర్ణ చాతనయిన వుపచారాలు చేసింది. జ్వాలాపతి గూడా కన్న సంతానమయితే ఎంతగా తపనపడతాడో అంత ఆత్రమూ పడ్డా కాని డాక్టరు పొరపడ్డాడు యాక్టిటూటనస్

ఇన్‌జక్షన్ ఇవ్వడం మరిచిపోయాడీ ఆందోళనలో. సమయానికి జ్ఞప్తికొచ్చినా ప్రయోజనం లేకపోను. ఆ ఇంజక్షను క్యాంపు ఆసుపత్రిలో లేదు. బస్తీకి ఇరవైమైళ్లీ దూరం కవురుపెడితేనే గాని దొరకడం దుర్లభం. డాక్టరు పెదవు విరిచాడు. పసివాడికి ధనుర్వాతం కమ్మే సూచనలు కనపడసాగాయి. కన్నతల్లీ తండ్రీ చప్పగా ఆరిపోని నిస్పృహ అంచులలో పట్టుకుని వేళ్ళాడుతున్నారో యేమో ఆ పసివాడు పాపం దీనంగా వేలు ఆదిక్కుగా చూపిస్తూనే వున్నాడు. అన్నపూర్ణకి అర్థమయింది. ప్రాణం హరీఅనే లోపుగా తల్లినీ తండ్రినీ ఒక్కసారి కళ్లారా చూచుకుందామని తపన పడుతున్న ఆ పసివాడి లేతగుండె కళ్ళకి కట్టిందామెకి.

వాళ్లుకూడా ఎన్నిరోజులనించీ తిండి లేక అటుమటిస్తున్నారో ఆ చెట్టుకింద. జ్వాలాపతిగుండెలు వేగంతో కొట్టుకున్నాయి.

అన్నపూర్ణ గబగబా కిసింత అన్నమూ, వూరగాయీ మూటగట్టి "ఏమయినా సరే కుర్రవాణ్ణి తలిదండ్రుల చేతుల్లో పెట్టాలి—పెట్టితీరాలి — బండీ తీసుకురండి" అని తొందరపెట్టింది. డాక్టరుకూడా "నిజమే-అది మన ధర్మం" అన్నాడు ముక్తసరిగా. జ్వాలాపతి అదిరిపడ్డాడు. ఎట్లా? ఈ కాళరాత్రివేళ! మాట్లాడితే కరిచే ఈదర గాలిలో గడ్డకట్టిన చీకటి ఘడియల్లో—ఎక్కడ? ఎవరి కప్పగించేది? ఆ నిర్భాగ్యుల్ని ఎట్లా చూచేది? ఏమని సమాధానమిచ్చేది? తనని క్షమిస్తారా వాళ్ళు? తనుచేసిన అపచారం వాళ్ళకి మాత్రమేనా? అక్కడ ఆకల్తో అల్లాడే దిక్కులేని పక్షులందరిమీదా తుపాకీ పేల్చాడా? వాళ్ళందరి వుసురూ తనకి తగుల్తుందా? ఏమిటి పరిహారం దీనికి? జ్వాలాపతికి మెదట్లో రైళ్లు పరిగెడుతున్నాయి. "మీరు వచ్చినాసరే రాకపోయినాసరే నేనొకర్తెనీ కుర్రవాణ్ణి అప్పగించి వాళ్ళ పాదాల దగ్గిర పెట్టివస్తాను. చంపించిచాలక చచ్చేముందైనా మనం కలిగొంచం చూపకపోతే భగవంతుడూరుకోడు. నిష్కారణంగా వొక పసివాడి నిండుప్రాణాలు నిలువునా తీసింది చాలక, వాణ్ణి చివరి ఘడియలలో అమ్మకీ అయ్యకీ దూరంచేసి అదనంగా పాపం కట్టుకోవాలని వున్నదా మీకు? లేవండి ఆలోచించకండి" అన్నది ఆర్తింగా.

ఒక్కక్షణం ఆలస్యంచేస్తే, ఆ రాత్రి - ఆ ఘడియ ఆజన్మాంతమూ కొరివిదెయ్యాలల్లే వేటాడితీరతాయి గావును - దొంగ దొరికాడన్న సంబరమేకాని అంతా కలబడి కళ్లయెదట వొక మనిషిని చంపేస్తుంటే చూస్తూ వూరుకున్నామా-దొంగా మనిషేనన్న జ్ఞానమే నశించిపోయింది మనలో అని చలించిపోయారిద్దరూ.

కట్టేకట్లు కడుతూనే వున్నారు. కారే నెత్తురు కారుతూనే వుంది. బండి వచ్చింది. పదిలంగా కుర్రవాడిని బండిలో పడుకోబెట్టి బయలుదేరారు. డాక్టరు బండీ వెనకాలే నడుస్తున్నాడు. తోవలో ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

దూరాన్న మర్రిచెట్టుకిందనించీ హాహారావాలు వినిపిస్తున్నాయి. 'మసకచీకట్లో అన్నంపట్టుకొస్తానని ఆ వురుమంటూ బయలుదేరిన కుర్రకుంక ఇంకా రాలేదేమో' అని గగ్గోలుపడుతున్న అభాగ్యుల ఆక్రందన స్పష్టంగా వినపడుతోంది.

బండి ఆగింది. వొణుకుతున్న చేతులలో పెట్టారు గాయపడి కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ చిన్న దేహాన్ని. డాక్టరు బ్యాటరీలైటు వేసి జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పాడు. ముసలిరైతుదంపతులిద్దరూ గొల్లుమన్నారు. ఆ బక్కచిక్కిన పాలికాపు కళ్ళల్లో దారిద్ర్యంచాత ఇంకిపోగా ఇంకిపోగా మిగిలిన ఏ నిప్పునెరుసో కణకణలాడి భగ్గుమంది. అన్నపూర్ణ గజగజ వొణికిపోయింది. జ్వాలాపతి నీరసంగా నిలుచుండిపోయాడు.

పాలికాపు శోకావేశంలో తన చేతిలో వుంచిన మూట విప్పి అన్నమంతా వాళ్ళ మొహాన్ని ఝల్లునకొట్టి కెవ్వన కేక పెట్టాడు పిచ్చివాలకంగా. డాక్టరు బ్యాటరీలైటుమీట వెనక్కి నెట్టాడు. జిమ్మురుంటూ చీకటి కమ్మేసింది. బండి తిరుగుమొహం పట్టింది.

అటూ యిటూ మూగిన ఎత్తయిన నీలికొండలు ఆవులిస్తున్నాయి. సూదిమొనల లాంటి చుక్కల కిరణాలు గుండెలలో, గుండె లోతులలో అట్టడుగున తెట్టుగట్టిన పాపభయాన్నే కెలుకుతున్నాయి కక్కిరిస్తున్నాయి. ఇలకోడికూతలలోనుంచీ, తీతువుపిట్టల అరుపులలోనుంచీ, ప్రతిధ్వనిస్తూ వచ్చే శాపాలలాంటి వాక్కులు శూలపుపోటులై చెవులలోనించీ అంతరాంతరాలలోకి దూసుకుని పోతున్నాయి.

ఇంటో పడగానే జలదరించే కాళ్ళతో అమ్మణ్ణిని గట్టిగా కావిలించుకుంది అన్నపూర్ణ. ★

★ భానుమూర్తి బడ్జెట్టు ★

భానుమూర్తి ఆ నెలకు బడ్జెటు తయారుచేస్తున్నాడు. అరుగుపై గోడకానుకుని కూర్చొని పిల్లల ఎక్సర్‌సైజ్ పుస్తకంలోని పేజీలకు పేజీలు తిరేక దీక్షతో అంకెలు – మొత్తాలతో నింపేస్తున్నాడు. కాని ఎన్ని పేజీలు ఖరాబు చేసినా, ఎంత ఆర్థికశాస్త్ర ప్రావీణ్యతను వుపయోగించినా – బడ్జెటులోని తరుగు పూడ్చబడే వుపాయం కనబడలేదు. ఇంత అవస్థపడి లోటు బడ్జెటు తయారు చెయ్యాలమా అని అతడు మహాఖిన్నుడయ్యాడు. ఏదో వొక వుపాయం అన్వేషించాలనే పట్టుదలతో ఎడతెరిపి లేకుండా ఆలోచించగా హటాత్తుగా అతని బుర్రలో మెరుపువలె ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. తాను సంకల్పించిన యీ మహత్కార్యానికి భార్యయొక్క సహకారం ఎంతైనా అవసరమనే విషయం తటాలున జ్ఞప్తికి రావటంతో ఆశతో ఆమె వైపు చూశాడు. కమలమ్మ నట్టింట కూర్చొని బియ్యంలోని రాళ్లు ఏరుతూ వుంది. పిల్లలు మిట్ట ఆడుకుంటున్నారు. యీ సదవకాశాన్ని జారవిడువకూడదనే తలంపుతో భానుమూర్తి తన భార్యయొక్క సహకారాన్ని అర్థిస్తూ గంభీరమైన ఒక చిన్న వుపన్యాసం యివ్వటానికి వుద్యుక్తుడయ్యాడు.

'చూడు కమలం! చుక్కలంటిన ధరలతో వస్తువులన్నీ మనవైపు క్రూరంగా చూస్తున్నయ్. ప్రతి రూపాయీ బాధతో 'అయిపోతుందే' అనే దిగులుతో కర్చుపెట్టాల్సిన రోజులివి. యీ పరిస్థితుల్లో మనకు పొదుపరితనమే శరణ్యమ్. పావలా కర్చుబెట్టాల్సిన చోట ఏ బేడో కర్చు చేయాలనే దృక్పథం, ఎంతో వొకంత మిగిలించుకోవాలనే ఆదుర్దా–కర్చు తగ్గించుకోవాలనే మనస్తత్వం మనకు ఏర్పడాలి. ఎందుకలా నవ్వుతావ్. యిది అతి ముఖ్యమైన విషయం'—

'వున్నట్టుండి ఏదో మునిగిపోయినట్టు మాట్లాడడం ప్రారంభిస్తేనూ...' యింకా నవ్వసాగింది కమలమ్మ.

'మునిగిపోలేదూ – మునిగిపోయే ప్రమాదముందనే నీకు చెప్పటం. జీవితంలోని అతి ప్రధానమైన యీ ఆర్థికరంగంలో ఏమాత్రం వొడుదుడుకు లొచ్చినా కుదుటబడటం కష్టం – మొన్న రాజాజీ ఏమన్నాడో తెలుసా—'

'ఆయన మీతో ఏమన్నాడో నాకేం తెలుసు.'

"పరంధామయ్య"

'నాతో అన్నాడని చెప్పానా—'

'అయితే ఎవరితోనో ఏమో అని వుంటే మనకెందుకు లెండి—'

'అది కాదు...మనబోటివాళ్లను గురించే ఆయన ఒక వుపన్యాసం యిచ్చాడు. అది పత్రికల్లో వేశారు. దాన్ని నేను ఒకటికి పదిసార్లు చదివాను. ఎంత బాగుందనుకున్నావు. దాంట్లో వారు మనకొక అమూల్యమైన సలహా – కాదు – కాదు వుపదేశమే యిచ్చారనొచ్చు.'

'యీ కాలంలో సలహాలకు – వుపదేశాలకు కొరతేముందిలెండి. అవి యిచ్చేవారుకూడా – వాటిని తాము వినియోగించుకోనేంత స్వార్థపరులుగా వుండరు–'

'వారెట్లా వుంటే మనకేం – యింతకు వారిచ్చిన సలహా యేమంటే ఆదాయాన్ని బట్టి కర్చు చేయమన్నారు.'

'ఇంతేనా – ఆవిషయం మా నాయనమ్మకూడా పదే పదే చెప్పుతుండేది.'

'మనం మరిచిపోయిన మన ప్రాచీనుల అమూల్యానుభవాన్ని జ్ఞప్తికి తేవటం కూడా గొప్ప సంగతని నా అభిప్రాయం–'

'అంతకన్నా వారు సాధించే ఘనకార్యంకూడా ఏమీ లేదులెండి—'

'అదే నీవు పడే పొరబాటు. వారి విషయం మన కనవసరం. వారు చెప్పిన విషయం మంచిదా కాదా? మంచిదైతే ఆచరణలో బెట్టడం...'

'ఆచరించక యిప్పుడు మనం చేస్తున్నదేంది. వచ్చే ఆ జీతం కర్చుబెట్టుకోటమేనా – యింకేమన్నా ఆస్థిపాస్తులు కరగదీస్తున్నామా? అసలవి వుంటేగా – అయినా నాదేముంది. తెస్తే యింత వుడకేసేదాన్ని.'

'ఆ వుడకేసేదాంట్లోనే – చిట్టెడు కంది పప్పు వెయ్యాల్సినచోట – అరచిట్టెడు. రెండు మిల్లిగెరిటెల నెయ్యికి బదులు మిల్లిగరిటెడు. యిలాగే ప్రతిదీ పొదుపు చేసుకోవాలి. గుడ్డల్లో గూడ ఆ వెధవ వాయిల్స్ ఎందుకు చెప్పు. డబ్బుదండగ. ఆ పిల్లలగుడ్డలు గూడ కొంచెం మాపుకాగేవిగా – నాలుగురోజులు దిట్టంగా వుండేవి–కుట్టిస్తే...'

'యిప్పుడంతా మేమేదో బెనారస్ సిల్కులు వాడుతున్నట్లు—'

'సిల్కులు వాడుతున్నావనా–ఆవాడేదాంట్లోనే యింకా మప్పితం – ఎంతో వొకింత మిగిలించాలనే తహతహ ఏర్పడాలంటాను.'

'ఈ చాలీ చాలని జీతపు రాళ్ళుకూడా లబలబ లాడుతూ కర్చుబెట్టాలంటారు.'

'అబ్బెబ్బే – నేననేదొకటి. నీవు అర్థంచేసుకొనేదొకటి – మొన్న నీవు చీరకొన్నావు – ఎంత?'

'ఒక్కదాని మొహాన పదిహేను కొట్టేదానికంటె – పది రూపాయల్లో వచ్చేవి మూడో నాలుగో కొంటె

మూడు రోజుల కొకసారి నేను చాకలాడికోసం పరుగెత్తే అవస్థకూడా తప్పుతుంది. కొన్ని రోజులు కొనకుండా నెట్టక

పోవటం—'

'పది రూపాయల కొచ్చేవి అట్టనే అధ్వాన్నంగా వుంటయ్. రెండు వుతుకుల కల్లా రంగు పూసి - మూడో వుతుక్కు వొడిసిపోతయ్. మీరు మొన్న పిల్లలకు కుట్టించిన గుడ్డలు - చవకన్నమాటేగాని, వాటంత దండగ - రామ రామ - రెండుతుకులకల్లా పిగిలిపోసాగినయ్. ఆ మాదిరయితే దండగలు పెడతారు గాని'

'అంత మరీ అధ్వాన్నంగా వుండేవి గాకులే - ఒక మాదిరివి. అవసరాన్ని గడపగలిగేవి చాలుగదా అంటాను. ఇంతకూ నీకా దృక్పథం-పొదుపుగా వాడుకోటం అలవడాలంటాను—'

'మీ ధోరణి మీదే గాని - యిక్కడ బారా యేం చేస్తున్నామని. అసలుం)గా చేయటానికి.'

'కాని మనమీదుండే గురుతర బాధ్యతలనుబట్టి - ఏదో యింత వెనకేస్తే తప్ప.'

'ఇప్పటి కెంత వెనకేశారు—'

'ఏ కొంచెం వెనకేసివున్నా - మొన్న నీ కాన్పుకి ఆ దండ ఎందుకు కుదువ బెట్టాలసొచ్చేది. చచ్చినట్టు నెలకు పది చెల్లిస్తున్నాంగా వడ్డీ గాక—'

'అయితే—'

'అటువంటి వేవో అవాంతరాలు వస్తూ వుంటయి కొబట్టి, ఏదో కొంచెం వెనకేశి వుంటే.'

'వెనకేస్తాం – వెనకేస్తాం అని యీ ఆరేళ్ళదగ్గరినుంచి అనటమే గాని – మీరు కూడబెట్టింది ఏమీ లేదు. సాధ్యం గాని దాన్ని వూరికే అనుకుంటూ మనసు పాడు చేసుకోటం తప్ప—'

'సాధ్యము కానిదంటూ ఒకటుంటుందా ఏం. దండగ కర్చులన్ని తగ్గించుకొని ఎట్లనో సరిపెట్టుకోవాలి మరి. ఇక్కడ పుష్కలంగానన్నా వుంటే—'

'ఏమిటో ఆ దండగ కర్చులు-పలానివని చెపితేగా. దండగ .. దండగంటూ బూర గెత్తుకొని - నన్ను నానా హైరానా పెడుతున్నారు.'

'చూస్తే అన్నీ అవసరంగానే కనబడతయ్. కాని ఎక్కడికక్కడ తెగతెంపులు చేసుకోవాలి. ఇంతెందుకు. సినిమాకు పోయినామనకో—'

'ఇంతా సినిమాకోస మన్నమాట యీ రచ్చంతా'

'వృథాగా డబ్బు దండగ తప్ప దానివల్ల యేమైనా వుపయోగముందా! రాజాజీ కూడా తప్పనిసరి అవసరాలకే డబ్బులు చాలనపుడు సినిమాల కెక్కడో స్తయ్' అని అన్నాడు.

'వాళ్ళది అన్నారు వీళ్ళది అన్నారు అని వూరికే చెప్పటం దేనికి? నీవు సినిమాకి పోవటం నాకిష్టం లేదని చెప్పండి—ఎప్పుడన్నా నెల కోసారి పోతున్నా నేమొ - యిక అది కూడా మానేస్తాను.'

'మానేయాలి. లేకుంటే—'

'ఇక పోనీయండి. మానేస్తాను అని అన్నానుగా—పొద్దుగూకులా మీతో వాదులేసుకోటానికి నాకు తీరిక లేదు.'

రాళ్ళేరటం అయిందేమో కమలమ్మ బియ్యం తీసుకొని వంటింట్లోకి పోయింది.

'అంత సులభంగా అవి వాళ్ళ బుర్రల కెక్కవు. అయినా కచ్చితంగా అమలు పరచాలి. మొదట కొంచెం కష్టం వుంటే వుండొచ్చు. నాలుగు రోజులు చిరాకు పడుతూ వుంటుంది. పది రూపాయలు వెనకేశామంటే—వాళ్ళకే తెలుస్తుంది. తర్వాత వాళ్ళే పాకులాడుతారు.'

భానుమూర్తి అరుగు దిగి గదిలో పచారు చేస్తూ అనుకోసాగాడు. ఇంతలో బయట జట్కా ఆగిన చప్పుడు కాగా వాకిలివైపు చూశాడు. తమ్ముడు రామమూర్తి, అతని భార్య లీల జట్కా దిగారు. భానుమూర్తి గుండెలు అపాయాన్ని శంకిస్తున్నట్లు

(52-వ పేజీ చూడండి)

నారదులవారి సరదారాగం

పంజాబురాష్ట్రంలో సిమ్లానగర ప్రాంతంలోని హిమాలయ పర్వతములలో నివసించు చున్నటువంటి జనులు చాలా చక్కని పాటలు పాడుతూ నృత్యములు చేస్తారు.

స్త్రీలు పురుషులు చాలా అందంగా ఉంటారు. గాంధర్వ వివాహాలు వారిలో ఎక్కువ పరిపాటిగా జరుగుతూ ఉంటాయి.

స్త్రీలుపురుషులు కూడా చక్కని పాటలు అనేకము పాడగలరు. సంగీతం అనే "విమల గాంధర్వంబు-వెన్నతోడ బెట్టిన" విద్య వారికి- వారి కంఠస్వరం చాలా మనోహరంగా ఉంటుంది.

"జంఝూటిరాగం అవతరించిన విధం" అనే ఒకకథ యీప్రాంతము వారు యీ క్రిందివిధముగా చెప్పుచుందురు.

నారదులవారు మూడులోకములు తిరిగి తిరిగి అలసటవచ్చి, యీసిమ్లా నగరంవద్ద హిమాలయపర్వతములలో వసంతఋతువులో ఒక చక్కని వన ప్రదేశంలో హాయిగా విశ్రమించారు. అప్పుడు ఆ రమ్య వనప్రదేశములో తన అలసట పోయేటట్లుగా ఒక చక్కని రాగమును నారదులవారు ఆలాపన చేశారు. ఆ పర్వతవాసుల పంజాబీ భాషలో "జంఝూటం" అంటే "పనిఒత్తిడి." "ఊపిరి సలుపని పని" అర్థం- : మనస్సుకు కలిగిన ఆయాసము, లేదా అలసట అనేభావం ఆమాటలో ఉంది. అటువంటి అలసటను పోగొట్టేటటువంటి రాగమును నారదులవారు అప్పుడు ఆలాపన చేశారు. అందువల్ల ఆ రాగమునకు "జంఝూటి" రాగము అనే పేరు వచ్చింది. "జంఝోటీ" అంటే, "మనోవ్యాకులమును అతిక్రమించేది" అని అర్థం.

విశ్రాంతి గైకొన్న తర్వాత నారదులవారు ఆ సిమ్లా కొండప్రాంతాల నుండి వెళ్లిపోయినారు కాని, ఆ జంఝోటి రాగము మాత్రము యీ పర్వతప్రాంతవాసులకు నారద వరప్రసాదంలాగున లభ్యమై వారిసంగీతమయమైన జీవితంలో లీనమై పోయినదట.

జంఝోటిరాగము యీ ప్రాంత వాసులకు చాలా ప్రీతికరమైన రాగం. ఆరాగంలో వారు అనేక కీర్తనలు పాడుతూ ఉంటారు. ఆ రాగాన్ని గురించి వారు చెప్పుకొనే కథ ఇది.

మిత్రలాభం

(బొమ్మల కథ - సీరియల్)

లోగడ 'మిత్రభేదం' బొమ్మల కథలు ప్రచురించినట్లు గానే 31-12-'52 సంచికతో ప్రారంభించి 'మిత్రలాభం' బొమ్మల కథలు ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో ప్రచురింపగలము. —సం.

పగటి వేషాలు

"ఒరేయ్! పగటి వేషగాళ్ళొచ్చార్రో" కేక వేశాడు బాబిగాడు. తమ్ముడు విశ్వం, చెల్లెలు లలిత ఆడుకొంటున్న వాళ్ళల్లా లగెత్తుకువచ్చారు.

లలిత గబగబా ఇంట్లోకి వెళ్ళింది వాళ్ళక్కయ్య జానకిని పిలవడానికి. జానకీ, బావా ఒక గదిలోనే వున్నారు. లలితకు అవేమీ తెలియవు. గబాలున తలుపు తీసుకొని లోపలికి జొరబడింది. ఆశ్చర్యంగా కళ్ళన్నీ పెద్దవి చేసేసి ఏదో పెద్ద బ్రహ్మాండం బ్రద్దలయ్యేటంతటి విషయం చెపుతున్నట్లుగా మొఖం పెట్టి "అక్కా! పగటివేషగాళ్లొచ్చారే. ఎంత బాగా వేషం వేశారనుకున్నావు? చూద్దూ గాని రావే" అంటూ చెయ్యిపట్టుకొని లాగింది.

జానకి "నిజంగానా!" అంటూ చెల్లెలి వెంట వాకిట్లోకి బయలుదేరింది. బాబిగాడు వాళ్ళను వివిధరకాలైన ప్రశ్నలు వర్షం కురిపిస్తూ, ఆడిస్తూ, ఏడిపిస్తున్నాడు. వేషగాళ్ళు పాపం వాడి ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదు. బాబిగాడి ముందు వాళ్ళ ఆటలేమీ సాగడంలేదు. జానకి వచ్చేసరికి పగటి వేషగాళ్లు వాకిట్లో నిలబడి వున్నారు. మొత్తం ఇద్దరు. దాంట్లో పెద్దవాడికి ముప్పయి ఏళ్ళు వున్నట్లుగా కనిపిస్తున్నా యిరవై పైనకంటె ఎక్కువ వుండవు. అతను దర్జాగా కొత్త పాంటు వేశాడు. అది అప్పుడే విప్పిన ఇస్త్రీమడతలాగా వుంది. ఇంకా నలగనన్నా లేదు. చక్కటి వెస్ట్‌కోటు బనాయించేసి, నెత్తిన టోపీ పెట్టాడు. ఎక్కణ్ణుంచి వచ్చిందో గానీ, కాళ్ళకు నల్లని బూటు గూడా వేశాడు. అతని ప్రక్కన అదే వేషంలో పదకొండు, పన్నెండేళ్ళ చిన్న కుఱ్ఱాడొకడున్నాడు. జానకి వాళ్ళిద్దర్నీ చూచి బుగ్గమీద వేలు వేసుకొని "వేషం ఎంత బాగా కట్టారు" అన్నది ఎంతో సంభ్రమాశ్చర్యాలతో.

"ఇకేమి చూచావె! ఇందాక శక్తివేషం చూడలేదు. ఎంత బావుందనుకున్నావు!" అన్నాడు తనే చూచానుగదా అనే గర్వంతో బాబిగాడు.

వాకిట్లో నుంచున్న వేషగాళ్లు బాబిగాడి మాటలతో నిరుత్సాహపడి బాగా మెప్పించాలని గాబోలు ప్రసంగంలోకి దిగారు.

పెద్దఅతను చేతికఱ్ఱను త్రిప్పుతూ "సుందరరావుగారున్నారా అండీ?" అన్నాడు. అక్కడున్న పిల్లలందరూ ఘొల్లున నవ్వారు. "భలేవాడివిరా. మాబావ పేరు నీకెలా తెలిసింది?" అని నవ్వుతూ అడిగింది లలిత.

జానకి కొంచెంసేపు నవ్వి "భలేగా వుందే వేషం. మీరెవరోగాని అచ్చం దొరలకు మల్లేనే కట్టారా వేషం. అబ్బే అసలు భేదమే కనిపెట్టలేం" అంది. అంతలో తల్లి శాంతమ్మగారు కూడా అక్కడికే వచ్చింది. జానకి వాళ్లమ్మ చెయ్యిపుచ్చుకుని "చూడవే అమ్మా. వాళ్ల వేషం ఎంత దర్జాగా వుందో" అని కాస్త సిగ్గుపడుతూ "మీ అల్లుడు గారినిగూడా అడుగుతున్నారు. వీళ్ళ తెలివి చూడవే ఎక్కడ కనుక్కున్నారో మీ అల్లుడుగారొచ్చారనీ" అంది.

శాంతమ్మగారు ముక్కుమీద వేలువేసుకొని "అబ్బ! వేషగాళ్లంటె మీరు నాయనా! వేషం ఎంతబాగా వేశారు. రండి! రండికూర్చోండి. లోపలికి రండిరా" అంటూ దారి చూపించింది. వాకిట్లో వాళ్ళిద్దరూ వసారాలోనికి వచ్చి అక్కడున్న కుర్చీల్లో దర్జాగా కూర్చున్నారు.

శాంతమ్మ బాబిగాణ్ణి పిలిచి "ఒరే! మీ బావను పిలవరా? చూస్తారు ఆయన గూడా!" అంది.

బాబిగాడు "పోనీవే! ఈ పల్లెటూరి పగటివేషాలే చూడాలేమిటి ఆయన. ఇక్కడే మనం వేషాలు చూస్తున్నాంగాని ఆయన అచ్చం ఇటువంటి మనుష్యుల్నెందర్నో రోజూ చూస్తూ వుంటాడు" అన్నాడు విసుగ్గా.

బాబిగాడు వెళ్ళకపోవడం చూచి లలిత గబగబా వెళ్లి "దొరవేషాలొచ్చాయి బావా! చూద్దూగాని రా బావా! అమ్మ నిన్ను చూడ్డానికి రమ్మని అంటోంది" అంది.

సుందర్రావు ఇంటికి కొత్తల్లుడు. అసలే సిగ్గు. అతనికి పగటివేషాలు చూడాలని లేదు. అయినా అత్తగారు మాత్రం తనవంటి బస్తీకుఱ్ఱాణ్ణి వెధవ పగటివేషాలు చూడ్డానికి చిన్నపిల్లలికిమల్లే రామనడమేమిటి? "సరేలే! వస్తున్నా పద. వస్తున్నానని చెప్పు" అని చెప్పి లలితను పంపించేసి అద్దంలో ముఖాన్ని చూచుకొంటూ తల దువ్వుకొంటూ షోకు చేసుకోవడం మొదలు పెట్టాడు.

లలిత ఒక్కర్తే వచ్చేసి మళ్ళీ వేషగాళ్ళను చూచే ప్రేక్షకులలో కలసిపోయింది. ఉన్నకొద్దీ పిల్లలు ఒక్కొక్కరే చేరుతున్నారు. వాకిటినిండా పిల్లలగుంపే. అందరూ విరగబడి వింత చూస్తున్నారు.

శాంతమ్మగారు ఆ వేషగాళ్ళను ప్రశ్నలు వేయడం మొదలుపెట్టింది.

"ఏ వూర్రా అబ్బీ మీది?"

పెద్దతను కాస్త తెల్లబోయి "మాదీ వూరుగాదండీ! మా అత్తవారింటికి వచ్చాను. మీ అల్లుడుగారూ, నేనూ ఒకే చోట పనిచేస్తూ వుండేవాళ్ళం. ఆయన పనిచేసే కంపెనీలోనే నాకూ ఉద్యోగం. సుందర్రావుగారితో కొద్దిగా మాట్లాడవలసిన పనివుండి వచ్చాను." అన్నాడు.

"ఓరి నీ మాటలు బంగారంగాను, ఎంత చమత్కారంగా మాట్లాడుతున్నావురా? అయితే ఏమన్నావూ? ఈ వూర్లో మీ అత్తగారున్నారటరా?" అంటూ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వడం మొదలు పెట్టింది శాంతమ్మగారు. పిల్లలు గూడా నవ్వుతునే వున్నారు వేషగాడి మాటల్ని చూచి.

ఇద్దర్లోనూ చిన్న వేషగాడు బిక్క మొఖం వేసేశాడు అంతమంది పిల్లల్ని చూచి బెదిరిపోయి. పిల్లలంతా అతని చుట్టూ చేరి "ఒరే! లిల్లీపుట్! నీవు మాట్లాడవేమిరా?" అంటూ వాణ్ని లంకించుకొన్నారు.

పెద్దతనికి తన కుఱ్ఱాణ్ణి ఏడిపించడానికి పూనుకొనేసరికి అతని ముఖమంతా జేవురించింది. కాస్తవిసుగ్గా పిల్లల్ని అదలిస్తూ "ఏమండోయ్! ఉంటే ఉన్నాడని చెప్పండి. లేకపోతే లేడని చెప్పండి" అన్నాడు. శాంతమ్మగారు చూస్తూ పూరుకొంది ఇంకేం తమాషాగా మాట్లాడతాడో చూడాలని. అతను ఇంకా విసుగ్గా "అసలు సోమసుందర్రావుగారు మీ అల్లుడేనా?" అన్నాడు.

శాంతమ్మగారు మరింత నవ్వుతూ కూతురితో "ఒసే! అమ్మాయీ చూడవే ఎంత నవ్వొచ్చేటట్లుగా మాట్లాడుతున్నాడో!

అసలు నాటకాల్లో వేషాలేసే వాళ్లు కూడా ఇలాగే వుంటారే! కోపంగా వుండాలన్నప్పుడు కోపం! ఏడుపొచ్చినప్పుడు ఏడుపూ, నవ్వొచ్చినప్పుడు నవ్వూ చూపించగలరు వాడిముఖంలో కోపం ఎంత ఇదిగా కనపడుతోందో చూడు" అంది తరువాత గడ్డం క్రింద చెయ్యిపెట్టుకొని "ఎంత జబర్దస్తీగా మాట్లాడావురా నాయనా! అయితే నాయనా! తెలీక అడుగుతాను: ఎల్లకాలం ఇలాగే వేషాలేస్తూ వుంటారటరా? ఈ దసరా వెళ్లిపోతే ఈపగటి వేషాలు చూచేవారుండరుగదా మరి ఎలా కాలం గడుపుతారు?" అంటూ ప్రశ్నించింది

అతను చికాకుపడ్డట్టుగా "అబ్బే మేం పగటివేషాలు వేయమండీ! నిక్షేపంలాంటి బ్రాహ్మణుల్ని పట్టుకొని, నిలువునా పగటివేషగాళ్ళని అంటున్నారేమిటి? అసలు మీ అల్లుడుంటే ఒక్కసారి రమ్మని చెప్పండి, లేకపోతే ఇప్పుడే వెళ్ళిపోతాం"

పిల్లలందరూ ఉత్సాహంగా చప్పట్లు చరిచారు వేషగాడు మాట్లాడే మాటలకు కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వుతున్నారు "సుందర్రావుతోపాటు పనిచేస్తున్నానని" చెప్పిన ఆ పగటివేషగాడి మాటలకి అందరికీ నవ్వొచ్చింది

శాంతమ్మగారు:

"నిజమేరా నాయనా! మిమ్మల్ని చూస్తే ఎవ్వరూ పగటివేషగాళ్ళనే అనుకోరు ఆఫీసర్లలాగే వున్నారు ఆ మాట్లాడే తీరలా అలవడిందో! ఎంత నేర్పుంటే మాత్రమే? దసరా రోజుల్లో తప్ప మీ మొఖం చూచేవారెవరు నాయనా? ఇదివరకటి రోజుల్లో నయితే పెద్దపెద్ద మహారాజులే మీవంటి వాళ్ళను పోషించేవారు ఈ రోజుల్లో వాళ్లేరీ? వాళ్ళతోపాటే మీకళా నశించిపోయింది ఏదో నీవంటి వాళ్లుండి దాన్నే పట్టుకొని ప్రాకులాడుతూ వుంటారు అభిమానం చావక పాపం! ఇప్పుడు మీ ముఖాలు చూచేవారే లేరు" అంటూ వాళ్ళను ఓదార్చింది

వేషగాడు ముఖమంతా ఎఱ్ఱగా చేసుకొని, చిట్లిస్తూ "ఏమండీ! వెళ్ళిపొమ్మంటారా? ఆయన లేడల్లేవుంది ఇంట్లో" అన్నాడు కుర్చీమీద నుంచి లేచి వెళ్ళబోయాడు బాబిగాడు వెళ్లేవాళ్లను ఆపుచేసి "హాస్యాలు తరువాత మాట్లాడుకోవచ్చులేరా! ముందు గమ్మత్తయినపాట పాడు" అన్నాడు

లలిత "సినిమాపాట లయితే బావుంటాయిరా! అవి పాడించరా అన్నయ్యా" అంది

పిల్లలంతా "పాటలొద్దు మాటలే బావున్నాయ్ ఇంకా మాటలే చెప్పమనండి, అంటూ గోలచేశారు బాబిగాడు "ఏదీ చాల్లేపోయ్! ఇది మాయిల్లు మాయింటికి వచ్చినప్పుడు మా యిష్టంవచ్చినట్లుగా పాడించుకొంటాం; మీ ఇంటికొస్తే మీరు మాటలే చెప్పించుకోండి" అన్నాడు

అందులో ఒకడు "ఇంగ్లీషు డ్యాన్సు చెయ్యమను" అన్నాడు

బాబిగాడి కది నచ్చింది ఎగిరి గంతేసి "నిజమేరోయ్! ఇంగ్లీషు డ్యాన్సు చేస్తూ పాటపాడు" అన్నాడు పగటివేషగాళ్ళు ఇంతవరకూ ఆడిన నాటకం అయిపోవడంతో జానకి అక్కణ్ణించి సుందర్రావు దగ్గిరికి వెళ్ళిపోయింది

సుందర్రావు "ఎవరు వస్తా?" అన్నాడు.

"ఎవరో పగటివేషగాళ్ళట [illegible] బావున్నారండీ? పక్కా సీమదొరలకీ, వాళ్ళకీ తేడా కనిపెట్టనేలేము మీకంటె కూడా మంచిబట్టలు వేశారు చేతిలో కఱ్ఱ, కాళ్ళకు బూట్లు, కళ్లకు జోడు; ఎంత దర్జాగా వున్నారనీ! భలేభలే మాటలు చెపుతున్నారండీ! రాగానే సిగ్గు నభినయిస్తూ ముందుగా ఇంటి అల్లుణ్ణే అడుగుతున్నారు" అంది ఈ క్రొత్తపద్ధతి విని "నిజంగానా" అన్నాడు సుందర్రావు ఆశ్చర్యంగా! "భలేపద్ధతి మొదలుపెట్టారే!? అల్లుళ్ళదగ్గర గలగల్లాడుతూ



వుంటాయని కనిపెట్టే ఎత్తాడు ఎత్తు. అయినా ఏమని అనుకుంటున్నారు ?" అన్నాడు ఆదుర్దాగా తెలుసుకోవాలన్న కుతూహలంతో.

"ఏముందేమిటండీ ? మీ పేరుపెట్టి అడిగేస్తూ వుంటేనూ! 'సుందర్రావు గారున్నారండీ' అని దుమ్మునడిగారు." మీతో పాటుగా మీరు పని చేసే చోటే పనిచేస్తున్నామనీ, మీ తోపాటు కలిసి తిరిగేవాళ్లమనీ చెపుతున్నారు"

"భలే వేషగాళ్ళనే!? పేర్లుగూడా కనుక్కున్నారన్నమాట."

బయట పిల్లల గల్లంతు ఎక్కువైంది. బాబిగాడు పాటపాడమని బలవంతపెడుతున్నాడు. పాపం వాళ్ళకు పాటలు రావేమో ఖర్మం నోరు ఒప్పగించి చూస్తూ నిలబడిపోయారు. పిల్లలంతా కేకలు పెడుతూ గల్లంతు చేస్తున్నారు. కాంతమ్మగారు లోనికెళ్ళి చేటలో బియ్యం పోసుకొని తెచ్చింది. వేషగాళ్లిద్దరూ కోపంగా కూర్చున్న కుర్చీలో నుంచి లేచారు. కాంతమ్మగారు చిరునవ్వు నవ్వుతూ "ఓరి! మీ కడుపు బంగారంగాను, బియ్యం పట్టరటరా ? అవునులే దొరలు బియ్యం ఎందుకు పడతారు" అంటూ చమత్కరించి "సరేలే! డబ్బు లిస్తానుండండి" అంటూ లోనికెళ్లింది. బాబిగాడూ, తక్కిన పిల్లలూ అందరూ నుంచున్న వాళ్ళను బలవంతాన కుర్చీల్లో కూలవేశారు. బాబిగాడు బ్రతిమలాడుతున్నాడు. "ఒరే! ఒక్కపాటంటే ఒక్కపాట. పోనీ డ్యాన్సు చెయ్యొద్దులే!" అన్నాడు.

ఇంతసేపటినుంచీ కబుర్లు చెపుతున్నా చేబులో రెండు డబ్బాలబియ్యమైనా లేవని వేషగాళ్ళకు కోపం వచ్చింది గాబోలు. కాంతమ్మగారు పావలాబిళ్ళ తీసుకొచ్చి ఇవ్వబోయింది. వాళ్ళిద్దరూ ఆ పావలాను తీసుకోకుండా కోపంగా పిల్లల్ని తోసు

కొని బయట పడబోయారు.

కాంతమ్మగారు "ఒరే! అబ్బీ! ఆయ నింటిదగ్గర లేరురా! ఆయ నింటిదగ్గరుంటే ఇంతకంటే ఎక్కువే ఇచ్చేవారు. ఏదో దీంతోనే సంతోషపడు" అంది. పిల్లలంతా "ఒక పాట పాడించం"డని గోలపెడుతున్నారు. ఆమె పిల్లల్ని అదలిస్తూ "పోనీండి పాపం ప్రొద్దు కుంకిపోతూ వుంది. ఇంకో రెండిళ్లు తిరగొద్దూ! ఇక్కడే మీదగ్గర పాడుతూ కూర్చుంటే ఎలాగు? పాపం వాళ్ళను వెళ్ళనివ్వండి" అంది.

పెద్దవేషగాడు రోషంతో మొఖమంతా ఎఱ్ఱగా చేసుకొని "ఏమండోయ్! కాస్త మర్యాదగా మాట్లాడండి. ఇందాకట్నించీ చూస్తున్నాను మీ ధోరణి. ఏదో పగటి వేషగాళ్ళను చూచినట్లు చూస్తూ ఆడిస్తున్నారుతప్ప మర్యాదా గిర్యాదా ఏమీ లేదు. మీ అల్లుడు సుందర్రావుగారుంటే వున్నారని చెప్పడం, లేకపోతే లేరని చెప్పడం మీ ధర్మం గానీ, ఇంటికొచ్చినవాళ్ళ నిలా చేయడం ధర్మం గాదు. మీకు తగదు. సుందర్రావు గారి మొఖంచూచి ఇంతవరకూ వూరుకుంటూవచ్చాము. ఇక వెళ్లొస్తాము. పదరా" అంటూ కుర్రాణ్ని నడిపించుకొని పోతూవున్నాడు.

సుందర్రావుకి గదిలో గూడా పిల్లల కాకిగోలంతా వినపడుతూనే వుంది. జానకి బలవంతాన సుందర్రావును పగటివేషాలు చూపించడానికి బయటికి తీసుకొచ్చింది. బయటికి వచ్చేసరికి వాళ్లిద్దరూ పిల్లల గుంపును తోసుకొంటూ వెళ్లిపోతున్నారు. జానకి "ఒరే బాబిగా! వాళ్ళని పిలవరా! మీ బావగారు చూస్తారట" అంది. బాబిగాడు పిలవడం లేదు, ఏమీ లేదు. పిల్లలంతా అమాంతంగా వాళ్ళిద్దర్ని లాక్కొచ్చారు.

సుందర్రావు వాళ్ళిద్దర్నీ చూచి నిలువునా నీరయిపోయాడు— నిర్ఘాంతపడి తటపటాయిస్తూ, 'హల్లో రామచంద్రరావుగారూ! మీరా" అన్నాడు. క్రిందికి దిగి చెయ్యందిస్తూ!

పిల్లలంతా సుందర్రావు ధోరణి చూచి శిలాప్రతిమల్లా నిలుచుండిపోయారు.

"ఏమిటండీ ఇది ?" అన్నాడు సుందర్రావు. రామచంద్రరావుముఖాన కత్తివాటు కయినా నెత్తురు చుక్కలేదు. "ఏముందండీ! మీ దర్శనార్థం వచ్చినందుకు ఫలితం !" అన్నాడు.

"సుందర్రావు అజ్ఞ ఇవ్వగానే బాబి

గాడు పిల్లలందర్నీ తరిమేశాడు. పిల్లలందరూ వెళ్లిపోగానే మహాపదనుంచి బయటపడ్డట్లు దీర్ఘమైన నిశ్వాసం విడిచాడు కుఱ్ఱాడు.

సుందర్రావు రామచంద్రరావును కుర్చీలో కూర్చోబెట్టి "ఎందుకొచ్చారు.? అసలేమిటీకథ ?" అని ప్రశ్నించాడు. జానకి ఈదృశ్యం చూస్తూ నోటవెంట మాటరాక సుద్దపు చెక్కలా నిలుచుండిపోయింది కొంచెంసేపు. తరువాత గభాలున అక్కణ్ణించి ఇంట్లోకి పరిగెత్తింది. సుందర్రావు బాబిగాడితో "ఒరే! మీ అక్కయ్యను కాఫీ తీసుకరమ్మనరా" అని చెప్పాడు.

రామచంద్రరావు "అబ్బే! వద్దులేవోయ్!" అంటూ, చెప్పడం మొదలుపెట్టాడు.

"మా అత్తవారి వూరుగూడా ఇదేనోయ్; పండక్కి వచ్చాను. మీ అత్తవారిల్లూ ఇక్కడేనని తెలిసింది. ఆఫీసుకు శెలవు పెట్టడంవల్ల తప్పకుండా ఇక్కడే వచ్చి వుంటావనుకున్నాను. ఇంటిదగ్గర "అలా షికారుగా వెళ్ళొస్తా"మని చెప్పి బయలుదేరి ఎలాగో ఇల్లు కనుక్కొని వచ్చాం! ఇక జరిగిందేమిటో నువ్వూ చూస్తూనే వున్నావుగా ?" అన్నాము.

చిన్న కుఱ్ఱాడు భయపడిపోయాడట్టే వుంది "బాబోయ్! త్వరగా పద ఇంటికి వెళ్ళిపోదాం" అన్నాడు. సుందర్రావుకు నవ్వొచ్చిందిగానీ నవ్వలేదు.

"అయ్యో! పాపం!" అన్నాడు సుందర్రావు. "నీవు విచారపడడం ఎందుకులే! ఈ పల్లెటూళ్లో అదిగాక ఈ దసరాపండుగ రోజుల్లో ఈ లాడూబీడూ వేయడం నాది పొరపాటు గానీ, నీదేముంది." అన్నాడు

లేనినవ్వు తెచ్చుకుంటూ!

"అయితే మీ అత్తగారి వూరిదే నన్నావు. మీ మామగారి పేరేమిటి?" అన్నాడు సుందర్రావు.

"బలిజేపల్లి నాగభూషణంగారు."

తలుపుచాటునుంచీ ఈ సంభాషణంతా వింటూవున్న జానకి వెళ్లి సంగతంతా కాంతమ్మతో చెప్పింది. "అమ్మా! అతను బలిజేపల్లివారి అల్లుడటే" అంది వచ్చే నవ్వు ఆపుకొంటూ.

"అయ్యో రామ! ఎంత పని జరిగింది. పాపం చెపుతూనే వున్నాడు ఒకవేపు నుంచి" అంది విచారంగా కాంతమ్మగారు. ముఖం చెల్లక కాఫీ బాబిగాడిచేతికిచ్చి పంపించారు. తలుపుచాటునుంచి వగటివేషగాడూ, తన అల్లుడూ మాట్లాడుకోవడం చూచి "అవ్వ!" అని నోరు నొక్కుకుంది కాంతమ్మగారు. ★

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

47

ఆ రోజు తల తెగిపోవలసివున్న హతభాగ్యులు, కాన్సెర్జరీ చీకటికొట్లలో తమ అంతిమ ఘడియలు లెక్క పెట్టుకుంటూ కూర్చున్నారు; మొత్తం ఏభైయిద్దరు; ఆ యేభైయిద్దరూ ఆనాటి బలి మేకలు.

చార్లెస్ డార్నే తన చీకటికొట్లో, ఒంటరిగా, కుదబడి కూర్చునున్నాడు. అతనికి మృత్యువు తప్పదనీ, ఎలాంటి పలుకుబడి వున్నవారైనా, తనను యిక రక్షించలేరని, క్రితంరోజున జరిగిన విచారణ సమయంలోనే అతను విస్పష్టంగా గ్రహించాడు. మనస్సును కూడదీసుకుని ప్రశాంతంగా మృత్యువును ఎదుర్కొవటానికి ప్రయత్నించుతున్నాడు. కాని అమాయికలైన తన భార్యా కుమార్తెల దీనవదనాలు అతని మనోవీధిని గోచరించి: "నాగతి యేమిటి?" అని వాపోతున్నయ్. అతని మనస్సు కల్లోలమై పోతోంది.

క్రితం రాత్రి తెల్లవార్లూ అతను నిద్రపోలేదు. జైలు అధికారులకు లంచమిచ్చి సంపాదించుకున్న క్రొవ్వువత్తి దీపంముందు కూర్చుని, లూసీపేర ఒక పెద్ద ఉత్తరం వ్రాశాడు. ఆ లేఖలో ఇలా వ్రాశాడు:

'మీ తండ్రిని మావాళ్ళు జైల్లో పెట్టిన సంగతి నాకు రవ్వంతకూడా తెలీదు. ఆ విషయంలో నేను పూర్తిగా నిర్దోషిని; నిన్నటి విచారణలో మీ నాన్నగారి లేఖ బయటికి వచ్చే వరకూ నాకు యీ వృత్తాంతంకూడా తెలీదు. కేవలం, మీ నాన్నగారికి యిచ్చిన వాగ్దానం నిలుపుకోటానికి, నా అసలుపేరు నీకు తెలియకుండా దాచివుంచాననే సంగతి నాకు తెలుసు. మన వివాహం జరిగిననాటి ఉదయం నాచేత ఆయన అలా వాగ్దానం చేయించుకున్నారు. బహుశా ఆయన తాను బాస్టిలీ చీకటి ఖైదులో దాచివుంచిన ఈ చీటీ సంగతి మరచిపోయి అయినా వుంటారు; లేదా, బాస్టిలీ పతనమైపోయినప్పుడు ఆ శిథిలాలలో అదికూడా నాశనమైపోతుంది లెమ్మని అనుకునైనా వుండవచ్చు. ఇదంతా గతిచరిత్ర; ఈ విషయమై జ్ఞాపకంచేసి ఆయనమనస్సుకు వేదనకల్పించవద్దు; ఈ వ్యవహారంలో ఆయన చేసింది యేమీలేదని ఆయనకు నచ్చచెప్పి, ఆయన్ను ఓదార్చుకునే బాధ్యత అంతా నీమీదవున్నది. బిడ్డకోసం నీవు నీదుఃఖాన్నంతా మరచిపోగలవని ఆశించుతున్నాను.'

అదే ధోరణిలో మామగారికికూడా మరో ఉత్తరం వ్రాశాడు, దాన్లో 'నా భార్యనూ బిడ్డనూ మీకు ఒప్పగింత చేస్తున్నాను' అని వ్రాశాడు.

లారీగారికి కూడా ఒక ఉత్తరం వ్రాశాడు: 'దాన్లో తన లౌకిక వ్యవహారాల విషయమంతా వ్రాశాడు. ఆయన తనకుటుంబం పట్ల చూపుతున్న సానుభూతికి కృతజ్ఞత తెలియజేశాడు. ఇందరికీ వ్రాశాడేగాని, కార్టన్ విషయం అతనికి జ్ఞాపకమే రాలేదు.

ఈ ఉత్తరాలు పూర్తిచేసి, అతను ఆగదిలో పడేసి వున్న గడ్డిపరుపుమీద నడుం వాల్చాడు. తనకు యీ ప్రపంచంతో గల సర్వవ్యవహారాలూ ముగిసిపోయినై అనుకున్నాడు.

కాని, కాస్త, అలా, మగతిగా నిద్రపట్టేటప్పటికి జీవితం తనను మళ్ళా వెనక్కు పిలుస్తున్నట్లనిపించింది. ఒక విచిత్రమైన కలగన్నాడు. తాను సర్వస్వతంత్రుడుగా పోయిగా, సాహో స్క్వేర్ భవనంలో లూసీతో సుఖంగా కాపురం చేస్తున్నట్టూ జరిగినదంతా కేవలం తనకు వచ్చిన ఒక పీడకల అని లూసీతో చెబుతున్నట్టూ కలగంటున్నాడు. ఇంతలో తెల్లవారిపోయి నిద్ర మెలకువచ్చేసింది. చుట్టూవున్న పరిసరాలన్నీ కలియజూచుకున్నాడు. 'ఈవేళే నన్ను తల నరికేరోజు' అని అతనికి జ్ఞాపకమొచ్చింది.

ఆందోళన పడుతున్న హృదయంతో అతను గదిలో ఇటూ అటూ వెర్రివాడులా పచారుచేస్తున్నాడు. గంటలు నిమిషాల్లా గడిచిపోతున్నయ్. పన్నెండుకూడా దాటిపోయింది.

శిరచ్ఛేదాలు జరిగేది 3 గంటలకని అతనికి తెలుసు; అందుచేత రెండుగంటలకే బయటికి తీసుకువెడతారు. ఈ రెండుగంటలలోనూ మనస్సును కూడదీసుకుని ధైర్యం తెచ్చుకోవాలనుకున్నాడు.

అతనికి క్రమేపీ కొంచెం మనోదార్ఢ్యం కలుగుతోంది; తనకు అలాంటిశక్తిని ప్రసాదించుతున్నందుకు భగవంతుడికి నమస్కారం చేశాడు. ఒంటిగంట కూడా వినిపించింది. 'ఇక ఒక్కగంట' అనుకుంటూ మళ్ళా అటూ యిటూ పచారు చేస్తున్నాడు.

గది కటకటాలకు ప్రక్కగావున్న రాతి మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది. అతను చకితుడై నిలబడి ఆలకించాడు. ఎవరో తానున్న గది తాళం తెరుస్తున్నట్టు కిరకిరగా ధ్వని వినిపించింది.

'నేను ఆయన కెప్పుడూ యిక్కడ కంటబడలేదు—మీరు ఒక్కరే లోపలికి వెళ్ళండి' అనే మాటలుకూడా, కొంచెం అస్పష్టంగా చెవులబడ్డయ్.

ఈలోగానే తలుపు తెరుచుకుంది; చిరునవ్వు నవ్వుతూ సిడ్నీ కార్టన్ కట్టెదుట కనిపించాడు. పెదవులమీద వ్రేలు వేసుకుని బిగ్గరగా మాట్లాడవద్దని సంజ్ఞచేస్తున్నాడు. కార్టన్ మొహం మీద అదో విచిత్రమైన మహోత్సాహం, డార్నేకు గోచరించుతోంది. కార్టన్ అలా వుండటం అతనెప్పుడూ చూళ్ళేదు. ఒక వేళ అసలు అక్కడవున్నది కార్టన్ కాదేమో? తన మనస్సు

అనువాదం: తెన్నేటి సూరి

కల్పించుకుంటున్న భ్రమారూపమేమో అని అనుమానపడుతున్నాడు.

ఇంతలోనే కార్టన్ అతనితో కరచాలనం చేసి పలకరించటంతో అతనికి ఆ అనుమానం తొలగిపోయింది.

'బహుశా నేను యిక్కడికి వస్తానని నువ్వు అనుకుని వుండవు.'

'అసలు నీ ముఖం చూసి కూడా నమ్మలేకపోయాను—నిన్ను కూడా ఖైదు చేశారా?'

'ఏబ్బే! అలాంటిదేమీ లేదు. ఏదోవిధంగా, ఇక్కడ వుంటే జైలుగార్డుల్లో వొకణ్ణి నేను స్వాధీనం చేసుకోగలిగాను; వాడిద్వారా యిక్కడికి రాగలిగాను—నన్ను నీ భార్యే పంపింది డార్నే!—

★ రెండు మహానగరాలు ★

'ఆఁ!—ఏమిటి?'—

'నాద్వారా నీకు ఒక విజ్ఞప్తి పంపుకుంది—అలా నువ్వు వడుచుకో గలవని ఆశించుతూ, నీకు అత్యంత ప్రియతమమైన తియ్యని గొంతుతో అతి దీనంగా వేడుకుంది'—

డార్నే కంట తడిబెట్టాడు:

'అది యేమిటనిగాని, ఆ సందేశాన్ని నేనెందుకు తీసుకు వచ్చాననిగాని నీవు అడక్కు; అదంతా చెప్పటానికి యిప్పుడు వ్యవధి లేదు. నువ్వు తొడుకున్న బూట్లు, చరచరా విప్పేసి, నా బూట్లు వేసుకో'—అంటూనే మెరుపుతీగలా విజృంభించి సిడ్నీని వెనకనున్న వోటికుర్చీమీద కూలేసి బూట్లు చరచరా తొడిగేస్తున్నాడు:

'ఊఁ!—వ్యవధి లేదు—త్వరగా తగిలించేసుకో'—

'కార్టన్! వెర్రిప్రయత్నం చెయ్యకు—ఇక్కడనుంచి తప్పించుకుపోవటం అసంభవకార్యం—నాతోపాటు నువ్వు కూడా హతమారిపోవటం తప్ప మరో ప్రయోజనం వుండదు'

'తప్పించుకోమని నేనంటే పోనీ నీ వామాట అనొచ్చు—ఆ మాటంటున్నానా? నేను యీగడపదాటి నిన్ను అవతలికి పొమ్మన్నప్పుడు—"అది పిచ్చి" అని నువ్వు అప్పుడను. నీమెడలోవున్న మఫ్లరు ఇలా పారేసి ఇది తీసుకో, ఆకోటు కూడా ఇలాతే; జుట్టులోవున్న ఆ రిబ్బన్ ఊడదీసి ఇలా నాకు మల్లే జిర్రబొచ్చులా చికిరిబాకిరి చేసుకో!'—డార్నే కార్టన్ ముందు పసిబిడ్డలా అయిపోయాడు. కార్టన్ రెండునిమిషాల్లో అతన్ని మార్చి పారేశాడు.

'కార్టన్!—అసంభవం—పిచ్చి!—నాకు నీదుఃఖంకూడా తెచ్చిపెట్టకు' డార్నే కళవళంగా గోలపెడుతున్నాడు.

'ఇష్!—గడప దాటమన్నప్పుడుగా—కలం కాయితం తీసుకో నేను చెబుతున్న ఈ రెండుముక్కలూ వ్రాయి—చెయ్యి వొణికించకు'—డార్నే చెయ్యి ఒణుకుతూనే వుంది:

'ఎవరిపేర?'—

'ఎవరిపేరూ అక్కర్లేదు—చెప్పింది వ్రాయి?

'తారీఖు?'—

'అక్కర్లేదు'—

పశ్న ప్రశ్నకూ డార్నే కార్టన్ ముఖంలోకి చూస్తున్నాడు.

కార్టన్ చొక్కా లోపలి జేబులోకి చెయ్యిదోపుకుని, డార్నే మీదికివంగి, చెబుతున్నాడు :

'నీకు జ్ఞాపకమున్నదనుకుంటాను—నీవు అలాంటిమాటలు మరిచిపోవు—ఈ ఉత్తరం చూస్తే ఆనాడు నేను అన్నమాటలు నీకు జ్ఞాపకం వచ్చి తీరతై:—'

డార్నే తల పైకెత్తిచూచాడు—'అఁ!—ఏమిఁటది? ఆయుధమా ?'

'ఎబ్బే ఆయుధమేమిటి ?'—

'మరి నీచేతిలో అదేవిటి ?'

'చెబుతాగా—ఈరెండు ముక్కలూ కూడా వ్రాయి'.

'ఆడినమాట నిలబెటుకోవటానికి యిప్పుడు అవకాశం లభించినందుకు ఎంతో ఆనందించుతున్నాను. ఇందులో ఎవ్వరూ ఏవిధంగా విచారపడవలసింది, అణుమాత్రంకూడా లేదు'—ఈ మాటలు చెబుతూనే తనచేతిని నెమ్మదిగా డార్నే ముఖంమీదికి పోనిచ్చాడు. డార్నే చేతిలోనుంచి కలం జారిపోయింది.

'అఁ!—అ పొగేవిటి ?'

'పొగెక్కడా'—

'ఇప్పుడు కనిపించిందే'—

'ఎబ్బే పొగేవిటీ—ఈ రెండుముక్కలూకూడా వ్రాయి!'

డార్నే వ్రాయటానికి ప్రయత్నించాడుగాని అతని మెదడు పనిచెయ్యలేదు—కళ్ళకు యేదో మైకం కమ్మేసింది. కలం దానంతటకది యేదో పిచ్చిగీతలు గీసేస్తోంది. 'సరే వ్రాయి!' అంటూ మళ్ళా చెయ్యి ఒకసారి డార్నే ముక్కుదగ్గిరికి పోనిచ్చాడు. డార్నే కలవరంగా లేచి కార్టన్‌మీద కలబడబోయాడు. కాని యీలోగానే కార్టన్ అతన్ని వాటేసుకుని తన వ్రేళ్ళను అతని ముక్కుదగ్గిర బెట్టి గట్టిగా అదిమిపట్టుకున్నాడు. ఒకటి రెండు క్షణాలు ఇటూ అటూ గింజుకొని డార్నే స్పృహలేకుండా క్రిందికి వాలిపోయాడు. డార్నే విడిచిన దుస్తులు, కార్టన్ చకచకా తొడిగేసుకున్నాడు. జుట్టు కొనగోట దువ్వుకొని రిబ్బన్ ముక్కతో ముడేసుకున్నాడు. 'ఇదిగో—రా లోపలికి'—నెమ్మదిగా పిలిచాడు. జైలుగ్రొరె బర్సాద్ లోపలికొచ్చాడు.

'ఇదిగో—ఇప్పుడు చూసుకో—నీకు ప్రమాదమేమీ రాదని ధైర్యమేనా ?'

'నాకు యిందువల్లవచ్చే ప్రమాదమేమీలేదు—మీరు మనం అనుకున్న ప్రకారం చివరిదాకా నిలబడాలి.'

'భయిపడకు—ఆ మరణాంతం మాట చెల్లించుకుంటాను.'

'యీ యాభైరెండు సంఖ్యకు తరుగు కనుపించిందంటే నేను హతమారిపోతాను'—

'మరేం భయపడకు—యివ్వాళతో నీకు నా భయం శాశ్వతంగా తీరిపోతుంది—ఊఁ!—ఇక త్వరగా నన్ను బయటకి తీసుకువెళ్ళిపో'—

'మిమ్మల్నా ?'—


'నేనంటె అతనోయ్ వెర్రి మొహమా!—అతను నేనుగా మారిపోలేదూ ? సహాయం తెచ్చుకున్నావుగా—నన్ను లోపలికి తీసుకొచ్చిన ద్వారంవెంటే బయటికి తీసుకుపోండి'

'అవును అలాగే చేస్తాంలెండి'—

'నేను లోపలికివచ్చేటప్పుడు చాలా బలహీనంగా వున్నాగాదూ—ఇక్కడ మరణించబోతున్న మిత్రుడితో మాట్లాడటంతో మరింత తల్లడిలి మూర్ఛవచ్చేసిందన్నమాట. ఊఁ! త్వరగా పనిమూడు !—

'మీరు నాపీకమీదికి తేరుగదా'—

'ఓరి వెర్రి మనిషీ ఇంకా అనుమానమేనా?—త్వరగా బయలుదేరు—నువ్వే స్వయంగా బండిదగ్గిరికి చేర్చి లోపల కూర్చోబెట్టు : రాత్రి నేను చెప్పినసంగతి లారీగారికి జ్ఞాపకం చెయ్—జాగ్రత్తఅని హెచ్చరించు—వెంటనే బండి తోలించెయ్యమను'—



గూఢచారిబయటికి వెళ్ళి యిద్దరు మనుషుల్ని వెంటబెట్టుకుని రెండు సెకండ్లలో లోపలికి తిరిగివచ్చాడు. ఈలోగా కార్టన్ ముఖం చేతుల్లో కమ్మేసుకుని, అమితదుఃఖంలో వున్న వాడులా నటించుతూ ఓటి కుర్చీమీద కూర్చున్నాడు.

'స్నేహితుడుకి గిలటైన్ లాటరీలో టిక్కెట్టొచ్చిందని మనవాడికి గుండెలు ఆగిపోయాయేమిటి ?' అంటూ, పడివున్న దేహాన్ని చూసి పరాచికమాడాడు, ఆ వచ్చినవారిలో ఒకడు. స్పృహతప్పి పడివున్న ఆ దేహాన్ని డోలీలోకి యెత్తుకుని ముగ్గురూ కలిసి బయిటికి మోసుకుపోయారు. ఆ గదికి మళ్ళీ తాళం పడిపోయింది. కార్టన్ ఒంటరిగా లోపల కూర్చున్నాడు. జీవితంలో

"మీరు అన్నట్లుగానే నాచేత నెల తిరగకుండా నడిపించారు."

"ఓహో అలాగా! మీవ్యాధి సాంతం నయమై పోయిందన్నమాట."

"వ్యాధి' నయమైంది కానీయండి, తమ బిల్లు చెల్లించటం కోసం, నా కారు అమ్మివేయక తప్పిందికాదు."

ఒక మహావిజయాన్ని సాధించినవాడి ధీమాతో అతని హృదయం విప్పారుతోంది. నిమిషాలు లెక్కబెట్టుకుంటూ కూర్చున్నాడు.

జైలు జాగంట భాంకరించింది. రెండుగంటలు!—అతను చలించలేదు; జైలుగదులు ఒకటొకటే తెరుచుకుంటున్నట్టు 'కిర కిరా', శబ్దాలు వినిపించుతున్నయ్. చివరికి తనువున్న గది తలుపుకూడా తెరుచుకుంది. చేతిలో ఒక జాపితా పుచ్చుకుని జైల్ వార్డర్ లోపలికొచ్చాడు: 'ఎవ్రీమూండ్! లేచిరా?' అని కేక బెట్టి బయిటికి నడిచాడు. అతన్ని ఒక పెద్దహాల్లోకి తీసుకువెళ్లారు. ఆ హాలుకూడా కన్ను పొడుచుకున్నా కనుపించకుండా చీకటిగా వుంది. ఆ హాల్లో ఇంకా చాలామందివున్నట్టు కార్టన్ గ్రహించాడు. అందరూ క్రీనీడలుగా కనుపిస్తున్నారు. కొంతమంది కూర్చున్నారు—కొంత మంది చతికిలబడిపోయున్నారు. కొందరు ఇటూఅటూ గిజాటుగా తిరుగుతున్నారు; కొందరు ఏడుస్తున్నారు. కొందరు అతిమౌనంగా కూర్చున్నారు. అందరి చేతులకు సంకెళ్ళు వేస్తున్నారు.

కార్టన్ అక్కడే నిల్చునుండగా, ఆ ప్రక్కనుంచి వెడుతున్న ఒక ఖైది అతన్ని యెరిగున్నవాడల్లే అతి ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. తన సంగతి బయట బడిపోతుందేమోనని కంగారుపడ్డాడు. కాని అదృష్టవశాత్తూ అతను అవతలికి వెళ్లిపోయాడు. మరికొంచెం సేపటికి, హాల్లో మరో మూలనుంచి, చాలా చిన్నవయసులోవున్న ఒక స్త్రీ అతని దగ్గిరికి లేచివచ్చింది; ఆ స్త్రీ దూరంగా వున్న ఒక కుర్చీమీద కూర్చుని అతని వంక చూస్తూవుండటం అతను చాలాసేపటినుంచీ గమనించుతూనే వున్నాడు. సన్నగా బక్కపలచగా వుంది. అతి సాజూకుగా వున్న చక్కనిముఖం; కాని ఆముఖంలో యెక్కడా రక్తమనేది లేక తెల్లగా పాలిపోయివుంది.

'ఎవ్రీమూండ్! జ్ఞాపకమున్నానా?—నీతోపాటు లాఫోర్స్ జైల్లో వుండేదాన్ని—కుట్టుపని చేసుకు బ్రతికే బీదదాన్ని'అని పలకరించింది.

'జ్ఞాపకం వుందిగాని' అని నసికాడు కార్టన్: 'నిజానికి నీమీద మోపిన నేర మేమిటో మరిచేపోయాను'అన్నాడు.

'ఏముందీ—రాజకీయ కుట్ర చేశానన్నారు—భగవంతుడి ముఖంచూసి చెబుతున్నాను—అలాంటి దేమీ నే నెరగను—అయినా వాళ్ళు వెర్రిగాని, నావంటి బీదదానితో ఎవడేనా రాజకీయాలసంగతి ఆలోచించుతాడా?—పైగా కుట్రచేశానంటారు.'

ఆమాట విని పాపం అతనికి జాలివేసింది. కనుకొలకుల్లోకి నీళ్లు తిరిగాయి.

'నేను చావుకోసం భయపడటంలేదండీ—రిపబ్లిక్ ప్రభుత్వంబీదవాళ్ళకి యెంతో మేలుచేస్తోంది. అలాంటి ప్రభుత్వానికి ఏదేనా ప్రయోజనం కలుగుతుందంటే ప్రాణాలు అర్పించటానికి నేను విచారించను. నావంటి బీద దాన్ని హత్యచేయటంవల్లయేమి జరుగుతుందనేదే నాకు అర్థం కావటంలేదు.'

ఆ అమాయకురాల్ని చూచి కార్టన్‌కు కడుపు తరుక్కుపోయింది.

'ఎవ్రీమూండ్!— నిన్ను విడుదల చేశారన్నారే—వట్టిదేనా?'—

'విడుదల చేశారు—కాని మళ్ళీ అరెస్టుచేశారు.'

'ఎవ్రీమూండ్!—నన్ను నీతోపాటు తీసుకువెడితే, కాస్త నీచెయ్యి పట్టుకుని కూర్చోనిస్తావా?— నాకు భయం కాదు—చాలా బలహీనంగా వున్నాను కాదూ, కాస్త ధైర్యంగా వుంటుంది.'

ఈ మాటలంటూ అతని ముఖంలోకి పరిశీలనగాచూసి విభ్రాంతి పడ్డది. పనితోనూ, అన్నంలేకనూ వ్రూచలు తేలిపోయివున్న ఆ స్త్రీ మునివ్రేళ్లు అందుకుని ఆప్యాయంగా పెదవులకు హత్తుకున్నాడు.

'అతనికోసం నువ్వు చచ్చిపోబోతున్నావా?' అంది రహస్యంగా.

'అతని భార్యకోసం బిడ్డకోసం—హుష్—బిగ్గరగా మాట్లాడకు'—

'నువ్వు యెవరో మహాపురుషుడివిలా వున్నావు—ధైర్యసాహసాలు తొణికిసలాడుతున్న నీచేతిని నన్ను బలంగా పట్టుకోనీ'—

'అలాగే చెల్లీ!—చివరి ఘడియవరకు నీచెయ్యి వొదిలిపెట్టను—భయపడకు—ఇలారా?'

* * * *

ఇలా యిక్కడవుండగా, అక్కడ పారిస్ నగరంలోనుంచి బయిటికి వెళ్ళిపోతున్న గుర్రపుబగ్గీని ఉత్తరద్వారం దగ్గిర ప్రజాప్రభుత్వ పోలీసులు అటకాయించి సోదా చేస్తున్నారు.

'బండిలోవుంది ఎవరు? ఎక్కడికి వెడుతున్నారు—ప్యాసుపోర్టు లెక్కడ.'

ప్యాసుపోర్టులు తీసుకుని ఒకటొకటే చదువుతున్నారు.

'అలెగ్జాండర్ మానెట్—వైద్యవృత్తి—ఫ్రెంచిజాతీయుడు—ఎవరాయన?'—

'ఇదిగో యీ మతిలేని ముసలాయనె నండి.'

'ఆయన కుమార్తె లూసీ—ఎవరు?'—

'ఇదిగో యీవిడ'—

'మనమరాలు—ఎవరు?'

'ఈ చిన్నపిల్ల'—

'సిడ్నీ కార్టన్—ఆంగ్లేయుడు—ప్లీడరీవృత్తి—ఎవరు?'

'ఇదిగో ఈయ నేనండీ—ఈ మూర్ఛపోయివున్న మనిషి——రిపబ్లిక్ ప్రభుత్వ ఆగ్రహానికి పాత్రుడైన ఒక మిత్రుణ్ణి కోల్పోయి విచారంలో వున్నాడులెండి—నగరందాటి కొంచెం పొలాలమీది ఆరోగ్యకరమైన గాలి సోకితే తేరుకుంటాడు.'

'సరే!—రిపబ్లిక్ ప్రభుత్వం ఆగ్రహానికి పాత్రుడైన వాళ్లు ఎందరులేరు—ఈయన స్నేహితుడు ఒక్కడే దొరొచ్చాడా యేమిటి—గాలి బాగా తగిలేట్టు అలా కిటికీదగ్గరగా కూర్చోబెట్టండి, తేరుకుంటాడు—సరే! జర్విస్ లారీ, ఆంగ్లేయుడు—బ్యాంకీ గుమాస్తా—ఎవరు?'

'నే నేనండీ'—

సోదా పూర్తి అయింది. లారీ పోలీసు ఉద్యోగుల కాయితాలమీద ప్రతి వ్రాలు చేసి యిచ్చాడు. సరే యిక పోవచ్చునన్నారు.

బండి మళ్ళీ ఆఘమేఘాలమీదబయలుదేరింది: 'అమ్మయ్యా! ఒక ప్రమాదం గడిచింది' అనుకున్నాడు లారీ.

'ఇంతకంటే కొంచెం తొందరగా గుర్రాల్ని తోలకూడదా' అన్నది లూసీ కొంచెం ఆందోళనగా.

'వద్దు తల్లీ నీకు తెలీదు—పారిపోతున్నామనే అనుమానం కలుగుతుంది'—

'ఎవరేనా వెనక తరుముకొస్తున్నారేమో కాస్త చూడండి'

'లేదు తల్లీ గాబరాపడకు.'

బగ్గీ, చెట్లూచేమా పొలాలూ బట్టాగడిచి రివ్వున వెళ్లిపోతోంది. బండి తోలుతున్న కోచ్‌వాళ్లు యిద్దరు ఒకరితో ఒకరు ఏదో మాట్లాడుకుని ఒకరి ముఖం వంక ఒకరు తీవ్రంగా చూసుకున్నారు. చకిన గుర్రాల కళ్లాలు బిగబట్టారు. గుర్రాలు నిలిచిపోయినై. బండిని ఎవరో వెంబడిస్తున్నారు కాబోలు.

'ఇదిగో ఏవండోయ్!' అంటూ బండిలోకి వెనక్కి తొంగి చూసి కేక బెట్టాడు, వాళ్ళల్లో ఒకడు.

'ఏమిటి?' అన్నాడు లారీ, కంగారుగా కిటికీలోనుంచి బయటికి తొంగిచూస్తూ.

'ఎంతముందండీ.'

'ఎవరూ?'

'అదిగాదండీ—ఇయ్యాల గెలటైన్ నరికేది ఎంతమందినీ?'

'అదా, ఏభైనోననుకున్నాను—ఏభైయిద్దరు.'

'సెభాస్—బేసుగ్గావుండది—ఇంకా మరోపదిమందిని నరికేస్తే మరీ బాగుంటది—మావోడు అంతమంది లేరంటావుండాడు లెండి—గైలటైన్‌లో మనుసులు తెగుతావుంటే బలే ఉషారుగా వుంటది—'చల్' కొరడాతో గుర్రాల్ని అదిలించాడు. బండి మళ్లీ రివ్వున సాగిపోతోంది. రోడ్డుకు యిరుప్రక్కలావున్న చెట్లు రివ్వురివ్వున వెనకకు పరుగెత్తుకుపోతున్నయ్. ★

బొప్పాయి చెట్లలో కెల్ల అత్యద్భుతమైన శ్రేష్ఠమైన రకము ఒకటి బొంబాయి రాజధానియందు కథియవాడ్‌లో పెంచబడినది. ఈ రకపు బొప్పాయిచెట్లు ప్రపంచంలో ఇంకెక్కడనూ లేవు.

1. నేలమట్టమునుండి రెండు అడుగుల ఎత్తున చెట్టునకు గుత్తులు గుత్తులుగా కాయలు కాచును.

2. మామూలు బొప్పాయి చెట్లకంటె రెండు రెట్లుగా ఈ "మధుబిందు" బొప్పాయి చెట్లకు కాయలు కాయును.

3 ఇతర బొప్పాయిచెట్ల కాయలలో గింజలు ఎక్కువగా ఉండును దీనిలో గింజలు చాలా స్వల్పంగా ఉండును. పండులో తినదగినభాగము ఎక్కువ.

4. 'మధుబిందుబొప్పాయి' పండు యితర బొప్పాయి పండ్లకంటె చాలా పెద్దసైజుగా ఉండును. ఇతర బొప్పాయి పండ్లకంటె అతి మధురముగా నుండును. చక్కని సువాసన కలిగియుండును. ఇటువంటి సువాసన యితర బొప్పాయి పండ్లకు వుండదు.

5. గింజలు నేలలో నాటినటువంటి 9 నెలలకు చెట్టున పండ్లు ఫలించి పక్వమగును; (నల్లరేగడ నేలలో ఇది బాగా పెరుగదు.)

6. మొదటనాటిన చెట్లు 3 సం॥ వరకు సమృద్ధిగా ఫలించును.

ఈ కాయలలోని గింజలను తిరిగి నాటినయెడల మొగ చెట్లుతక్కువగా మొలచును. ఆడ చెట్లు ఎక్కువగా మొలచును.

కథియవార్‌లో, (*Kathia-war*) ధారీ (*Dhari*) అనే పట్టణములో, రాంబాగ్ తోటలో (*Rambag plantation*) యీ మధుబిందు బొప్పాయి (*Madhubindu papaya*) పెంచబడుచున్నది. కథియవారులోని గ్రామ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు (*Chairman, Kathiawar village Reconstruction committee*) అగు రాంజీహన్సురాజ్ గారు (*Sri Ramji Hansraj*) యీ క్రొత్తబొప్పాయి తోటను వేసి పెంచుచున్నారు. కావలసిన వారికి ఆ విత్తనములను కూడ సప్లయి చేయుచున్నారు.

నౌకరి

'వే[illegible]జీవి'

'నివిచ్చిన దరఖాస్తు యేమయిందిరా?'

'బుట్టదాఖిల్.'

'పెట్టు మరో దరఖాస్తు... చేతిలో లేదొక చిల్లిదమ్మిడీ. గుజరాన్ జరిగే జరియా నువ్వు నౌకరీ సంపాయిస్తేనే కాని కాదు, కొండెక్కదిరిచూస్తున్నట్లు చూస్తున్నా...'

మా నాయనమాటలు వినేసరికి చురచురా మంటలెత్తినయి. అయితే మళ్ళీ నెమరుకు వచ్చింది. మొదట్నించి ఆయన సంపాయించుకున్న మంచిపేరు ఇమానంతోనే. ఆయన యిప్పుడూ, పని చేతకాకున్నా, గర్తుక్కడైన ఆ దొరగారిదగ్గర మునుపటి తరహానే ఏదో నాల్గు పైసాలు సంపాయించి మమ్మల్నందర్నీ కూచోపెట్టి తినిపిస్తున్నాడు. అతికష్టంతో నన్ను చదివించాడు. ఆయనే ఉప్పిడి ఉపవాసాలు చేస్తూ ఎట్లానో. బస్తీలో మజాగా సినిమాలూ చూసుకుంటూ, హోటళ్ళలో తింటూ, పాన్ బీడా సిగిరేటు ఊదాయిస్తూ ఉండడం కాకుండా మధ్యమధ్య లేచే పిల్లతహారీకుల సందట్లో, ప్రతిఅయిందానికీ కానిదానికీ చేసే హర్‌తాల్ (*Strikes*) తో చదువంతా నాశనమై రెండేండ్లు యింతేహాన్ (పరీక్ష) లో తప్పి, ముప్పతిప్పలమీద ఈ మార్చినెల యింతేహాన్ (పరీక్ష) లో దర్జే సువ్యం (*3rdClass*) లో కామ్యాబ్ (*Pass*) అనిపించుకున్నా. నా కామ్యాబ్ అనేమాట వినాలనీ, ఆ తరవాత ఏదైనా నౌకరీ చేస్తుంటే చూడాలనీ మా నాయన తడపాయిస్తూ (అల్లాడుతూ) ఉండేవాడు. ఏరకంగానో ఒరకంగా మెట్రిక్ కామ్యాబ్ పని ముగిసింది. అబ్ రహా-నౌకరీ మిగిలింది. మాటల రవానగీలో నౌకరీ అనేశా—దీన్నే తెలంగీలో ఉద్యోగం అంటారుగదూ! మాటలో ఫరఖ్ యెంత ఉన్నా కావలసింది నతీజా. అసలు రోజురోజుకు బఢాభఢాయించిపోతున్న కరువు. దాంట్లో బేరోజ్ గారీ - (*Employment*) చాలా కష్టతరమైపోతున్న బేరోజ్ గారీని చూచి బేజార్ అయ్యి ఆఖరుకు మాలో పెద్దలు కొందరు సర్కార్ ములాజిమత్ (*GovernmentService*) లో నాన్‌ముల్కీలు ఉండటంవల్ల అని, కోలంబస్ అమెరీకాను కనిపెట్టినట్లు కనిపెట్టారు. నేను హష్తుం (*VIII Class*) చదివే రోజుల్లో ఒక తహరీక్...దీన్ని తెలంగీలో యేమంటారో కాని తెలిసినవాళ్లు మత్లబ్ మీద దయచేసి తెలుసుకోవాలి. ఏదైతేనేం, ముల్కీలగురించి తీశాం. అంతా మేమే. ఎవరు గైర్‌ముల్కీలు? అంటే అక్కడక్కడ కనపడే స్నేహితులు చాలామంది నాన్‌ముల్కీలు — బి. యేలు, గియ్యేలు చదివి, ఝామఝామాకు వచ్చేములాజిమత్‌లు (*Employments*) అన్నీ గ్రద్దలు కోడిపిల్లలను తన్నుకపోయినట్లు యెత్తుకపోతున్నారు. ఓల్ ఫయిల్ (*at present*) వాళ్లను నిజంగా వెళ్ళగొడితే మా యస్టేట్‌లో కనబడే బేరోజ్ గారీ అంతాపోతుంది. హాల్‌చల్ (గడబిడ) చేసినాం.

హత్తాకే (తుదకు) జబర్దస్తీనా కొట్టి వెళ్లగొట్టాలనీ యిండ్లమీద పడ్డాం—'బోరియా బిస్తర్ చంకబెట్టుకొని చలోమహారాజ్ రాజమండ్రీకి'—గో బ్యాక్...గో బ్యాక్. అని గల్లంతు లేపాం. నా చేతులతోనే, పాపం ఆయన పేరేమో గుర్తులేదు...చాలా రోజులు గుజరాయించటంవల్ల యాదిలేదు, పోనీలేండి, నెత్తిమీద కొట్టబోతే కన్ను చితికింది ఆయనకి. ఇంట్లో పిల్లలు గెబీ అని ఏడ్చారు. ఆయన భార్య' ఆయనా కాళ్ళ వేళ్లాపడ్డారు. అనజ్జారా (*Scene*) నా దృష్టిలో తాజాగా ఉంది.

'మేముమీ సాటి తెలుగు వాళ్ళం. ఎం. ఏ. దాకా చదివాను. లా గ్రాడ్యుయేటు (*Law Graduate*) ను కూడా. ఏదో బ్రతుకు తెరువుకోసం వచ్చాం. మనం అంతా భాషలో, సంస్కృతిలో ఒకటి. చంపెయ్యండి. ఈ నాభార్యను, నాపిల్లల్ని. నా ఆత్మకు శాంతి ఒక తెలుగు సోదరుడు చంపాడంటే. నేను మాత్రం హృదయపూర్వకంగా మీకు కృతజ్ఞుణ్ణి. చంపారంటే...బ్రతుకు తెరువులేని బ్రతుకుకంటే చావే మేలు. నీవు వ్యక్తిగా పగబూనిరాలేదుగదా! నువ్వేం చేస్తావు? నీమీద నాకేం ద్వేషంలేదు...' అంటూ ఎంతో గొప్పగా చెప్పాడు.

ఆయన్ను, ఆయన పిల్లల్నీ, ఆయన కుటుంబాన్నీ ఢీల్ వదలకుండా బేమురవ్వత్ (మొహమాటము లేనట్టు) గా దండాసాఫు చేశాం. (క్రరతో బాదాం). చదువుకునే బళ్లల్లోఉన్న బల్లలు కుర్చీలు, రోడ్డుమీది లాంతరులు ఫుర్జాపుర్జా (ముక్కముక్కలు) అయ్యేట్లు పగుల గొట్టాం. ఇదంతా విద్యార్థి బలం. ఏమన్నా అంటే రెచ్చిపోతుందని కొందరు. ఈ గొడవలు జరిగితే తమకు లాభసాటీగా ఉంటుందని మాటల్తో ప్రోత్సహిస్తూ కొందరు - అందరు తమతమతావుల్లో గమ్మనా కూర్చున్నారు, ఫైరింగ్‌లు జరిగితే, లాటీఛార్జీలు జరిగితే అనుభవించింది మేము.

మా కంటికి హుకూమత్ (ప్రభుత్వం) అన్నా, గైర్‌ముల్కీమనిషి అన్నా శత్రువులుగా కనబడేవారు. అనుకునేసరికే వాటంతటవే నోట్లో పండ్లన్ని యిసుకలాగా పరపరా కొరికేది. ఇదే తరహా నాదోస్తులంతా. మమ్మల దూరంనుంచి చూచినారంటే సరి 'యమదూతలు రా!' వీళ్ళకళ్ళల్లో పడగూడదని పాపం గైర్

డింజా అన్న ప్పుడు ఏ రంగు ఆడాలో అన్నీ విపులంగా వ్రాశాడు. పైగా కానీ మొదలుకుని పది రూపాయిలవరకు మేజులో ఆటకి, బేస్తుమీద భేస్తు రెండు భేస్తులమీద కుబేలు వగైరాలకి మనిషికి ఎంత వస్తుందో ఒక పట్టీకూడా తయారు చేశాడు.

వాడు భేస్తు ఆడుతూంటే జనం విరగబడి చూసేవారు. వాడిది దిగుడు చేయి అవుతే ఆటవేయడానికి భయపడేవారు. ఎందుకంటే కోటనే ఆట కు దేలయేటట్లు దిగేవాడు. ఎప్పుడూ కింద బేస్తు ఒకటి వుంచుతూండేవాడు. ఎందుకంటే ఎప్పుడూ పీకం ఒకటి వుండాలి, వుంటే దానిమీద జారుతూంటా రనేవాడు. వాడు క్రింద

★ బేస్తు ★

ఆసు వుందని చెబితే వుండి తీరవలసిందే. పైగా బేస్తు చరిత్రలో ఎన్నడూ జరగని ఆటలు నెగ్గాడు. ఒకసారి రెండు పెద్దబేస్తుల మీద, స్వంతం ఆటతో, దోసెలు, కోట్లు, నాలుగాసులమేజులు, బేస్తులు అన్నీ పుచ్చేసుకున్నాడు. అలాంటివి ఎన్నో చేశాడు.

నిత్యజీవితంలోకూడా బేస్తుపదాలనే వాడేవాడు. శకునం మంచిది రాకపోతే 'మన పని కుదేలవుతుందేమో' అనేవాడు. అన్నం ముద్దవుతే 'ఇలా బేస్తు చేసేశావేమిటి' అనే వాడు. ఎవరేనా సలహా అడిగితే 'రెంకుకి నరకపోయి' అనడం పరిపాటి. ఎవరేనా తలపెట్టిన పనులన్నీ జరిగిపోయాయని చెబితే 'కోటయిపోయిందన్నమాట' అని వుత్సాహాన్ని చూపించేవాడు. ఏ వస్తువేనా ఎక్కువ ధర చెబితే 'దిగుడు చేయి అని స్వంతం చెప్పకు మరీ' అని హెచ్చరించేవాడు. చేబదులు కని ఎవరేనావస్తే 'మనపనీ డింజాగానే వుందోయ్' అని చప్పరించేసేవాడు.

ఎక్కడికి వెళ్లినా బేస్తుగాడిని బేస్తుల భీముడనీ, బేస్తుల సింహమనీ ఏవేవో బిరుదులిచ్చేవారు. చివరికి చచ్చిపోయేముందు విల్లులో తన యావదాస్తినీ బేస్తోద్ధరణ సంఘం ఒకటి ఏర్పాటుచేసి దానికిచ్చేశాడు. అంతిమకోరికకింద తన శరీరాన్ని పేకముక్కలతో దహనంచేయాలన్నాడు. అదేవిధంగా అన్నిరకాలపేకలతో చితిని ఏర్పరచి వాడిని దహనంచేశారు. కొన్ని వేలమంది శ్మశానవాటికకి వెళ్ళి ఒక్కొక్కకొత్తపేకని వాడి చితిమీద పడేశారు. పేకలు తయారుచేసే కంపెనీలు, పేకాట క్లబ్బులు కొత్తాపాతపేకల్ని కొన్నికట్టల్ని పంపించాయి. ఆవిధంగా పుట్టిందిమొదలు చచ్చేవరకూ బేస్తుగాడు తన జీవితాన్ని బేస్తు ఆటకే ధారపోసి ధన్యజీవి అనిపించుకున్నాడు.

★



విజ్ఞాన వీధులు


"డాక్టర్"



76. జ్ఞాపక శక్తి ఎలా వృద్ధి అవుతుందీ?


అని పాలకొండనుంచి వి. యస్. శాస్త్రి గారడుగుతున్నారు. ఆయుర్వేదము ప్రకారము జ్ఞాపకశక్తి ఎక్కువచేసేవి సరస్వతీ ఆకువంటి మూలిక లెన్నైనా ఉండవచ్చును. కాని ఇవి పరిశోధనవల్ల నిర్ణయించినవి మాత్రము కావు. జ్ఞాపకశక్తికి ఆధారము లేమిటో ఆయుర్వేదులు పరిశీలించి యుండరూ, ఉండలేరు కూడాను.

ఆధునిక వైజ్ఞానికులు మెదడును చక్కగా పరిశీలించారు. శిశువు మెదడులో కనబడనివీ, జ్ఞానము వచ్చిన వారిలో కనబడేవీ, న్యూరోను లనబడే నరాలు సూక్ష్మమైనవి. పటములో పెద్దవిగా చూడవచ్చును.



1 అన్నది కణము లేదా కేంద్రకము. దానినుంచి అయిదువైపులా ప్రసరించేవి స్పర్శనాడులు. 2 అన్నది ప్రవర్తకనాడి. 3, 4 దాని శాఖలు. ఏదైనా స్పర్శ లేక ఉద్యమము 1 దగ్గర నాడికి అందుతుంది. తర్వాత కేంద్రకము ఈ స్పర్శకి ప్రతిక్రియ చెయ్యమని 2 కి ఆదేశిస్తుంది. 3, 4 ల ద్వారా ప్రతిక్రియ జరుగుతుంది. మెదడుయొక్క పైపై భాగమంతటా ఈ నరాలూ, ముడతలూ కనబడతాయి.

ఇక మెదడు మొత్తంగాపరిశీలించినపుడు వాక్కు, ప్రవర్తన, స్పర్శ, దృష్టి, శ్రుతి మొదలైన జ్ఞానేంద్రియ వ్యాపారాల్ని నడిపే భాగాలు వేర్పాటుగా ఉన్నట్లు తేలింది. ఈ భాగాలను యుద్ధములో గాని అకస్మాత్తుగా ప్రమాదాలవల్ల గాని దెబ్బ తగిలి ఆ ప్రదేశములోని నరాలు నలిగిపోతే, ఆ వ్యక్తిలో ఆయా వ్యాపారాలు నిల్చిపోతున్నాయని కనుక్కున్నారు. జంతువులలో



శస్త్రము చేసి, మెదడులోని ఏ భాగము ఏ వ్యాపారము నడుపుతున్నదో కనుక్కున్నారు. మానవునిలో కూడా ఆ రకపు వ్యాపారాలే ఆ భాగమువల్ల జరుగుతాయని నిర్ణయించడానికి ఆలస్యమౌతుంది గాని హఠాత్ప్రమాదాల పరిశోధనవల్ల నిజము తేలింది.

అయితే ఇందాకా చెప్పిన నరాలు ఈ "దేశాల్లో" అల్లుకుని వుంటాయి. వ్యక్తికి అనుభవము ఎక్కువౌతూన్నకొద్దీ,-అనగా వయసు హెచ్చినకొద్దీ ఈ నరాలు మెదడులో సంఖ్య పెరుగుతున్నాయి. అంటే అనుభవాల్ని మెదడులో నిలిపి జ్ఞాపకముంచేవి ఈ నరాలే అయివుంటాయని ఊహించారు.

ఇక మన అనుభవములో ఒక సంగతి ఎలాగు జ్ఞాపకము వస్తుందో పరిశీలించండి. మనము రైలుబండికి వెళ్లాలన్నమాట మరిచి ఏదో పనిచేస్తూంటాము. రైలుకూత వంటిదేదైనాసరే మనకి చట్టున జ్ఞాపకము తెస్తుంది. లేదా రైలుబొమ్మని చూసినా సరే. అంటే మన మెదడులో 'రైలు' అన్నదానికి స్థావరం ఒకచోట వున్నదనుకుంటే ఈ చోటుకీ శ్రుతిదేశానికీ, ఈ చోటుకీ దృష్టిదేశానికీ నరాలు కలుపుతూ వుంటాయన్నమాట. వీటిలో ఏది కొంచెం కదిలినా ఆ స్థావరం కదుల్తుంది.

అంటే జ్ఞాపకశక్తి దేనిమీద ఆధారపడుతుందీ? మెదడు పైభాగంలోని దేశదేశాల్నీ కలిపే నరాల బాహుళ్యముమీద ఆధారపడుతుందన్నమాట. అంటే జ్ఞాపకశక్తి వృద్ధిచేసుకోడానికి మనమై చేసుకోగలిగిందేమిటి? ఈ నరాల వృద్ధికి అనువైన సాధకము.

ఈనరాలు ఎలావృద్ధి అవుతాయీ?... ఒక కొత్తమనిషిని చూశామనుకోండి. ఆయనగారి ముఖము అలా అలా మన మనస్సులో మెదిలి మాయమౌతుంది. ఆయన్నే మరోసారిచూస్తే ఈ మసక బొమ్మమీద మరికొన్ని గుర్తించుకోగల గీతలు పడతాయి. మూడోసారి చూస్తే ఆ బొమ్మ ఇంకా దట్టమౌతుంది. అంటే వినున్నమాటా? ఒకసారి వర్ణించితే కంఠతా రాని పద్యము నాలుగుమార్లు వల్లిస్తే వస్తుందన్నమాట కామా?...జ్ఞాపకానికి రాని విషయము జ్ఞాపకం తెచ్చుకోవాలంటే మనం ఏం చేస్తామో గమనించండి. ఎక్కడి కెక్కడికి వెళ్ళినామో, ఏమేమిటి చేశామో జ్ఞాపకం చేసుకుంటాము. అంటే ఒక ఇంద్రియము చేసిన పనికీ మరొక ఇంద్రియము చేసినపనికీ మెదడులో ఎదో టాకీ ఉండి, ఈ తీగలాగితే అది కూడా కదులుతుంది. అయితే జ్ఞాపకశక్తి వృద్ధి అవాలంటే ఏమి చెయ్యాలీ? ఆపనిని నాలుగైదు సార్లు వర్ణించాలీ, దానిని నాలుగైదు జ్ఞానేంద్రియాలవ్యాపారాలతో కలపాలి. అంటే, ఆ పద్యం నోటితో వర్ణించాలీ, కంటితో చదవాలీ, చేతితో రాయాలి. ఇలా చేస్తే ఆ పనికి సంబంధించిన నరాలూ వాటి సంబంధాలూ చాలా ఏర్పడతాయి మెదడులో. అంటే ఆ పనిని జ్ఞాపకం చెయ్యగల నరాలు చాలా ఏర్పడతాయి.

మొట్టికాయ మొట్టడమూ, కండువా కొస ముడివెయ్యడమూ కూడా నరాల సంబంధము దృఢం చేసేపనులే.

పాఠశాలలో ఉపాధ్యాయులు చదివి వినిపించి, చదివించి, బోర్డుమీద రాసి చూపించి, పుస్తకాలలో రాయించి—



★ విజ్ఞాన వీథులు ★

చెయ్యడము జ్ఞాపక ముంచుకు నేటందుకు సాయంచెయ్యడమే. జ్ఞాపకశక్తికి నేటి వారిలో పేరుపడ్డ వేపా రామేశం పంతులు గారు ఏవిషయము వచ్చినా, దానికి సంబంధించిన పుస్తకము మళ్ళీ తీసి, దాన్ని చదివీ, చూపించీ గాని విడిచిపెట్టరు. ఆయన జ్ఞాపకశక్తి అద్భుతప్రపంచంలోని సరుకు. —సోమ.

77. తోకచుక్కలు

తోకచుక్క అనగానే పొడుగైన తోక, కాంతిమంతమైన తల గల ఒక మూర్తి మన స్ఫురణకు వస్తుంది. 1948 సంవత్సరం నవంబరు నెలలో వరుసగా ఇంచుమించు వారం రోజులు తెల్లవారు సమయంలో ఆకాశంలో తూర్పుదిక్కున అట్టి మూర్తి నొకదానిని మనం చూసియున్నాం. దీని కంటెను పెద్దతోకచుక్కను 1910 వ సంవత్సరం మే నెలలో మనకంటె పెద్దలు పరికించియున్నారు. నభోమూర్తులలో కెల్లా ఎక్కువ ఆకర్షణీయమైనవి తోకచుక్కలే.

తోకచుక్కను ఎప్పుడైనా పరీక్షిస్తే దానిలో రెండుభాగాలున్నాయని స్పష్టమాతుంది. ఆ భాగాలలో మొదటిది తల; రెండవది తోక. తోకచుక్క తల సజాతీయమైన వస్తువు కాదు; అంటే దానిలోని ద్రవ్యమంతా ఏకరీతిని ఉండదు. మధ్యను సాంద్రమైన కేంద్రకం, ఆ కేంద్రకానికి చుట్టూ పలుచని ద్రవ్యం ఉంటాయి. ఇక కేంద్రకం కొన్ని కణాలు వదులువదులుగా చేరుటచేత ఏర్పడుతుంది. కేంద్రకం సాంద్రమై యుండుటచేత ఎక్కువ దీప్తిమంతంగానూ, దానిచుట్టూ ఉన్న ద్రవ్యం పలుచగా ఉండుటవలన మసకగానూ ఉంటుంది. తోకదీప్తి తలదగ్గరనుంచి చివరకు పోయినకొలదీ క్రమంగా తగ్గుతుందని వేరే చెప్ప నక్కరలేదు. ఇది తోకచుక్క బాగా అభివృద్ధిపొందిన స్థితిలో మనకు కనబడే దృశ్యం.

కాని తోకచుక్క మొట్టమొదట కనిపించినపుడు అది యీవిధంగా ఉండదు. తోకేమీ లేకుండా మసకమసకగా, అస్పష్టమైన చిన్న బింబంవలె అది ఉంటుంది. ఆసమయంలో దూరదర్శినితోనే గాని వట్టికంటికి కనిపించదు. తరువాత క్రమంగా రోజులు గడిచినకొలదీ దాని దీప్తి హెచ్చుతుంది; కొన్నింటికి తోక యేర్పడి ఆ తోక కూడ దినదినము వృద్ధికావడం ఆరంభిస్తుంది. సామాన్యమానవుని దృష్టిని తోకచుక్క ఆకర్షించేది ఆ సమయంలోనే. ఆతరువాత క్రమంగా తోకచుక్క తోక పొడుపు వృద్ధియై, కొన్నిరోజులలో గరిష్ఠ పరిమాణాన్ని పొంది పిమ్మట తగ్గడం ఆరంభిస్తూ, కొన్నాళ్లకు బాగా చిన్నదైపోతూంది. ఆతరువాత తోకచుక్క సామాన్యమానవుని దృష్టిని ఆకర్షించదు. మరికొన్ని రోజులకు దూరదర్శినితో చూచినాకూడా అనకుండా, ప్రదేశంలోకి దూరంగా తోకచుక్క పోతుంది.

దూరదర్శినితో చూచినపుడు ఆదిలోనూ అంతంలోనూ ఏ తోకచుక్కకూ తోక ఉండదని గమనించేం; కొన్ని తోకచుక్కలకు మాత్రమే తోకయేర్పడుతుందని కూడా గ్రహించేం. తోకచుక్కలలో కొన్నింటికెన్నడూ తోక యేర్పడదు. తోకచుక్కలలో అట్టివాని సంఖ్యే హెచ్చు. ప్రతి సంవత్సరం ఒకటో, రెండో...అట్టివి ప్రత్యక్షమాతూనే వుంటాయి. కాని అవి సాధారణంగా తక్కువ దీప్తి గలవియై యుండుటచేతా, తోకవంటి ఆకర్షణీయ భాగం వాటికి లోపించడంవలన, ఆకాశంలో మన దృక్క్షేత్రంలోకి అవి వచ్చినా, వాటి ఉనికిని మనం గమనించం.

గ్రహాలవలెనే తోకచుక్కలు కూడా సూర్యకుటుంబానికి చెందినవే. గ్రహాలు ఏ నియమాలననుసరించి సూర్యుని చుట్టు తిరుగుతున్నాయో సరిగా ఆ నియమాలననుసరించే తోకచుక్కలు సూర్యుని చుట్టు ప్రదక్షిణం చేస్తున్నాయి. అయితే గ్రహాల కక్ష్యలకు తోకచుక్కల కక్ష్యలకు ఆకారంలో చాలా తేడా ఉంది. గ్రహాల కక్ష్యలు దీర్ఘవృత్తాకారంలోనే ఉన్నా అవి ఎక్కువగా సాగియుండవు; ఇంచుమించు వృత్తంవలెనే అవి ఉంటాయి. కాని తోకచుక్కల కక్ష్యలు మాత్రం ఎక్కువగా సాగి యున్న దీర్ఘవృత్తాకారంలో ఉంటాయి. గ్రహాలవలెనే తోకచుక్కలకూ సొంత కాంతి లేదు. తమపై పడిన సూర్యకాంతివలననే అవి ప్రకాశిస్తున్నాయి. అందుచేత ఎక్కువగా సాగియున్న తమ కక్ష్యలలో తిరుగుతూ సూర్యునకు చాలా దూరంగా పోయినప్పుడు, తోకచుక్కను చేరుకొనే సూర్యకాంతి తీక్ష్ణత చాలా తక్కువగుటవలన తోకచుక్కదీప్తి అత్యల్పమై, కంటికి ఆనదు. ఇక సూర్యుని సమీపించిన కొలదీ దానిదీప్తి క్రమంగా హెచ్చుతుంది.

తోకచుక్కల కక్ష్యలు ఎక్కడా తెంపులేక అవిచ్ఛిన్నమై యుండుటచేత ఆకక్ష్యలలో సంచరించే తోకచుక్కలు కొంతనియతమైన కాలవ్యవధిలో మళ్లీ మళ్లీ కనబడతాయి. ఆ కాలవ్యవధి కొన్ని సంవత్సరాల మొదలు కొన్నివేల సంవత్సరాలవరకు ఉంటుంది. ఎంకీ అనే తోకచుక్క ప్రతి 3 1/3 సంవత్సరాలకి ఒకసారి కనిపిస్తుంది. 1910 లో కనిపించిన హేలీ తోకచుక్క ప్రతి 75 సంవత్సరాలకు ప్రత్యక్షమాతుంది. 1910 లో కనపడింది కాబట్టి 1985 లో తిరిగి దర్శనమిస్తుంది.

తోకచుక్కతోక పొడుపుకు సూర్యునికీ తోకచుక్కకూ గల దూరానికీ ఒక విచిత్రమైన సంబంధముంది. తోకచుక్క సూర్యుని సమీపించిన కొలదీ దాని తోక పొడవు పెరిగి, సూర్యునికి మిక్కిలి చేరువగా నున్నప్పుడు గరిష్ఠపరిమాణాన్ని పొందుతుంది. తోకచుక్క తోక యెల్లపుడు సూర్యునివలె విముఖదశలోనే వ్యాప్తమై యుండుట గమనింపదగిన మరోవిషయం.

తోకచుక్కకు తోక యేర్పడుటకు సూర్యరశ్మి ప్రభావమే కారణమని శాస్త్రజ్ఞుల విశ్వాసం. తోకచుక్క కేంద్రకం చుట్టూ ఉన్న పలుచనిపదార్థంవలన తోక యేర్పడుతున్నది. అందుచేత తోకచుక్క సూర్యుని సమీపించిన ప్రతిసారి కేంద్రకమందలి పలుచని పదార్థంలో కొంతభాగం దానిని వదలి పైకిపోతుంది; తన్మూలంగా క్రమంగా కొంత కాలానికి ఆ పదార్థం అంతా అయిపోవుటవలన తోకచుక్క తన కక్ష్యలో సంచరిస్తూ సూర్యుని సమీపించినా కూడా దానికి తోక యేర్పడదు. అట్టివే తోకలేని తోకచుక్కలు.

తోకచుక్కల తోకలలోని పదార్థం అతి పలుచగా ఉంటుంది. ఆ తోకలలో నుంచి భూమి దూసుకుపోయినా కూడా ఆ విషయాన్ని మనం గ్రహించలేం.

తోకచుక్కల పుట్టుపూర్వోత్తరాలు శాస్త్రజ్ఞులకు కూడా పూర్తిగా తెలియవు. తోకచుక్కలు రానున్న అశుభానికి సూచనలనే నమ్మకం నిజమనుటకు తగిన సాక్ష్యమూ లేదు.

—'అనంత్'

చిట్టి ప్రశ్నల జవాబులు

—పాములు నెలకొకమారున్నూ పాము పిల్లలు నెలకు రెండు మారులున్నూ కుబుసమును విడుచును.

—వాత పెట్టినప్పుడు చర్మము ఏ రీతిగా కాలిపోవునో అదే రీతిగా టించరు అయొడీను పెట్టినప్పుడు గాయముల సున్నితభాగాలు 'కాలును'. అందువల్లనే భగ్గుమని మంటవలన కలుగు బాధయే టించరు అయొడీనువల్ల కలుగును.

బేస్తు

కోనయ్యా పేకాట అంటే చెవి కోసుకుంటాడు. అందులోనూ బేస్తులో నిధి. అది ఆంధ్రుల జాతీయపుటాట అంటాడు. బేస్తురాని తెలుగువాడు తన దేశానికి ఎంతో అపచారం, ద్రోహం చేస్తున్నాడని కోనయ్య వుద్దేశం.

కోనయ్యకి 'బేస్తుగా'డని పదిమందీ కలసి పేరుపెట్టారు. అది తనకొక బిరుదన్నాడు. అసలు అన్నప్రాశననాడే వాడి తండ్రి, తనకి కూడా పేకాట అంటే మక్కువవుండడంవల్ల, పువ్వులు పుస్తకాలతో పాటు పేకముక్కలు కూడా అక్కడ పెడితే, బేస్తుగాడు ఇస్పేటుఆసుని పట్టుకున్నాడట అన్నీ వదిలి. తండ్రి పరమానంద భరితుడయాడుట. బడిలో ప్రవేశపెట్టాక, కొనుక్కు తినడానికిచ్చిన కానీని, దారిలో పేకాట లాటరీలో పెట్టి రూపాయికి పైగా సంపాదించి, ఇంక వాడు డబ్బులు ఇవ్వకపోతే తన్ని, కరచి, ఏడ్చి వచ్చేశాడుట. అలా ఒకటి రెండుసార్లు అయాక, వీడికి ఎలాగా చదువు కుదరదు, జీతమేనా కలిసివస్తుందని తండ్రి బేస్తుగాడిని బడి మానిపించి, తనతో పేకాటకి తీసుకుపోయి ప్రక్కన కూర్చోపెట్టుకుంటూండేవాడుట. పోయేవరకూ కూడా బేస్తుగాడు ఈ విషయం ఎంతో వుద్రేకంతో చెబుతూండేవాడు. తను పేకముక్కలచేత మాట్లాడించగలిగాడంటే అదంతా తన తండ్రి చిన్నప్పుడు తనకిచ్చిన తరిఫీదే కారణం అంటూండేవాడు.

బేస్తుగాడి తండ్రి ఇంత తినడానికిచ్చి చచ్చాడు. దానితో వీడు కాలక్షేపం చేస్తూ, పేకాటసాధనలో కాలం వెళ్ళబుచ్చేవాడు. కొంతకాలానికి బేస్తులో అందెవేసిన చేయి అనిపించుకున్నాడు. తరువాత ఇది పద్ధతి కాదని తన వూర్లోనే చిన్న బేస్తుక్లబ్బు పెట్టించాడు. రోజూ సాయంత్రం నాలుగైదు జట్టులు అక్కడ పేకాడుతూండేవారు. ఇదే విధంగా వూరూరూ తిరిగి, ప్రతి వూర్లోనూ బేస్తుక్లబ్బులు పెట్టించాడు. తరువాత బేస్తుపోటీలు ఏటేటా జరిపించుతూండేవాడు. తన తండ్రిపేర బేస్తు షీల్డుఒకటి కానిచ్చాడు పేకాట పోటీలకి. తరువాత బేస్తులో తరిఫీదు ఇవ్వడానికి చిన్న స్కూలుపెట్టాడు. పోస్టుద్వారా కూడా తరిఫీదు ఇచ్చే ఏర్పాట్లుచేశాడు.

బేస్తుగాడు ఏ వూరు వెళ్ళినా వందమందికి పైగా స్టేషనుకి వెళ్ళి ఆహ్వానించేవారు. వాడు కానీ మొదలుకొని పది రూపాయిల మేజు వరకూ కూడా ఆడాడు. ఒకసారి, కాసు మేజు పెట్టి ఆడుతూంటే, కిట్టనివాళ్లు జూదం ఆడుతూన్నారని పోలీసులకి తెలియజేస్తే పోలీసులువచ్చి పట్టుకుని, కేసు పెట్టి ఏడాది జెయిలులో వేశారు. జెయిలులోంచివచ్చిన తరువాత బేస్తు ఆట జూదంలోకి రాదనీ దానిమీద ప్రభుత్వం నిషేధంతీసేయాలనీ, అది ఆంధ్రులజాతీయహక్కు అనీ, బేస్తుని నిషేధించడం ఆంధ్ర జాతీయతకి తీరని అవమానమనీ, ఆంధ్ర రాష్ట్రంవచ్చివుంటే ఇటువంటి అవమానం జరిగివుండక పోననీ పెద్ద అలజడి లేవదీశాడు. ప్రతీవూర్లోనూ పెద్ద పెద్ద సభలు జరిపి ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించాడు. చివరకి మద్రాసువెళ్ళి అసెంబ్లీకి ఎదురు గుండా పికెటింగ్

[illegible]

జరిపాడు. నాలుగురోజులతరువాత ప్రభుత్వంవారు, బేస్తుగాడిని బలవంతంగా తీసుకుపోయి జెయిలులో పడేసి ఆరునెలలతరువాత వదిలేశారు. అప్పుడు వాడి వూరు వెడుతూంటే, ప్రతీస్టేషనులోనూ జనం తండోపతండాలుగా వచ్చి వాడిని పూలదండలలో ముంచెత్తేశారు. వాడి వూరు వూరంతా స్టేషను దగ్గర వుంది. రైలు దిగగానే 'బేస్తుగాడికి జై' అని మిన్నుముట్టేటట్లు జయధ్వానాలు చేశారు. బ్యాండుమేళంతో వూరేగించి క్లబ్బుకి తీసుకు వెళ్లారు. అక్కడ బేస్తుగాడు పెద్ద వుపన్యాసం ఇచ్చాడు.

బేస్తుగాడు, వూరికో పద్ధతిని బేస్తు ఆడడం చూసి దానివల్ల పైవూరినుంచి వచ్చినవాళ్ళు చిక్కుపడతారని, ఈ పద్ధతులన్నీ సేకరించి, పరిశీలించి, పరిశోధన చేసి, ఒక జాతీయపద్ధతిని దేశమంతటా అవలంబించడానికి నియమావళి ఏర్పాటు చేశాడు. అందులో రెండు బేస్తులమీద ఆటకాయలు, కోట్లు పుచ్చుకోకూడదనీ బేస్తుమీద బేస్తుకి పడేయచ్చుననీ, రెండుకి నరికి కుదేలు చేయకూడదనీ, రెండు బేస్తులమీద కుదేలుపంపకాలు బేస్తులు తేలేవరకూ నిలపవచ్చుననీ వ్రాశాడు. కొత్తగా నేర్చుకునేవారికి కొన్ని సూత్రాలు వివరాలు వ్రాశాడు. రెండుకి నరకడం అంటే ఏమిటో, మేజులు, దోసెలు, కుదేళ్ళు అంటే ఏమిటో ఒకటి రెండు మూడులంటే ఏమిటో, జాకరుతో ఎలా ఆడాలో రాజు జాకీ వరసల్లో ఆట వేయవచ్చునో వేయకూడదో, డింజా అంటే ఏమిటో,

"ఏమండీ సరోజమ్మగారూ! మొత్తానికి వజ్రాలహారం చేయించుకొన్నారే. ఈ ఏడాదిలో మీకు డబ్బు వుసులుబాటు చాలదనీ, నగ ఏదీ చేయించుకోలేకపోవచ్చుననీ మొదట్లో దిగులుపడ్డారు కదూ!"

"మరేనండి, రుక్మిణమ్మగారు! మొదట్లో అలాగే అనుకొన్నాంకానీయండీ, మొన్న జరిగిన ఆ రైల్వేప్రమాదంలో మా ఆయన చేయి విరిగిపోయింది; అందుకు నష్టపరిహారంగా రైల్వేవారు రెండువేల రూపాయలుయిచ్చారు. ఏదో- సమయానికి ఆ డబ్బు అందబట్టి సరిపోయింది కానీ,-లేకపోతే యీ ఏడాది పొడుగునా ఏ నగా చేయించుకోలేకపోయేదాన్నే సుమండీ!"



★ నౌకరి ★

ముల్కీలు దూరం దూరంనుండే – 'సటక్ సీతారాం' అయ్యేవాళ్లు. బహార్ హోల్ అదీ ఒకరోజు–మేమంతా ప్రభువులం–మాదెబ్బ చెప్పితే కిందినుంచి పైదాకా హడలెత్తి పోయిందిలే అని గర్వంగా పోజు పెట్టి తిరిగేవాళ్ళం.

ఆ గర్మీ పోయింది. పాటి ఆంధ్ర దేశంలో, ఆంధ్రజిల్లాలవాళ్ళే ముఖ్యంగా యింత బేరహిమీ (నిర్దయ)తో హింసలకు తెగబడ్డారని మోగిపోయింది. మానాభిమానాలు రత్తీ బరాబరుగా మరచిపోయినాం.

ఇప్పుడు నౌకరీకి సర్కార్ దఫ్తర్ (*Office*) లకు పోతే, బీ. ఏ. కామ్యాబ్ అయినావా? అంటారు. జాయదాదులు (*Vacancies*) లేవంటారు – లేదయ్యా! నేను ముల్కీ తహరీకులో ప్రముఖ పాత్ర వహించి కొందరు నాన్ ముల్కీలను వెళ్లగొట్టానని చెప్పబోయాను. పూర్వం కాంగ్రెసులో పనిచేసి, జెయిళ్ళలో పడ్డామంటే నౌకరీలు, భూములు యిచ్చినట్లు యిస్తారని. కాని అది భారతీయచట్టంకు విరుద్ధమయిందట – బుద్ధి బుద్ధి! అఫ్‌సోస్! తెలిసిందికాదు మొదట – మాదేశం అంటే భారతదేశం – హిమాల్యానుండి రాస్ కుమారీ (కన్యాకుమారీ) వరకు ఉన్న హిందూదేశమట. అరె భాయీ! ముల్కీ సదాఖతునామా కవచాలు ధరించి బేరోజుగారీమీద హమ్లా (*Attack*) చేద్దామనుకుంటే అదీ బేకార్ అయిపోయింది.

జరిగిన గాథ అంతా చాలా పెద్దది – ముఖ్తసిర్ యేమంటే యిప్పుడేంచేయాలా? అని. పొరపాటైంది. ఆ తహరీకురోజుల్లో నే మాకోసం కొన్ని జాయదాద్‌లు (*Vacancies*) ముఖ్తస్ (*Reserve*) చేయించుకోవలసింది. అట్లా చేయించుకుంటే యిప్పుడు ఝుక్ మరాయించుకుంటూ (నెత్తి బాదుకుంటూ) నౌకరీలు యిచ్చేవాళ్లు – కాని యిప్పుడు పోయి మాకు ములాజిమత్ లు యివ్వకుంటే మేమేం చెయ్యాలని అడిగితే, యేమన్నా చేసుకోండి – చేతిపనులు నేర్చుకోండి – కూలీ చెయ్యండి – ఎంత

దేవదాసి
అజంతా కుడ్యచిత్రం ఆధారంగా
శ్రీ పి. నాగేశ్వరరావుగారు చిత్రించిన
చిత్రం.



కన్నతల్లి

—శ్రీ బి. రామకృష్ణ,

మందికని నౌకరీలు యివ్వగలం - ప్రతి సంవత్సరం యిన్ని వేలమంది చదివినవాళ్లు వస్తున్నారు. ఇన్ని వందలు మట్టుకే కాళీలు (*Vacancies*) వెళ్తున్నాయి. కాళీలు మించి నౌకరీలు యెట్లా యిస్తాము? అంటూ ఏవేవో బేజరూరత్ లెక్కలన్నీ చూపిస్తారు. కచేరీలల్లో దరఖాస్తు పెట్టి పెట్టి, తిరిగి తిరిగీ బేజార్ అయిపోయి, నా కాళ్ళ చెప్పులు అరిగిపోతున్నాయి. ప్రతిసిరస్తా (*Department*), జంగలాత్ (*Forest*) తాలీమాత్ (*Education*) మాల్ (*Revenue*) జిరాయత్ (*Agriculture*) అదాలత్ (*Judicial*) అరరే! ఒకటనీ ఒకటి కాదనా! తోబాతోబా! అన్నీ సిరస్తాలల్లో 'జాయదాద్ నహీం'?- (*No Vacancies*) అనేమాటే - ఎంతో కాళ్లుచేతులు కొట్టినా అదృష్టమెంతో అంతే!...పఢే ఫార్సీ బేచే తేల్ (ఫార్సీభాష చదివి నూనె అమ్ముకొని బతికినాడు) అన్న సామెతగా ఉన్నది నా బ్రతుకు-

మళ్లీ మా వాయనకు చెప్పి ఆయన మనస్సుకు తక్లీఫు (కష్టము) యివ్వటం యెందుకు? - మాట్లాడకుండా ఏ వర్క్ షాప్ (*Work-shop*) లోనో ప్రవేశించి, మోటార్లు సైకిళ్లు వగైరా రిపేరింగు పనులు నేర్చుకొని దుకాణం పెట్టుకోవడం మంచిదని సూటుకేసు తీసుకొని బొంబాయికి బయలుద్దేరా - అక్కడ 'ముల్కీ తహారీకులో పని చేశావా' అంటే 'నాకేం తెలియదు బాబూ - అల్లాఖసం - ఆదేవుని తోడు... నేనూ మీతోపాటు ఒక భారతీయుణ్ణే' అని ప్లేటు బదలాయించి సమాధానం చెప్పుతా - అనుకుంటూ, నేను చేసిన పాపం తహారీకు బేమత్లబ్ అయిపోయిందని అఫ్సోస్ చేస్తూ-

గర్ర్ గుర్ర్ అంటున్న నా చెవులకు కఠోరంగా వినబడుతున్నది. ఇది వర్క్ షాప్‌లో మిషన్ల చప్పుడు అయ్యి ఉండొచ్చుననుకున్నా. కండ్లు నులుముకొని చూచా - బాగా కండ్లు విప్పి, నిద్రమబ్బు విడిచి తెలివితెచ్చుకొని చూచా - ఎట్లా చూచినా అంతే - రెండు పిల్లులు ఒకదానిమీద యింకోటి పడి కరుచుకుంటున్నాయి. ★

గతము మరిచి పుబుసుపోక

ఆరోజు నాకు ఏదో పనిపడి పొరుగూరికి పోతున్నాను. రైలు ఇంకా రాలేదు. ప్లాట్‌ఫారంమీద వుండే ఒక బెంచీ చివరను పోయికూర్చున్నాను.

నా ప్రక్క నేవున్న ఒక వ్యక్తి—

ఆయన తొడుక్కున్న బట్టలూ అవీ చూస్తే—బాగా డబ్బువున్న ఆసామిలాగే కనిపించాడు. ఆయన ఏమిటో తనలో తనే మాట్లాడుకొంటూ ఒకసారి 'హ్హా...హ్హా' అని నవ్వుతున్నాడు. మళ్ళీ ఒక క్షణం ఆగి 'ఛీ...ఛీ' అనుకుంటూ మొఖం చిట్లిస్తున్నాడు. ఈ కలాపం బాగా అరగంటదాకా గడిచాక, యిక నేను వుండబట్టలేక, ఆయనతో పరిచయం చేసుకొని మాటల్లోకి దించాను. మాటల ధోరణిలో పట్టుకొని అడిగేశాను — "ఇందాకటినుంచీ మీరు ఏమిటో 'హ్హా...హ్హా' 'ఛి...ఛి...ఛి' అనుకుంటున్నారు—ఏమిటి విశేషం" అని.

"ఎబ్బే — ఏమీ లేదండి. మావాళ్లు మెయిల్‌కు వస్తున్నామని జాబు వ్రాశారు. వాళ్ళకోసం స్టేషన్‌కు వచ్చాను. తీరా వచ్చాక ఆ మెయిల్ 3 గంటలు లేటు అని తెలిసింది. ఈ మూడుగంటల కాలం యిక్కడ ఒంటరిగా ఎలా గడపాలో తెలియక, వెనుక నే చదివిన నవ్వుపువ్వులన్నీ వరసగా జ్ఞాపకం చేసుకుంటున్నాను. వాటిలో యిదివరకు ఎవరూ వాడని వాటినైతే హ్హాస్తున్నాను. పాత వాటినే మళ్ళీమళ్ళీ చెప్పేవాళ్ళను ఛీత్కరిస్తున్నాను." అన్నాడు ఆ పెద్దమనిషి.

బొమ్మరిల్లు

నాగమణి


శ్రీ గొడవర్తి భాస్కరరావు

ఆటలు ఆడే బాలల్లారా?
పాటలు పాడే పాపల్లారా?
పచ్చగ పెరిగే పిందెల్లారా?
విన్నారా ఓమారీ కథను—

మామిడి గున్నల తోటొకటున్నది,
తోటకి నడుమా గుట్టొక టున్నది,
గుట్ట లోపలా పామొకటున్నది,
నాట్యంచేసే నాగయ్య—
బుజ్జిపాటలకు నాట్యంచేసే
కన్నులకింపుగ కదం త్రొక్కే—
పడగలు విప్పీ బాగా ఆడే
పామొకటున్నది గుట్టలోపలా.
పదునారేడుల సుబ్బయ్య నియెడి
బాలుండొక నాడొచ్చాడు
తోటకు ఆటకు వచ్చాడు
చేతిలో బూరా పట్టుకుని—
నాగస్వరమూ వాయించగనే,
బాలుని పాటకు నాగరాజమూ
పడగను విప్పీ, నాట్యంచేసీ
పకపక నవ్వుతు వుండేది.
తన మిత్రుండని భావించేదీ
నాట్యంచేసే నాగరాజమూ.
బాలుడు పాటలు పాడుతువుంటే
పడగలనాట్యం చేసేదీ.
పాటలు పాడక బాలుండుంటే
గుట్టలో దూరును కోపమున.
అత డేమాత్రం ఆలసించినా
కోపం వచ్చును పడగలరాజుకు.

ఇటులుండంగా ఒకనాడూ
బెంగతో బాలుం డొచ్చాడు.
కన్నుల జలజల కన్నీరోడ్చుచు
భోరున బాలుం డేడ్చాడు.
పడగలరాజూ బాలుని చూచి
దాపున చేరి అడిగాడు:
"ఎందుకు బాలక" ఏం కావాలి?
ఏమిటి విషయం? చెప్పు మరీ!"
ఏడుపు మానీ బాలుం డప్పుడు
విషయం బంతయు చెప్పాడు.
"నన్ను పెంచినా 'అవ్వొ'కతున్నది,
నమ్మిన అవ్వా నాకామె
ఆమెకు రోగం అంకురించినది
తెమ్మన్నారు "నాగమణి"
'ఎక్కడ అడిగిన లేదామె.
ఎక్కడ వెదికిన లేదామె.
మణిలేదనినే తిరిగిపోయిన నా
రోగం తగ్గదు అవ్వకును"
బాలుని మాటలు శ్రద్ధగ వినెనూ
పడగలరాజూ నాగయ్య.
"నాగపుమణి నీకెక్కడ దొరకదు
నాగుల కొండల్లోగాని
అయినా ఒకవిషయం చెబుతా
వినుమర బాలుడ జాగ్రతగా.
నాగస్వరముతో పాటలు పాడీ
నాకు హాయినీ కొల్పంగ
నేనిస్తానుర నాగమణీ"

బాలుడు పాటలు పాడాడు
నాగం నాట్యం చేసింది
నెత్తిన మణినీ క్రిందకు నెట్టీ
తీసుకుపోయీ మందులో వాడి
వెంటనే తీసుకు రమ్మంది.
తళతళ మెరిసే రత్నం చూసి
కలకల మురిసెను బాలుండు.
రత్నం గట్టిగ చేతనుబూనీ
అవ్వకు మందు పోసేదానికి
బిరబిర యింటికి వెళ్లాడు.
కొనప్రాణంతో మనుమనికొరకై
గిలగిలతన్నుకు చూసింది
అయ్యో! మనుమడు రాలేదంటూ
ముసలిది కన్నులు మూసింది.
అయ్యో! అవ్వా అంటూ బాలుడు
భోరున పాపం ఏడ్చాడు.
రత్నం పట్టుకు బాలుండు
గుట్టను చేరీ చూశాడు
పడగల రాజూ మణితీయగనే
ప్రాణం విడిచీ పడిపోయాడు.
"అయ్యో! నేస్తం! చనిపోయావా?
వ్యర్థ త్యాగం చేశావా?"
అని విలపించెను బాలకుడు.



జంతుకోటిలో మానవలక్షణాలు

(గతసంచిక తరువాయి)

కుక్కలు పెంచే వాళ్లల్లో ప్రతి ఒక్కరూ తాము పెంచే కుక్క అల్లాటిల్లాటిది కాదనీ, దానికి తాము మాట్లాడే భాష సహితం అర్థం చేసుకో గలిగినంత శక్తిసామర్థ్యాలున్నాయనీ తాము నమ్ముతారు; మనచేత నమ్మించాలని శత విధాల ప్రయత్నిస్తూ వుంటారు కూడాను. అలాటి వారు ఎవరైనా మీకీసారి తారసిల్లితే, వారితోపాటు వాళ్ల యింటికి వెళ్లి యీ పరీక్ష చేసి చూడండి.

ఆ కుక్కపేరు 'టైగర్' అనుకోండి. మామూలుగా ఆయింట్లోని వారందరూ దాన్ని 'టైగర్ యిలారా' 'టైగర్ అలాపో' అని అంటూ వుంటారు. ఆ టైగర్ ఆమాదిరి హుకుములకు అలవాటుపడి ఎప్పుడు రమ్మంటున్నారో, ఎప్పుడు పొమ్మంటున్నారో గుర్తుపెట్టుకొని ఆవిధంగా నడుచుకొంటూ వుంటుంది. ఏమాట అనేటప్పుడు మనుష్యులు ఏమాదిరి వుదాత్త అనుదాత్తాలతో స్వరాలు పలుకుతారో, ఆ కుక్కకు ప్రయత్నం చేయకుండానే అలవాటు మీద అర్థమై, ఆ ప్రకారం నడుచుకొంటుంది. అంతే కాని — దానికి మనం మాట్లాడే భాషా, దానికి సంబంధించిన వ్యాకరణము అన్నీ తెలిసిపోయాయని మాత్రం అనుకోరాదు. ఎందుకంటారా యీ పరిశోధనచేసి చూడండి.

మామూలుగా 'టైగర్ యిలారా' అన్న మాటను ఏ వుదాత్త అనుదాత్త స్వరాలతో వుచ్చరిస్తారో జ్ఞాపకం పెట్టుకొని, అదే స్వరాలు వచ్చేలా అర్థంలేని ఒక వాక్యం—'బక్, బక్, గిలపో!' అర్థంలేని వాక్యం ఏదైనాసరే—' అని చూడండి. అంతలావు టైగరూ మీరన్న యీమాట తనకు అర్థమైనట్లు తోక ఆడించుకొంటూ మీ దగ్గరకు వస్తుంది. ఇంకాకావాలంటే మరోలా కూడా పరీక్ష చేయండి. మామూలుగా 'టైగర్ యిలారా' అన్నప్పుడు వుండే వుదాత్త అనుదాత్తాలు, ముఖభంగిమలు మార్చేసి, ఆ వాక్యాన్నే అని చూడండి. ఆ టైగర్ మీ వంక వెర్రి చూపులు చూస్తూ నిలుచుంటుందే కాని, ఎంతకీ కాలుకదిపి ముందుకు రాదు.

మావూళ్లో ఒక డిప్యూటీ కలెక్టరుగారుండే వాడు. ఆయనకు ఒక పెంపుడు కుక్క వుండేది. ఆకుక్క అంటే ఆయనకు తనమీద కంటె కూడా ఎక్కువ ప్రేమ వుండేది. అలాంటప్పుడు ఆకుక్క కూడా ఆయనను అంత ఎక్కువగానూ సంతోష పెట్టాలని తంటాలు పడుతూ వుండేదంటే, అందులో ఆశ్చర్య పడవలసినది లేదు. ఇలా వుండగా ఆయనను నేను ఒకసారి యింటి దగ్గర కలుసుకొని ఏదో చనువుగా మాట్లాడ్డం జరిగింది. ఆ సందర్భంలో ఆయన తన కుక్కను గురించి ఎన్నో వింతలు విశేషాలు చెప్పుతూ, ఆకుక్క తాను రోజూ యింటికి వచ్చేటప్పుడు ఎక్కే ఫోర్డుకారు హారన్ దగ్గర నుంచీ గుర్తుపెట్టుకో గలదని అన్నాడు. వాళ్ల యింటిముందు నుంచీ ప్రతిరోజూ కుక్కల లాగా వందలకొద్దీ కార్లు వస్తూ పోతూ వున్నా, యజమాని ఎక్కిన ఆఫోర్డుకారు హారను వినిపించి

☆ జంతుకోటిలో మానవ లక్షణాలు ☆

నప్పుడే అది ఎక్కడవున్నా పరిగెత్తుకు వీధిలోకి వస్తుందని చెప్పాడు.

ఇదంతా నిజమే కావచ్చు. ఎంచేత నంటారా?-కుక్కలకి మనకంటే వినికిడి శక్తి చాలా ఎక్కువ. ఒకటి, రెండు అడుగులకు మించి దూరంగా వున్న గడియారం చేసే టిక్కు టిక్కు శబ్దాన్ని మనమెవరమూ వినలేం కానీ, నలభై అడుగుల దూరంలో వున్నప్పటికీ కుక్కలు గడియారాల టిక్కు టిక్కు చక్కగా వినగలవని పరిశోధనల వల్ల ఋజువు అయింది. ఇప్పుడు యీ కుక్క విషయంలో ఆమాదిరి బలమైన వినికిడి శక్తి ఏర్పడి వుండటమే కాక, యజమాని రాకకు, ఆ ఫోర్డుకారు హారన్‌కు దాని మనస్సులో దానికి తెలియకుండానే అవినాభావ సంబంధం ఏర్పడి పోయింది. ఇలాటి అవ్యక్త సంబంధాలు ఏర్పరచుకోవటం మెదడు అంటూవున్న ఏ జంతువుకైనా తప్పనిసరే. అంతే కాని అది ఆ కుక్కకు మాత్రమే ఏర్పడిన బుద్ధి విశేషం కానేకాదు.

నిజానికి కుక్కలన్నీ కూడా మచ్చిక చేయబడిన తోడేళ్లేనని తేల్చి చెప్పవచ్చు. తోడేళ్లలో వుండే ఆ క్రూరత్వం తగ్గించి, దానికి సహజంగా మనుషులంటే వుండే అసహనం తగ్గించి, సేపటిలో లీసి వేయటానికి మనుష్యులకు చాలా వేల సంవత్సరాల కాలం పట్టిన మాట వాస్తవమే.

తోడేళ్లలోనుంచి తోడేలు గుణాలు తీసివేయటంలో ఏనాడు కృతకృత్యుడైనాడో ఆనాడే ఆ జీవిలో మానవుడు తనకు కావలసిన గుణాలను ప్రవేశపెట్టి పోషించాడు. మానవుడంటే పగబూనేతోల్లిటి తోడేలును మచ్చిక చేసి, తనపట్ల భక్తివిశ్వాసాలతో మెలిగేజీవిగా చేసి ఆకట్టుకొన్నాడు. అందులోనూ మళ్ళీ వేటకు పనికి వచ్చేందుకు కొన్ని, ఆటకు పనికి వచ్చేవికొన్ని, గొర్రెలు కాసేందుకు కొన్నిరకరకాల కుక్కలను తయారు చేశాడు.

అందుకనే యిటీవల కుక్కల విషయాలలో పరిశోధనలు జరిపిన కొందరు శాస్త్రవేత్తలు, ఏ కుక్కకైనా దాన్ని సాకే యజమాని గుణాలు కొన్ని వచ్చేస్తా యనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కోపదారి మనిషి పెంచే కుక్క అయితే, దానికీ చీటికి మాటికి కోపం వస్తుంది. యజమాని సౌమ్యుడైతే, అతడు పెంచుకొనే కుక్క కూడా సౌమ్యంగానే తయారౌతుంది. అంతే కాదు - ఏ దేశంలో పుట్టి పెరిగే మనుష్యులకు ఆ దేశ నైసర్గిక స్వరూపాలనుబట్టి కొన్ని కొన్ని ప్రత్యేకగుణాలు ఏర్పడుతుంటాయి. ఆ మనుష్యులలో వుండే ఆ ప్రత్యేక లక్షణాలే, ఆ దేశంలో సాకబడే ప్రతి కుక్కలోనూ సామాన్య లక్షణాలుగా కనుపించటంలోనూ ఆశ్చర్యం లేదు. ఉదాహరణకి జర్మని దేశస్థులకు జీవితమంతా ఏదో ఒక క్రమం తప్పకుండా నడుచుకోవటం ప్రత్యేక లక్షణం. ఆ దేశంలో పుట్టిన కుక్కలు కూడా అంతే. నియమా

లకు కట్టుబడి నడుచుకోవాలనే తత్వం వాటికీ పుట్టుకతోనే అబ్బుతుంది. జర్మనీదేశంలో పుట్టిన కుక్కను మన మెవరమైనా పొరపాటున పట్టుకొచ్చి యిక్కడ పెంచాలని ప్రయత్నిస్తా మనుకోండి. అలాంటప్పుడు ఆ కుక్క తాను నియమబద్ధంగా వుండటమే కాక, అలాంటివాటికి బద్ధకించే మన చేత కూడా నియమాలను పాటించేటట్లు చెయ్యందే వూరుకోదు!

పూర్వం కుక్కలను పెంచేవాళ్లు సామాన్యంగా ప్రత్యేకం గొఱ్ఱెలను మంద వెయ్యటానికో, వేటలను పట్టటానికో, బళ్లు లాగడానికో పెంచేవారు. ఇప్పుడు అల్లా కాదు. అసలు కుక్కలను పెంచేవాళ్ళ సంఖ్యే తగ్గిపోయింది. ఈ రోజున మనం ఆర్జించే సంపాదనలు మనుష్యులకే చాలకపోతున్నందువల్ల, కుక్కలను పెంచాలని ఎంత సరదావున్నా అది కుదరదు. అదీ కాక, మనం వుంటున్న యిళ్లు యిరుకుగొందులు. ఇలాటి వాటిలో అథవా మన మొక కుక్కను తెచ్చి కట్టి పడేసినా, నాలుగోరోజుకి అది కూర్చున్న చోటునుంచి లేవలేనంత నీరసంగా తయారైపూరుకొంటుంది. కాకపోతే-ఫేషన్ కోసమని కుక్కలను పెంచేవాళ్లు యిప్పటికీ మన బస్తీలలో వున్నారు అనుకోండి. అలాంటి వారికి కావలసింది తమ పోషణలో యింత ఎత్తు కుక్క వుండటమో, లేకపోతే అంత బొచ్చువున్న కుక్క వుండటమో యే కాని, యజమానుల పట్ల పెంపుడు కుక్కలు పెట్టుకునే ఆశలు ఏ తరహావి అయి వుంటాయో వాటి ఆ ఆశలను తీర్చే సావకాశాలు తమకు ఎంత వరకు వున్నాయో పరిశీలనగా చూసి వ్యవహరించే వారు యించుమించు ఎవరూ వుండరనే చెప్పవచ్చు. (ఇంకావుంది)



క్వైనైన్ కథ

ఆనందపురానికి ఆమడ దూరంలో "కొర్ర" అనే కోయ గ్రామం ఉండేది. దానిని కొండయ్య అనే కోయదొర పాలిస్తూ వుండేవాడు. కొండయ్య అంటే కోయ ప్రజలకి భయం, భక్తి రెండూ ఉండేవి. కొండయ్యకి ఒక ఆడపిల్ల; దాని పేరు కొయ్యమ్మ. కొయ్యమ్మ కోయలలో అపురూప సౌందర్యవతి. ఆమెకు విల్లమ్ములు ఉపయోగించడం, ఒడిశెలు త్రిప్పడం, బాగా వచ్చు. చక్కగా నాట్యం చేస్తుంది కూడాను.

కొండయ్య, కొయ్యమ్మని అపురూపంగా అతి గారాబంగా పెంచాడు. ఆమెను చక్కని కోయ రాజు కిచ్చి పెళ్లి చేయాలని ఆశతో వుంటున్నాడు.

కోయలు ఎంత చక్కగా ఉన్నా వారికి పరిశుభ్రత అంటే ఏమిటో తెలియదు! వారిలో చాలామందికి బోదకాలో, కడుపులో బల్లో, చలిజ్వరమో, ఏదో ఒకటి రాకతప్పదు. కొయ్యమ్మకి ఎక్కడ సోకిందో మాయదారి మన్యపు జ్వరం రానేవచ్చింది. దాంతో రోజు రోజుకీ క్షీణించి పోతూంది. కోయ

శ్రీ ఘండికోట
నరసింహమూర్తి

దంపతులు, కూతురికి వచ్చిన రోగం, చూచి భయపడి పోయారు. దేవుళ్లకు మొక్కేరు; దేవతలకు మొక్కేరు; కోళ్లు గొర్రెలు బలి ఇచ్చేరు; పండుగలు చేసేరు; పబ్బాలు చేశారు, రక్షరేకులు కట్టించారు; ఏంచేసినా జ్వరం మాత్రం తగ్గలేదు. తగ్గకపోగా యీ మోటు వైద్యాల మూలంగా మరీ ఎక్కువ అయింది.

కొయ్యమ్మకి జ్వర తీవ్రత ఎక్కువగా ఉంది. బ్రతుకే భారంగా తోచింది. ఏదైనా ఒక ఆకుతిని చచ్చిపోదామని, ఒకనాటి రాత్రి ఎవరితోనూ చెప్పకుండా కొండ మీదకు పోయింది. కొండమీద ఒక చాపరాయి ఉంది దానిమీద పండుకొని, తల్లి దండ్రులను తలచుకొని ఒక్కమారు బిగ్గరగా ఏడ్చింది. చివరికి మనస్సు గట్టిచేసుకొని ఆరాయి చుట్టూ పెరిగివున్న చెట్ల ఆకులు ఇన్ని వలిచి పట్టుకొచ్చుకొని నమిలేసింది. అదేం చెట్టో కానీ, —ఆ ఆకు కాలకూట విషంకన్నా చేదుగా వుంది. ఎలాగో కష్టపడి మింగేసి ఆ రాత్రంతా ఆరాయి మీదనే పడుకొని వుండిపోయింది

ఉదయాన్నే కొండయ్య మనుషులను పంపించి కోయమ్మ కోసం కొండంతా వెతికించాడు. తానూ కాలుగాలిన పిల్లిలాగా కొండలన్నీ గాలించి, యీ చాపరాయి మీద చాప చుట్టగా పడి ఉన్న



కొయ్యమ్మని చూచాడు; నిలువునా నీరైపోయాడు. చచ్చి పోయిందనుకొన్నాడు. దగ్గర కెళ్లి చూచాడు, ఇంకా ఊపిరి ఆడుతునే వుంది!

ధైర్యం కలిగింది, మెల్లగా తట్టి లేపేడు. కొయ్యమ్మ కళ్లు తెరచి చూచింది. ఎదురుగా తండ్రి కనిపించేడు. జ్వరం పూర్తిగా తగ్గిపోయినట్లుంది. ఒళ్లు చాలా తేలికగా వుంది. తండ్రిని చూచి ఘొల్లుమని ఏడ్చింది. తండ్రి ఆమెను దగ్గరకు తీసుకొని సముదాయించి తిన్నగా ఇంటికి తీసుకొని వెళ్లేడు.

కొయ్యమ్మ జరిగిన సంగతంతా చెప్పింది. ప్రతి రోజూ రాత్రి ఆ చాట్రాయి దగ్గరకు వెళ్లటం నాలుగు ఆకులు కోలిచి తినడం, అక్కడే ఆ బండ మీదే రాత్రి అంతా పడుకోవటం యీలాగు వారం రోజులపాటు చేసింది. దాంతో కొయ్యమ్మకి పూర్తి ఆరోగ్యం వచ్చేసింది.

నాటినుండి, ఎవరికేనా జ్వరం వస్తే కొయ్యమ్మకి దండం పెట్టి, రాయిమీద పండుకొని, ఆ ఆకులు తినేవారు. కొయ్యమ్మ కనిపెట్టిన మందు కాబట్టి దాన్ని "కొయ్యానా" అనేవారు.

తెల్లవారికి యీ సంగతి తెలిసి, కొండయ్య దగ్గరకొచ్చి, ఆ చెట్లు చూపించమని అడిగితే, యీాయడానికి అభ్యంతరం లేదుగాని ఆ మందుకు తన కూతురు పేరు పెట్టమన్నాడు. వాళ్లు అందుకు వొప్పుకొని, "క్వినైన్" అని పేరు పెట్టేరు.

★

అతగాడు క్రొత్తగా కాలేజీ చదువు మానేసిన వ్యక్తి. ఒకనాడు మరొక మిత్రునితో కలిసి బజారునే పోతూ పోతూ, ఒకచోట హఠాత్తుగా ఆగిపోయి, ప్రక్కనేవున్న టెలిఫోన్ బూత్‌లోకి వెళ్లి ఒక కంపెనీ యజమానికి టెలిఫోన్ చేశాడు.

"మీరు ఆ కంపెనీ యజమానిగారే కదండీ."

"అవును."

"అయితే తమరికి ఎకౌంటెంట్ పనిచేసేందుకు ఎవరైనా అభ్యర్థి కావాలా ?"

"అక్కర్లేదు."

"ఇప్పుడు వున్న ఆయన చేస్తున్న పని మీకు తృప్తికరంగా వున్నదన్నమాటేగా. అందుచేతనే తమరు యింకెవ్వరూ అక్కరలేదని అంటున్నారనుకుంటాను."

"అవును."

"సరేలెండి. వస్తాను.", అంటూ రిసీవర్ పెట్టేసి యివతలకు వచ్చాడు.

మిత్రుడు అడిగాడు:—"పావుం-ఏదో వుద్యోగంకోసం అడిగినట్లున్నావు."

"ఎబ్బే లేదు! ఇప్పుడు నే చేస్తున్న వుద్యోగమే మా యజమానికి నచ్చిందో లేదో తేల్చుకువచ్చాను." అని సమాధానమిచ్చాడు ఆ యువకుడు.

పెద్దలతో పేచీ

శ్రీ అరిపిరాల [illegible]

నాకు ఒంటరిగా రైలు ప్రయాణం చేయటం అంటే చాలా సరదా. అమ్మవాళ్ళతో కలిసి ప్రయాణం చేస్తే, వాళ్లు ఎప్పుడూ 'కుఱ్ఱవెధవా' అంటూ నాకు స్వతంత్రము యివ్వరు. కిటికీలో నుంచీ "సీనరీ" సర్దాగా చూడనివ్వరు. బండి యే స్టేషనులో నైనా ఆగిందంటే నాన్నగారు నన్ను ఆడదానిలా బండిలో కూర్చోమని తాను బండి దిగి నాకు యిష్టము లేనివి తింటానికి తెస్తారు. ఒకటేమిటి-ఈ పెద్దాళ్ళతో అన్నీ పేచీలే!

ఆరాత్రి నాకు ఎంతకీ నిద్దర పట్టలేదు. తెల్లవారినతరువాత ఎలాగయినా నాన్నగారు కాఫీ తాగే టైముకి మామయ్య నన్ను పంపమని వ్రాసిన రెండు వుత్తరాలు చూపించి పంపించమని మారాము చేసాను. లేకపోతే యీ పెద్దవాళ్లు నన్ను ఈ జన్మలో ఒంటరిగా ప్రయాణం చేయనివ్వరు. ఇలా అనుకుంటూ ఒక కునుకు తీశాను.

"ఏడు గంటలయినా యింకా నిద్ర పోతున్నావేమిరా అంటూ" మా అమ్మ నిద్రలేపింది. వెంటనే అమ్మతో నా ప్రయాణం సంగతి చెప్పి ఏడ్పు మొహాము పెట్టేశాను. "చూద్దాములే"అని వాకిట్లో కూరల పిలుపు వినవస్తే, మా అమ్మ అక్కడి నుంచి వెళ్ళిపోయింది

మామ వ్రాసిన రెండు కార్డులూ పుచ్చుకొని వంటింట్లో అమ్మ కాఫీ కాస్తున్న కుంపటివద్దకు హాజరయాను. అమ్మకు మళ్ళీ నా ప్రయాణం గోల వినిపించాను. "పోదువుగాని లేవోయి! చదువులో యింత పట్టుదల వుంటే ఎంత బాగుండును" అని కేక లేస్తూనే నాన్నగారు వంట యింట్లోకి కాఫీ తాగటాని కొచ్చారు. ఆరోజు అమ్మ కాఫీ చాలా బాగా చేయటం కూడా నా అదృష్టమే. నాన్నగారు వుబ్బితబ్బిబ్బై "కాఫీ చాలా బాగున్న"దన్నారు. అమ్మ నవ్వుతూ - "పెద్దబాబుని మా తమ్ముడు రాజమండ్రి. పంపమని రెండు వుత్తరాలు వ్రాస్తే మీరు వూరుకున్నారేమిటండీ? వీడు నన్ను తెగ పీక్కుతింటున్నాడు" అంటూ రెండు వుత్తరాలు నాన్నగారికి అందించింది.

"బాబు నొక్కడిని ఎలా పంపుతాము? వెంకివెధవ-వాడు తిన్నగా రాజమండ్రి చేరుతాడా; మీ తమ్ముడికి అంత చూడాలనుంటే, మీ మరదలుతో సహా యిక్కడికే వచ్చి పదిరోజులపాటు వుండి, వెళ్లేటప్పుడు వీణ్ణి తీసుకొపొమ్మని వ్రాయకూడదూ? నీకు చాదస్తముకాకపోతే కుఱ్ఱవెధవను ఒంటరిగా పంపుతానంటావు!" కాఫీ త్రాగటం ముగించి వెళ్ళబోతున్నారు నాన్న.

నాకు ఈమాటలు వినేసరికి అంత వరకూ లోపల లోపలే వున్న ఏడ్పు బిగ్గరగా పైకి వచ్చేసింది. అమ్మ నన్ను ఓదారుస్తూ నాన్నగారి దగ్గరకు వెళ్ళి "కుఱ్ఱాడు సర్దాపడుతున్నాడు పంపించండి! ఆపాటి రైల్ప్రయాణం చేయలేడా?" అన్నది.

నాన్నగారి మనసు కరిగిపోయింది కాబోలు. "జాగ్రత్తగా వెళ్ళగలవట్రా?" అని అడిగారు.

"ఓ వెళ్తా నాన్నా; వెళ్తాను" అని గంతులు వేశాను.

"రేపుకోచిలో పంపుతున్నట్లు మా తమ్ముడికి వుత్తరం వ్రాయండి"న్నది అమ్మ. నాన్నగారు తల వూపుతూ వెళ్లిపోయారు. నాన్నగారిని ఒప్పించి నాప్రయాణం స్థిరపరచిన మా అమ్మను ఆరోజు రోజుఅంతా తెగ పొగిడేశాను.

చొక్కాలు, లాగూలు, తువాళ్లు పోగేసుకొని చిన్న ట్రంకుతో సహా వంటింట్లోకి హాజరయ్యాను "ఇప్పుడేమి తొందరరా! నీ బట్టలు రేపు నేను సర్ది పెట్టుతా లే; వెళ్ళు ! నాకు ఎంతో పనివుంది. మీ మామయ్యకు పులిహోరంటే ఎంతో యిష్టం; అది కాస్త వండి నీచేతికి యిస్తాను, పట్టుకెళ్లుదువుగాని ! ... అదుగో వాకిట్లో ఎవరో పిలుస్తున్నట్లుంది, వెళ్ళి చూడ"మన్నది.

తలుపు తీసేసరికి నా స్నేహితుడు

మురళి, పరీక్షుల ముందు నాదగ్గర తీసుకొన్న హిందీనోట్సు తిరిగి యివ్వటానికి వచ్చాడు. మురళితో నా ప్రయాణం సంగతి చెప్పి, వున్నవీ లేనివీ కొన్ని కోతలు కోసేశాను.


*   *   *

రైలు యింకా రాలేదు. నాన్న బుక్ స్టాలుకు వెళ్ళి పిల్లల పత్రిక ఒకటి కొని పట్టుకొచ్చి నాకిచ్చి "బండిలో కొక్కిరాయి వేషాలు వేయక యిది చదువుతూ ఒకమూల కూర్చో!" అన్నారు. నాకు జరిగిన యీ గౌరవానికి పొంగిపోయాను. ఇంతలో రైలు వస్తున్నదనే మాటలు నా చెవిన బడ్డాయి. వెంటనే పుస్తకము జాగ్రత్తచేసి అటూ యిటూ చూస్తుండగా రైలు పెద్ద సింహం లాగా భంకరమైన ధ్వని చేసుకొంటూ మా ముందరికి వచ్చి ఆగిరది.

నేనూ నాన్నగారూ బండెక్కి కూర్చున్నాము. ఆపెట్టెలో వున్న ఒక సూటువాలాను "ఎంతవరకు వెళ్ళుతా" రని నాన్న అడిగారు.

నా దురదృష్టము కాకపోతే ఆయన గూడా రాజమండ్రికే రావాలి!

నాన్నగారు ఎంతో సంతోషంతో నన్ను వారికి వప్పగించి వారి ప్రక్కనే కూర్చోమన్నారు. నాకు వారి ప్రక్కనే కూర్చోటానికి ఎంతో అవమాన మనిపించింది. కానీ తప్పింది కాదు. అతికష్టం మీద వారిప్రక్కనే కూర్చున్నాను. బండి కదిలింది. "చేరగానే మీ మామయ్యను పుత్తరం......" అని నాన్నగారు అంటుండగానే మాబండి దాటిపోయింది. నాన్న యింకా ఏదోఅంటున్నట్లుంది కాన్నీ, నాకు ఒక్కటీ వినిపించలేదు.



సూటువాలాగారు నన్ను "ఏమి చదువుతున్నావ" నడిగారు. 4 వ ఫారము చదువుతున్నానని చెప్పాను. నాకు కొన్ని "బిస్కట్లు" యిచ్చి తినమన్నారు. నా ఒంటరి ప్రయాణానికి అడ్డు తగిలిన యీ పెద్ద మనిషి యిచ్చిన "బిస్కట్లు" తినటానికి నా మనస్సు ఒప్పలేదు. కాని నోరు మాత్రం తెగ వూరింది. చివరకు తినక తప్పిందిగాదు.

వారు పేపరు చదవటం మొదలుపెట్టారు. పోటీగా నేను నా పత్రిక తీసి చదవటం మొదలు పెట్టాను. అరగంట అయిందో లేదో-వారు చాలా దూరమునుంచి ప్రయాణం చేస్తున్నట్లుంది-గురకలు పెట్టి నిద్రకు పడ్డారు. నాకు స్వతంత్రంగా వుండే అవకాశం యిలాగైనా వచ్చిందని గుర్తించి వేడి నిట్టూర్పు విడిచాను. "కంపార్టుమెంటు"అంతా యిటునుంచి అటు, అటునుంచి యిటు నాయిష్టం వచ్చినట్లు తిరిగాను. కిటికీలోనుంచి తల బయటికి పెట్టి తనివితీరతొంగి చూశాను. పైన సామానులు పెట్టే చోటకు ఎక్కి కూర్చున్నాను. అక్కడినుంచీ కిందికి దూకాను. మళ్ళీ పైకి పాకాను. 'దొంగలున్నారు జాగ్రత' 'వుమ్మివేయరాదు' బోర్డులు మూడైసార్లు చదివేశాను. నాల్గురోజుల పాటు అందులోనే వుండి పోవాలనిపించింది. గొలుసుపట్టుకు లాగాలనిపించింది. కానీ లాగితే జుల్మానా వేస్తారేమో అని భయం వేసింది.

చల్లగాలికి నాకూ మంచి నిద్ర వచ్చింది. సరిగ్గా ఎనిమిది గంటలకు మెలుకువ వచ్చింది. ఇంతలో గోదావరి స్టేషన్ గూడా వచ్చింది. మా

(43-వ పేజీ చూడండి)

సీరియల్

విచిత్ర  వ్యక్తి

మూలం:- మార్క్ ట్వేన్

జరిగినకథ:— ఆస్ట్రియాలోని ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడువాళ్లైఅయిన సెప్పి, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీది మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తివచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తామేదో గొప్పవారమని అనుకుంటారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. చివరికి మాయమైపోయాడు. మా వూళ్లో ఫాదర్ పీటర్ అని ఒక మతగురువు ఉన్నాడు. ఆయన ఏ నేరమూ చెయ్యకపోయినా, పదవినుండి తొలగించబడ్డాడు. ఆయనకి సహాయంచేద్దామనో, ఏమో సైతాను పదకొండువందల బంగారునాణాలు ఆయనకిదొరికేట్టుచేశాడు. ఫాదర్ పీటర్‌కు విరోధియైన ఒక జ్యోతిష్కుడు ఆ డబ్బు తన దగ్గరనుండి దొంగిలించబడిందని ఆరోపణచేశాడు. వెంటనే ఫాదర్ పీటర్‌ను జైల్లో పడేశారు. ఆయన కుటుంబానికి సైతాను మళ్లీ సహాయంచేశాడు.

మార్గరెట్‌కి అప్పుడప్పుడు సందేహం పట్టుకుని బాధించేది. ప్రతిరోజూ అతిధులను సత్కరించటానికి తగిన ధనం ఎక్కణ్ణించి వస్తోంది? ఈ విషయమై ఉర్సులాను ఎన్నిసార్లు అడిగినా ఆమె "దిక్కులేని వారికి దేవుడే దిక్కు" అని వల్లించటం తప్ప మరొక మాట చెప్పేదికాదు. దేవుడు తలుచుకుంటే ఆయనకసాధ్యమనేది లేదని మార్గరెట్‌కి నమ్మకం ఉన్నది. అయినా వట్టి పుణ్యానికి దేవుడింత విస్తారంగా దయ చూపిస్తున్నాడంటే మార్గరెట్ నమ్మలేక పోయింది. కాని అముక్క పైకనలేదు. అంటే ఏం కీడు మూడుతుందోనని భయం. మంత్రాలు తంత్రాల ప్రభావమేమోనని మొదట అనుమానించింది, గాని ఆ అను



మానం నిరాధారమని నిశ్చయించుకుంది. ఎందుకంటే గాట్‌ఫ్రీడ్‌నార్ నౌకరుగా తమవద్ద కుదరక ముందు నుంచీ, ఇంట్లో ఈ ఆర్థిక విచిత్రాలు జరుగుతున్నాయి. కనక ఇది గాట్ ఫ్రీడ్‌నార్ పనికాజాలదు. ఇక ఉన్నది ఉర్సులా. ఆమెను అనుమానించటమే మహా పాపం. అంత భక్తురాలు, పుణ్యాత్మురాలు పృథ్విలో ఉండదు. పైగా ఉర్సులాకు మంత్ర గత్తెలంటే తగని మంట.

ఈ విధంగా తన అదృష్టానికి కారణం భగవంతుని కరుణయేగాని మరేమీకాదని మార్గరెట్ నిర్ణయించుకుంది. ప్రతిరోజూ ప్రార్థన సమయంలో దేవునికి కృతజ్ఞత వెల్లడించేది. పిల్లి న్యాయంగా తనకు రావలసిన కృతజ్ఞతా గౌరవం దేవునికి పోతున్నందుకు ఏమీ కించపడలేదు. తన శాయశక్తులా తంటాలు పడి ఇంటిల్లిపాదికీ సమస్తావసరాలు తీరుస్తున్నది. రోజుకొకరకంగా పిండి వంటలు సప్లయి చేస్తున్నది.

ప్రతి ఊళ్లోనూ సాధారణంగా మంచి స్వభావం గలవారు ఉంటూనే వుంటారు. అటువంటి వారు భయగ్రస్తులైనప్పుడో, స్వీయ ప్రయోజనాలకు పెద్ద దెబ్బ తగులనున్నప్పుడో తప్ప, ఇతరులకు హానిచెయ్యరు. మా ఈజెల్ డార్ఫ్‌లో కూడా ఇటువంటి సుస్వభావులు లేకపోలేదు. అయితే నేం? ఇవి మామూలు రోజులుకావు. మంత్ర గత్తెల భయం దేశమంతటా వ్యాపించి వుంది. భయ వివశులైన మనుషులు సులభంగా కర్కశత్వం అవలంబిస్తారు. అందుచేత మా వూళ్లో మంచివాడు, స్నేహశీలి అని చెప్పుకోదగ్గ వాడొక్కడూ మిగల్లేదు. మార్గరెట్ గృహంలో జరిగే విచిత్రాలకు ప్రతివాడూ భయంతో కొయ్యబారిపోసాగాడు. మంత్ర శక్తులవల్లనే ఆ విచిత్రాలన్నీ జరుగుతున్నాయని అంతా రూఢి చేసుకున్నారు. అక్కడికీ మా గ్రామస్థుల్లో కొందరు అమాయికలైన మార్గరెట్, ఉర్సులాలకు దుస్థితి పట్టనున్నందుకు లోలోపల జాలిపడ్డారు. ఆజాలిపైకే మాత్రం వెల్లడించలేదు. (వెల్లడించటం క్షేమం కాదు)

మార్గరెట్, ఉర్సులాలను కొంచెం జాగ్రత్తగా ఉండవలసిందిగా హెచ్చరించాలని మేం ముగ్గురు మిత్రులం అనుకున్నాం. కాని ఎన్నిసార్లు ప్రయత్నించినా ధైర్యం చాలలేదు. గ్రామస్థులు పన్నిన పన్నాగాన్ని బయట పెట్టేస్తే, ఏం కొంప మునుగుతుందోనని భయపడి నోరుమూసుకుని వూరుకున్నాం. ఇలా మేము ముగ్గురం లోలోపల భయపడి ఊరుకున్నట్టు పైకి ఒకళ్లతో ఒకళ్లం చెప్పుకోటానికి కూడా సిగ్గుపడ్డాం. ముగ్గురం కలుసుకున్నప్పుడు మార్గరెట్ విషయం తప్ప మిగతాఅన్ని విషయాలు మాట్లాడుకునే వాళ్లం. ఈ కృత్రిమ ప్రవర్తనవల్ల మేమెంత నీచులమై పోయామో మాకే తెలుసు. అందులో, రోజూ మార్గరెట్ ఇంటికివస్తూ, పోతూ, ఆమె ఇంట్లో విందులారగిస్తూ, ఆమెకు రాగల హానికూర్చి ఒక్క మాట అందించలేక పోవటం మరీ నీచం అనిపించింది. పాపం, మార్గరెట్ పట్టి అమాయకురాలు. మొన్నటివరకూ తనగడప తొక్కని గ్రామస్థులు మళ్లీ ఎందుకు వస్తున్నారో, వచ్చి ఇంట్లో నాలుగు మూలలూ వెయ్యి కళ్లతో ఎలా శోధిస్తున్నారో, తాము చూసిన ప్రతి స్వల్పవిషయమూ మూట కట్టుకుని ఫాదర్ అడాల్ఫ్‌కు ఎలా చేరవేస్తున్నారో ఆమె కాస్తయినా గ్రహించలేదు. వెర్రి బాగుల దానిలా, గ్రామస్థులు తన గడప తొక్కిందే చాలనుకుని మురిసిపోయింది.

గ్రామస్థులు మార్గరెట్ ఇంట్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫాదర్ అడాల్ఫ్‌కి తెలియజేసినా ఆయనకి తలాతోకా స్ఫురించలేదు. ఆఇంట్లో గాకపోతే చుట్టుపక్కల దగ్గర్లోనే ఎక్కడో మాంత్రికుడో, మంత్రగత్తో ఉండి ఉండాలి. గ్రామస్థులు ఎంత సోదాచేసినా అటువంటి వ్యక్తి ఎవరూ కంటపడలేదు. మార్గరెట్ గాని, ఉర్సులాగాని, గాట్‌ఫ్రీడ్‌నార్ గాని మంత్రతంత్రాలు జపిస్తున్నట్టుగాని, మాయలు గారడీలు చేస్తున్నట్టు గాని ఎవరూ చూడలేదు. అయితే ఇన్నిరకాల పిండివంటలూ, ఇన్నిరకాల ఫలాలూ, పానీయాలు ఎడతెగకుండా ఎక్కణ్ణించి వస్తున్నట్టు? గ్రామస్థులు ఏది అడిగితే అది, ఎంత అడిగితే అంత చిటికెలో సప్లయి అవుతోందట. మంత్రగత్తెలు ఇటువంటి పనులు తేలిగ్గానే చేయగలరు. కాని మంత్రాలు జపించకుండా, ఉరుములు, పిడుగులూ, భూకంపాలు రాకుండా, పిశాచాలు కళ్లఎదట నాట్యం చెయ్య

★ అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు ★

విచిత్ర వ్యక్తి

కుండా ఈ విచిత్రాలేమీ జరగటానికి వీల్లేదే. ఎంత మంత్రగత్తెలయినా ఇంత సునాయాసంగా మాయలు చేయలేరే. ఇదేదో కొత్తరకం ఇంద్రజాలం. ఏపుస్తకం లోనూ ఈమాదిరి మాయల్ని గూర్చి చదవలేదు. మాంత్రిక వస్తువులు మంత్రం ఉన్నంత వరకే బాగా ఉంటాయి; మంత్రం విచ్చిపోయిన తరవాత అవి మట్టి అయిపోతాయి. కాని మార్గరెట్ ఇంట్లో వస్తువులు అలాకాదే! గ్రామస్థులు చాటుగా కొన్ని పిండివంటలు పళ్లు, ఇతరవస్తువులు తెచ్చి ఫాదర్ అడాల్ఫ్ కిచ్చారు. ఆయన శిలువ ముట్టుకుని ఆ వస్తువుల్లో వున్న మంత్రం విచ్చిపోవుగాక! అని ప్రార్థనలు చేశాడు. అవి నిజంగా మాయవస్తువులైతే అంతటితో మట్టి పోవాల్సిందే కాని అవి శుభ్రంగా నిక్షేపంలా ఉండి పోయాయి. మామూలు పదార్థాలు చెడిపోవటానికి ఎంతకాలం పుచ్చుకుంటాయో అవికూడా అంత కాలం పుచ్చుకుని మరీ చెడిపోవటం, కుళ్లిపోవటం ప్రారంభించాయి.

ఫాదర్ అడల్ఫ్ ఆశ్చర్యానికి మేరలేదు. తనంత గొప్పమేధావినికూడా తల్లకిందులు చేసేస్తున్న ఈవిచిత్ర సంఘటనలను తలుచుకున్నప్పుడల్లా ఆయనకి పిచ్చెక్కినంత పని అయ్యేది. మంత్రశక్తులవల్ల జరుగుతున్న పని కాదని ఆయన నిశ్చయం చేసుకున్నాడు. కాని అలాగని అక్కడితో ఊరుకుంటే ఎల్లా? ఇదేదో కొత్తరకం మంత్రశక్తి కావచ్చుగా? మరి ఈ సంగతి ఎలా తేల్తుంది? ఆలోచిస్తే ఒక ఉపాయం తట్టింది:

మార్గరెట్ ఇంట్లో అంత వస్తుసామగ్రి ఉన్నదీ అంటే, అది బయటినుండి వచ్చినదై ఉండాలి; లేక ఇంట్లోనే ఎక్కడో తయారైఉండాలి. ఇంట్లోనే అంత సామగ్రీ తయారవుతోందీ అంటే నిస్సందేహంగా అది మంత్రశక్తివల్లనే. భేష్! ఈ ఆలోచన బావుంది; ఇప్పుడు బయటపడకపోతుందా కిటుకు అనుకున్నాడు ఫాదర్ అడల్ఫ్.

7

ఇంతలో మార్గరెట్ తన ఇంట్లో విందుచేయ నిశ్చయించింది, నలభైమందికి ఆహ్వానపత్రాలు పంపించింది. విందు ఇంకా వారం రోజు లుంది. ఈ విషయం ఫాదర్ అడాల్ఫ్‌కి తెలియగానే ఆయన సంతోషం వర్ణనాతీతం. 'వెదుకబోయిన తీగ తగిలిన' ట్లయింది. రహస్య విచ్ఛేదం చేయటాని కిదే మంచి తరుణం. మార్గరెట్ ఇల్లు విడిగా ఉన్నది. దానికి చుట్టు పక్కల చాలదూరంవరకూ జనసంచారం ఉండదు. ఈ వారంరోజులూ జాగ్రత్తగా మార్గరెట్ ఇంటిని నిఘాలో ఉంచితే, విందుకు అవసరమైన పదార్థాలు, వస్తుసామగ్రి బయటినుంచి లోపలికి వెడుతున్నదీ లేనిదీ సులభంగా కనిపెట్టవచ్చు. బయటినుండి లోనికి ఏమీ వెళ్లకపోతే లోపలే ఎవరో సైతాను సహాయంతో వాటిని తయారుచేస్తున్నారన్నమాట.

మార్గరెట్ ఇంట్లోకి మనుషులు వస్తున్నారు, పోతున్నారు. కాని ఎవరూ ఏమీ తీసుకుపోవటమూ లేదు; తీసుకురావటమూ లేదు. నలభైమంది అతిథులకు వడ్డించటానికి ఎంత సామగ్రి కావాలి? మరి ఒక్క పిసరుకూడా లోపలికి పోలేదే? ప్రతిరోజూ చీకటి పడగానే మార్గరెట్ ఒక బుట్ట తీసుకుని ఎక్కడికో వెడుతూ వున్నమాట నిజమే. కాని తిరిగి వచ్చేటప్పుడు వెంట ఏమీ తీసుకొస్తున్నట్లు కనబడలేదు.

ఆరోజే విందు. అతిథులు కొంచెం ముందుగానే వచ్చి తమ తమ స్థానాలాక్రమించారు. ఫాదర్ అడాల్ఫ్, ఆయన వెనక (ఆహ్వానింప బడకపోయినా) జ్యోతిష్కుడు వచ్చారు. గ్రామస్థులు జ్యోతిష్కుని చెవులో ఊదారు, బయటినుంచి సామగ్రి ఏమీ రాలేదని. విందు ప్రారంభమైంది. బల్లలమీద తళతళ మెరిసే పళ్లెరాలలో, పాత్రలలో గ్రామస్థులెవరూ తిని కని వినని పదార్థాలు, పానీయాలు కొల్లలుగా ఉన్నాయి. అతిథులు వాటిని ఒక్కుమ్మడిగా ముట్టడించి నిశ్శేషం చెయ్యసాగారు. జ్యోతిష్కుని మనస్సు క్షణకాలం కల్లోలమైంది. తిరిగి తేరుకుని చుట్టూ చూశాడు. ఈ పదార్థాలన్నీ నిజమైన పదార్థాలుగానే కనిపిస్తున్నాయి. రుచికి, స్పర్శకు, వాసనకు అన్నిటికీ మామూలుగానే ఉన్నాయి. మంత్రాలు లేవు, తంత్రాలు లేవు; ఉరుములులేవు, మెరుపులు లేవు; అంతవరకూ నిశ్చయమే. ఇది మంత్ర

మహిమ అనే విషయంకూడా నిశ్చయమే. సందేహం లేదు; అంతే కాదు; ఇది మామూలుగా చూసే మంత్ర మహిమకూడా కాదు; అపూర్వము, అద్భుతము, అనితరసాధ్యము అయిన మంత్ర మహిమ. ఇది సామాన్యమైన శక్తికాదు. దీన్ని భేదించటానికి జ్యోతిష్కుడు కృతనిశ్చయు డయ్యాడు. తన ప్రయత్నం నెరవేరితే, ప్రపంచం మూల మూలలకూ ఈ విషయం పాకిపోతే, తన పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ బడుతుంది. దేశాలన్నీ దిగ్భ్రమ చెంది చూస్తాయి. ఇంత గొప్ప వ్యక్తి, మరెవరూ చేయలేనిపని చేసిన మహాత్ముడు నిజంగా ఉన్నాడా అని ఆశ్చర్యంతో తర తరాలు తన పేరు చెప్పకుంటారు. తన భావి కీర్తికి సంబంధించిన ఈ మధుర భావనతో జ్యోతిష్కునికి కైపెక్కింది.

ఉర్సులా జ్యోతిష్కుణ్ణి వినయంగా సమీపించి, "ఏం కావాలి సార్!" అని అడిగింది.

"నీ యిష్టం వచ్చింది తీసుకురా," అన్నాడతడు.

ఉర్సులా, గాట్‌ఫ్రీడ్ నార్ ఇద్దరూ కలిసి పక్కగదిలోనుంచి కొన్ని పానీయాలు పట్టుకువచ్చారు. జ్యోతిష్కుడి బల్లమీద ద్రాక్షరసం సీసాలు రెండు అమర్చారు. ఒక సీసాలో ఎర్రమధువు, మరొక దానిలో తెల్ల మధువు ఉన్నాయి. జ్యోతిష్కుడు అత్యుత్సాహంతో ఎర్రమధువు ఒక గ్లాసులో పోసుకుని తాపీగా తాగాడు; మరొకగ్లాసు కూడా కానిచ్చాడు. తరవాత ఎదురుగా వున్న వివిధ భక్ష్యపదార్థాలు ఆబగా లగాయించసాగాడు.

సరిగ్గా ఆ సమయానికే సైతాను అక్కడికి వచ్చాడు. అతడు వస్తాడని నేను ఊహించలేదు. వారం రోజులు పైగా అయింది అతడు వెళ్లిపోయి. ఈరోజున వస్తాననికూడా మాతో చెప్పలేదు. అయినా సరిగ్గా సమయానికే వచ్చాడు. విందు జరుగుతూండటంచూసి, ఆహ్వానం లేకుండా వచ్చినందుకు సిగ్గుపడ్డట్టు నటించి, వెళ్ళిపోబోయాడు. కాని మార్గరెట్ గబగబ వెళ్ళి అతని కరస్పర్శ చేసి ఉండవలసిందని బతిమాలింది. అతడు ఉండటానికి అంగీకరించాడు. మార్గరెట్ అతన్ని సాదరంగా హాల్లోనికి తీసుకుపోయింది. ఆడపిల్లలకి, విల్హెల్మ్ మీడ్లింగ్‌కు, కొంతమంది గ్రామపెద్దలకు అతన్ని పరిచయం చేసింది. అతణ్ణి, చూడగానే హాలంతటా సంచలనం కలిగింది. ఒకరితో ఒకరు గుసగుసలాడుతూ అతన్ని గురించే చెప్పకోసాగారు:

"చూశావా? ఆ అబ్బాయి ఎంత బావున్నాడో?"

"ముఖంలో ఏమి వర్చస్సు, ఏమి తేజస్సు!"

"అతని పేరేమిటో?"

"ఫిలిప్ ట్రామ్."

"సరిగ్గా సరిపోయింది పేరు. పేరుకు తగ్గట్టే ఉన్నాడు." (జర్మన్ భాషలో 'ట్రామ్' అంటే 'డ్రీమ్'—స్వప్నం—అని అర్థం.)

"ఏంచేస్తూ వుంటాడో?"

"చర్చి ఉద్యోగానికి చదువుతున్నాడట."

"బావుంది. అతని అందం చూస్తే బిషప్

★ విచిత్ర వ్యక్తి ★

అయిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. అదృష్ట వంతుడు."

"అతని పినతండ్రి దక్షిణాదిన ఎక్కడో ఉన్నాడట. గొప్పధనవంతుడట."

"అలాగా? అబ్బా!"

ఈవిధంగా అతిథులు గుస గుసలుగా చెప్పుకో సాగారు. సైతాన్ను చూడగానే యీ వన్మందీ తన్మయులై పోయారనటంలో సందేహం లేదు. అతడు హాల్లో అడుగుపెట్టిన క్షణం నుంచీ వాతావరణం హఠాత్తుగా చల్లబడింది. బయట తీవ్రంగా ఎండ కాస్తున్నా లోపల ఇలా చల్లపడటానికి కారణమేమిటో ఎవరూ ఊహించలేక పోయారు. (అది సైతాను సాన్నిధ్యంవల్ల జరిగిన పనేనని మా ముగ్గురికీ తప్ప మరెవరికీ తెలియదు.)

ఈలోగా జ్యోతిష్కుడు మరొక గ్లాసెడు మధువు తాగాడు. అది మూడో గ్లాసు. గ్లాసులో మధువు వంచుకుని సీసా బల్లమీద పెట్టడంలో బల్ల కొంచెం కదిలి సీసాకింద పడబోయింది. వెంటనే పట్టుకున్నాడు. కాని మధువు చాలా వొలికిపోయింది. సీసా ఎత్తిపట్టుకుని చూస్తూ "అరెరే! చక్కటి ఎర్రద్రాక్ష రసం. వొలికిపోయింది!" అని విచారించాడు. ఇంతలో హఠాత్తుగా అతని ముఖం ఒక్క వెలుగు వెలిగింది. "త్వరగా! త్వరగా! పెద్దగిన్నె పట్టుకురండి," అని అరిచాడు.

ఉర్సులా గిన్నె పట్టుకొచ్చి ఇచ్చింది. జ్యోతిష్కుడు సీసాను గిన్నెలోకి వంచాడు. అంతకుముందు సీసాలో కొంచెంమాత్రమే ఎర్రమధువు ఉన్నది. అతడు సీసా వంచగానే బుడబుడ శబ్దంచేసుకుంటూ గిన్నెలోకి బోలెడు ఎర్ర మధువు స్రవించసాగింది. గిన్నె క్రమంగా నిండిపోయింది. ఎర్రమధువు గిన్నెనుండి కొంచెం పొర్లిపోయింది కూడాను. ఈ అద్భుతదృశ్యం అతిథులు యీ వన్మందినీ ఆశ్చర్యచకితులను చేసింది.

జ్యోతిష్కుడు సీసాఎత్తి అందరికీ చూపించాడు.

"చూశారా? సీసా పూర్తిగా వంచేసినా ఇంకా నిండుగా వుంది," అన్నాడు. అతిథులు నిశ్చేష్టులై వున్నారు. నేను సైతాను వంక చూశాను. అదే క్షణంలో అతడు అంతర్హితుడై పోయాడు. ఫాదర్ అడాల్ఫ్ కపీమని లేచాడు. గొంతెత్తి "ఈ ఇంట్లో పిశాచా లున్నాయి," అని గర్జించాడు. అతిథులు కెవ్వున కేకవేసి లేచిపోయారు. "ఈ ఇంట్లో పిశాచా లున్నాయి. ఈ ఇంటిని—" అని ఫాదర్ అడాల్ఫ్ ఏదో అనబోయాడు. ఆయన నోరు హఠాత్తుగా మూసుకు పోయింది. ఒక్కమాట బైటికి రాలేదు.

ఆక్షణంలో సైతాను నాకు మళ్లీ కనిపించాడు; ఉల్లి పొరలాగ గాలిలో తేలుతూపోయి జ్యోతిష్కుడి శరీరంలో ఏకమై పోయాడు. జ్యోతిష్కుడు చెయ్యెత్తి అధికార స్వరంతో, పారిపోబోతున్న గ్రామస్థులను ఆజ్ఞాపించాడు: "ఆగండి. కదలకండి." అందరూ ఉన్నచోటే ఆగిపోయారు. "గరాటీ పట్టుకురండి," అని అరిచాడు. ఉర్సులా గడగడ వణికిపోతూ రాటీగ తెచ్చి ఇచ్చింది. జ్యోతిష్కుడు గరాటీ సీసాలో పెట్టి ఇందాక మధువుపోసిన గిన్నెఎత్తి అదంతా సీసాలో పోశాడు. సీసానిండా అదివరకే మధువున్నది. అయినా గిన్నెలోని మధువంతా సీసాలోకే పోయింది. మధువంతా ఈ విధంగా సీసాలోకి ఓడ్చాక జ్యోతిష్కుడు అందరికేసీ గర్వంగా చూసి "హాహ్హాహ్హా" అని వికటాట్టహాసం చేశాడు. "హు. ఇదోలెక్కా, పత్రమా, జమా? ఇది ఎవరైనా చేయగలరు. నేను తలుచుకుంటే ఇంతకంటే గొప్ప తమాషాలే చెయ్యగలను," అని మళ్ళీ నవ్వాడు.

"ఓయి దేవుడోయ్! ఈయనకి దెయ్యం పట్టింది," అంతా ఒక్కసారిగా గొల్లుమన్నారు. అతిథుల ముఖాలు భయంతో తెల్లగా పాలిపోయాయి. ఒక్కపరుగున గుమ్మంకేసి దూకి వెనక్కి తిరిగి చూడకుండా అంతా పారిపోయారు. ఒకళ్లనొకళ్లు తొక్కుకుంటూ, ఎటు పోతున్నదీ చూసుకోకుండా తలొకదారిగా పోయి వీధిలోపడి పరిగెత్తారు. ఒక్క నిమిషంలో ఇల్లంతా ఖాళీ అయింది. మేము ముగ్గురు మిత్రులం, విల్హెల్మ్ మీడ్లింగ్, ఉర్సులా, మార్గరెట్, గాట్‌ఫ్రీడ్ మాత్రం ఉన్నచోటనే పాతుకుపోయాము. ఇప్పుడు జరిగిన విచిత్రసంఘటనలోని రహస్యం మాకు ముగ్గురికే తెలుసు; ఏమీభయపడవద్దనీ, ఇది సైతాను ప్రభావమేనని చెప్పి వారికి ధైర్యం కలిగించాలనుకున్నాం, గాని నోరు మెదల్చలేకపోయాము. సమయానికివచ్చి మార్గరెట్‌ను ఆదుకున్నందుకు సైతాన్ను మనసులోనే అభినందించాం. అతడు గనక రాకపోతే ఫాదర్ అడాల్ఫ్ గ్రామస్థులచేత ఏం చేయించేవాడో తెలియదు.

(ఇంకా వుంది.)

పెద్దలతో పేచీ

(37-వ పేజీ తరువాయి)

పెట్టెలోనివారు కొందరు దిగారు. సూటువాలాగారు మెలకువ తెచ్చుకొని తన "బెడ్డింగ్" వగైరా సర్దుకొని నాకోసం కంగారుగా అటూ యిటూ చూస్తున్నారు. బండిలో వున్న వాళ్ళందర్నీ "యిక్కడ కూర్చున్న కుఱ్ఱాడు ఎటు వెళ్ళాడండీ" అని అతి దీనంగా అడిగాడు. అందరూ మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు. నిజానికి వాళ్ళ కెలా తెలుస్తుంది చెప్పండి? నేను పైకి ఎక్కడం చూసిన వాళ్ళు యిదివరకే బండి దిగి వెళ్ళిపోయారాయను! ఆయనగాభరా చూసి నాకే జాలేసింది; పైనుంచే వార్ని పిల్చాను. నన్ను క్రిందికి దిగమన్నారు. "ఎక్కడికి వెళ్లావ్ నాతో చెప్పకుండా? నీకోసం ఏమైనావో నని చాలా భయపడ్డాను. రక్షించావు. ఇకనైన కుదురుగా కూర్చో. రాజమండ్రి స్టేషన్ అయిదు నిమిషాల్లో వచ్చేస్తోంది. ఊఁ - నీట్రంకు దించూ" అన్నారు.

మేమిలా మాటలాడుతుండగానే రాజమండ్రి స్టేషన్ వచ్చేసింది. ఇద్దరం బండి దిగాము. ప్లాటుఫారముమీద మా మామయ్య కనుపించలేదు. నాకు భయమేసింది. సూటువాలాగారు వాళ్లయింటికి రమ్మన్నారు. గేటు యివతలకు వచ్చేసరికి మామయ్య సైకిలు మీద రానేవచ్చాడు. సూటువాలాగారికి దణ్ణం పెట్టాడు. నేనొక సైకిల్ రిక్షాఎక్కి తిన్నగా యింటికి చేరాను. మాఅత్త నాకోసం ఎదురు చూస్తూవున్నది. నేను కనబడగానే కౌగిలించుకొన్నది.

మరునాడు మామయ్య నన్ను "పరీక్ష ప్యాసుఅవుతావా లేదా?" అన్నాడు. ప్యాసు కాగలనని చెప్పాను. ప్రతిరోజు ఆఫీసునుంచి మధ్యాహ్నము యింటికి రాగానే మాయింటినుంచి వుత్తరాలేమైనా వచ్చినదీ లేనిదీ మామయ్య నడిగి తెలిసికుంటుండేవాడిని. ఒకరోజు మామయ్య ఎందుకో కోపంగా యింటికొచ్చాడు. నా పరీక్ష యేమవుతుందో చెప్పమన్నాడు. ప్యాసు కాగలనని చెప్పి అక్కడనుంచి మెల్లగా తప్పుకొన్నాను. వ్యవహారము చూస్తే-పరీక్ష పోయినట్లనిపించింది. ఒళ్ళంతా చెమట పట్టి నోట సరిగా మాట రాలేదు. నాస్థితి చూచి మా అత్త "ప్యాసు అయినావటలే భయపడకు. మీ తమ్ముడు శ్యాము గూడా ప్యాసు అయినాడట. నిన్ను రెండు రోజులలో పంపమని మీ నాన్నగారు వుత్తరము వ్రాశారట" అని చెప్పింది.

నాకు అప్పటికి ప్రాణం కాస్త స్థిమితపడింది. పరువు కాస్త నిలిపినందుకు ఆంజనేయస్వామికి పది టెంకాయలు తప్పకుండా కొడ్తానని మ్రొక్కుకొన్నాను. మా వూరు ఎప్పుడు వెళ్లుదామా, మా స్నేహితులతో గొప్పగా ఎప్పుడు తిరుగుదామా అనిపించింది.

నా ప్రయాణం దగ్గిర పడిందని రాజమండ్రిలో చూడదగ్గ ముఖ్య ప్రదేశాలన్నీ మామయ్య చూపించాడు. గోదావరి ఆనకట్ట, సెంట్రల్ జైలు, వాటరువర్క్సు, కోట్లింగాలు, సారంగధర మెట్ట యింకా ఎన్నో చూశాను. కొన్ని మంచి సినిమాలు గూడా చూసాను.



"ఒరేయ్! రామూ! రాత్రి నాకు భలే కల వచ్చిందిరా. మరిటా-నేనటా-ఏదో భవనంలోకి వెళ్ళానట. అక్కడ-జీలేబీలు... హల్వా... పెద్ద పెద్ద పళ్లేలనిండా కనిపించిందిరా?"

"అయితే నువ్వేం చేశావ్?"


"ఏమ్చే! ఏమీ చెయ్యలేదు. ఈలోగా తెల్లారింది; నిద్దర లేచానుకో. కానీ-యీ వేళ మాత్రం పెందరాళే పడుకొంటాను."

మామయ్య కొత్తలాగూ చొక్కా కుట్టించాడు. నాన్నగారు వ్రాసిన ప్రకారం మంగళవారం నాడు కోచీకి నన్ను ఒంగోలు పంపారు.

వచ్చేటప్పుడయినా ఒంటరి ప్రయాణము కుదిరిందిగాదు. రాజమండ్రి స్టేషన్‌లో మావూరి కరణంగారొకరు దొరికారు-నా ప్రాణానికి! మామయ్యవారికి నన్నప్పగించాడు. ఎలాగయినా నా ప్రాణానికి ఈ "బాడీగార్డులు" తప్పలేదని విచారిస్తూ యిల్లుచేరాను. ★



అవరిండియావారి “తాయిల్లు”లో రాజకుమారి.



వినోదావారి "దేవదాసు"లో శివరాం, నాగేశ్వరరావు.

★ ఫిలిం పరిశ్రమపై పన్నులభారం ★

శ్రీ చామర్తి కనకయ్య

భారతప్రభుత్వం విధించే అక్రమమైన పన్నులకు, ప్రదర్శించే అలక్ష్యవైఖరికి గురి అయే కొన్ని పరిశ్రమలలో ముఖ్యమైనది ఫిలిం పరిశ్రమ. ప్రభుత్వంలో బాధ్యతగల ప్రముఖవ్యక్తుల వైఖరి, ప్రసంగాలు పరిశ్రమలోని వారికి బహునిరాశా జనకంగా ఉంటూ అసంతృప్తిని కలిగిస్తున్నాయి. గడచిన మే, జూన్ నెలలో ఇండియా ఫిలిం ఫెడరేషన్ వారు మద్రాస్‌లో 'పన్నుల భారం మూలంగా ఫిలిం పరిశ్రమను ఎదుర్కొంటున్న చిక్కులను తొలగించడం విషయమై ఫిలిం దర్యాప్తుసంఘం చేసిన సూచనలు అమలు జరపవలసింది' గా కోరుతూ జరిపిన సమావేశాలు, చేసిన తీర్మానాలు గమనిస్తే ప్రభుత్వం పరిశ్రమ పట్ల ఎంత అనాదరణీయంగా ప్రవర్తిస్తున్నదీ తేటతెల్లమౌతుంది. మనరాష్ట్రంలోని సినిమా థియేటర్ యజమానులు కూడ మద్రాస్‌లో సమావేశమై పన్నులభారాన్ని తగ్గించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ తమకనీస కోర్కెలను వెల్లడించారు

ఫిలింపరిశ్రమపైగల పన్నులను ఎంతమాత్రమూ తగ్గించబోవడం లేదని, అట్లాంటి ఆశలు పెట్టుకోవద్దని చెబుతూ, ఇప్పటికంటె సినీమావారు ఎక్కువ పన్నులనే చెల్లించగల సమర్థులని గత జూన్ నెలలో బొంబాయి ముఖ్యమంత్రి తన అహమ్మదాబాద్ ప్రసంగంలో పేర్కొన్నారు. అదేనెల ఫిలింవాణి జ్యమండలిలో మైసూర్ హోమ్‌మంత్రి "దినదినాభివృద్ధిగాంచుతున్న ఫిలిం పరిశ్రమపై మరింత పన్ను విధించనందుకు సినీమావారు సంతోషించాలి" అన్నారు

మనభారత ఫిలిం పరిశ్రమకు రమారమి



వినోదా వారి "దేవదాస్"లో భగవాన్ బాకీలు వసూలు చెయ్యటానికి ఒక్క సారే వచ్చిపడ్డ బాకీదార్లను దేవదాస్ సర్దుబాటు చేసి పంపేస్తున్నాడు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య యాక్షన్ చెబ్తూవుంటే, కెమేరామేన్ రంగా టాప్ లైట్ "ఆన్" అంటున్నాడు.

ఫిలింపరిశ్రమపై పన్నులభారం

40 సంవత్సరాల వయస్సున్నది. ఈ పరిశ్రమ దేశంలోని భారీ పరిశ్రమలన్నిటిలో తృతీయ స్థానాన్ని ఆక్రమించింది కూడ. ఇందు పెట్టుబడి సొమ్ము 35 కోట్లను మించివున్నది. ఈ పరిశ్రమపై ఒక్కలక్ష వేలమందికి పైగా జీవిస్తున్నారు. కొన్నికోట్లు దీని మూలంగా ప్రభుత్వానికి వినోదం పన్ను పేరుతో ముట్టచెప్పబడుతుంది. రకరకాలపన్నుల మూలానా ఫిలింపరిశ్రమనుంచి వచ్చే రాబడిలో నూరింట దగ్గరగా 60 వంతులు ప్రభుత్వం తీసికొంటున్నది. ఒక్క వినోదపుపన్ను మన దేశంలోని వివిధ ప్రాంతాలలో నూరింట 20 నుంచి 60 వంతులవరకూ వ్యాపించి వుంది. ఇంకా రకాల పేర్లతో కొత్త పన్నుల విధింపుకు కూడ అధికారులు యత్నిస్తున్నారు.

నిజానికి, వినోదపుపన్ను చిత్రపరిశ్రమాభివృద్ధికి సర్వదా ప్రతిబంధకం అనే విషయంతో ఫిలింపరిశ్రమతో ఏమాత్రం సంబంధం కలవ్యక్తయినా విభేదించకుండా ఉండలేడు. యుద్ధకాలంలో ఎవరు ఎటువంటి చిత్రంతీసినా దానిని ప్రజలు కళ్ళకద్దుకొని చూసేవారు. యుద్ధకాలంలో చిత్రాలకు గిరాకీ హెచ్చింది. నిర్మాతలుబాగా బాగుపడ్డారు. నటీనటులు హెచ్చుకొని నిర్మాత ప్రకటన చేసినదే తడవుగా డిస్ట్రిబ్యూటర్లు ఈ న్లాపాలే వారు. ఎగ్జిబిటర్లు కూడ



ప్రకాష్ వారి "కన్నతల్లి"లో కమ్మని సంగీతం కూరుస్తూవున్న శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు హార్మోనియం వాయిస్తూవుంటే సత్యం సిగరెట్ నిషాలో తబలా కొట్టుతున్నాడు. సౌండ్ ఇంజనీరు ముకుందన్, తమిళకవి సుబ్బరామ్ వెనక కూర్చున్నారు. గాయక బృందంతో మాధవపెద్ది సత్యం వున్నాడు. గ్లాస్‌తో కాఫీ త్రాగుతున్నాడు ఆనందా ప్రొడక్షన్స్ సుబ్బారావు.

డిస్ట్రిబ్యూటర్లకు ఎడ్వాన్సులు గుమ్మరించి తమ తమ థియేటర్లలో విడుదల ఏర్పాట్లు చేసికొనేవారు. లాభాల నే ముఖ్య లక్ష్యంగా పెట్టుకొని యుద్ధకాలంలో ఫిలిం పరిశ్రమలో కాలూనిన వ్యక్తులు వారిపని కావడంతో యుద్ధంముగియగానే పరిశ్రమనుంచి నిష్క్రమించారు.

యుద్ధకాలంలో అన్నింటి ధరలూ పెరిగినట్లే నటీనటుల వేతనాలు కూడ పెరిగాయి. యుద్ధం ముగిసిన తర్వాత కూడ జీవనవ్యయప్రమాణాధిక్యత కారణంగా కరవు భత్యాలు మొదలైనవి ఇచ్చుకోడం నిర్మాతకు తప్పలేదు. డిస్ట్రిబ్యూటర్లు తప్పుకొనడంతో పరిశ్రమలో స్తంభన, మూలంగా 'ఆర్థికమాంద్యం' ఏర్పడింది. ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరం ముడి ఫిల్ముపై కంట్రోలు తొలగడంతో పరిశ్రమకొంచెం అభివృద్ధి మార్గానపడ్డది.

గడచిన నలభై సంవత్సరాల జీవితంలో ఆర్థికంగా ఎన్ని కష్టనష్టాలకు గురియైనా టెక్నికల్ పక్షంగానూ ఉత్పత్తివిధానంలోనూ పాశ్చాత్యదేశాలతో, ముఖ్యంగా హాలీవుడ్‌తో పోటీచేయగలిగే - స్తోమతతో మన చిత్ర పరిశ్రమ ముందుకు సాగు

(5)-వ పేజీ చూడండి)





★ "నా యిల్లు" లో నాగయ్య ★





ప్రశ్నలు..సమాధానాలు

యాతం రాఘవయ్య శ్రీ—పరిమెళ్ళ.

రుంబామ్యూజిక్ అంటే ఏమిటో తెలియజేస్తారా?

—క్యూబాద్వీపంలోని నీగ్రోలు ఉపయోగించే నాట్య పద్ధతిని రుంబా అంటారు. ప్రాచీన రుంబానాట్యాన్ని ఆధునికం చేసి అమెరికన్లు స్వీకరించారు. ఈ నాట్యాన్ని అనుసరిస్తూ, అదేలయ, అదేతాళంతో ఉపయోగించబడే సంగీతానికి రుంబాసంగీతం అని పేరు వచ్చింది.

* * *

శివకోటి, నరసింగరావు—విశాఖపట్టణం.

ఫోక్ మ్యూజిక్ అంటేఏమిటి? అది వినడానికి ఎలాగ వుంటుంది?

—ఫోక్ మ్యూజిక్ అంటే జానపద సంగీతం. ప్రజల నోళ్ళలో పుట్టి ఆనోటా ఆనోటా వ్యాపించే సంగీతం జానపద సంగీతం. శాస్త్రీయసంగీతానికి వర్తించే నియమాలు దీనికి వర్తించవు.

వినడానికి సొంపుగానే ఉంటుంది

బెహరా శ్రీరామమూర్తి—ఏలూరు.

"ప్రస్తుత సినీమారంగములో, నాట్యానికెట్టి ప్రాధాన్యము గలదు?

—అనవసరమైన, అర్థరహితమైన ప్రాధాన్యం వున్నది.

* * *

కె. వి. రమణయ్య—నెల్లూరు.

హిందీచిత్ర నిర్మాతలు, తెలుగుతారలయిన సూర్యకుమారి, భానుమతి, అంజలి లను వారి చిత్రములలో నటింపుటకు బుక్ చేసుకునుచున్నారే, హిందీ సినీమా రంగంలో యింతకంటే సమర్థతతో నటించేవారు లేకనా!

—పాతతారలనే ప్రతి చిత్రంలోనూ బుక్ చేసి హిందీ నిర్మాతలు నష్టపడ్డారు. దక్షిణాదినుండి కొత్తతారలను తీసుకువడితే తిరిగి ప్రజలు ఆదరిస్తారేమోనని ఆశతో మన తారలను బుక్ చేస్తున్నారు. తారలకంటే కథ, దర్శకత్వం ముఖ్యమని వారింకా గుర్తించలేదు.

* * *

లాడే గంగరాజు—కుణుపురం.

సింబాలిజం, సెంటిమెంటాలిటీ అంటే ఏమిటి?

—సింబాలిజం:—సింబల్ అంటే గుర్తు లేక చిహ్నము. కవిత్వంలోను, ఇతర కళల్లోను అనుసరించబడే ఒక పద్ధతిని సింబాలిజం అంటారు. ఠాగూరు గీతాంజలి మొదలైన కావ్యాల్లో సింబాలిజం ఉపయోగించాడు. సూటిగా చెప్పటానికవీల్లేని విషయాలను, సూటిగా చెబితే రమ్యతరాని విషయాలను చిహ్నలద్వారా సూచించటాన్ని సింబాలిజం అనవచ్చు

—సెంటిమెంటాలిటీ:—సెంటిమెంట్ అంటే భావం. ఫీలింగ్ అంటే మానసిక అనుభూతి భావంకంటే మానసిక అనుభూతి ఎక్కువ యదార్థమైనది, బలమైనది మానసిక అనుభూతి లేకుండా భావానికి మనిషి దాసుడైపోతే దాన్ని సెంటిమెంటాలిటీ అంటారు. మన భావకవుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కృష్ణశాస్త్రి గారి దుఃఖకవిత్వం ఉదాహరణగా తీసుకుంటే, దుఃఖం అనే మానసిక అనుభూతికంటే దుఃఖం అనే భావానికే ఆయన లొంగిపోయి కవిత రాసినట్లు కనిపిస్తుంది.

నిడుమకవి జగన్నాథరావు—ఏలూరు.

"తెలుగు సినిమాలు నిర్మించుటకంటే, హిందీసినిమాలు నిర్మించుట తేలికయని భావించుచున్నారు." మీరేమంటారు?

—ప్రస్తుతం హిందీచిత్రాలస్థాయి తెలుగుచిత్రాల స్థాయికంటె తక్కువలోనే వుంది గనక మీరన్నది కొంత నిజమే. కాని ఏ భాషలో తీయాలన్నా తేలిగ్గా అయ్యేపని కాదు.

* * *

జటప్రోలు సౌమిత్రి—సామర్లకోటపురం.

మీరు 8-12-52 తేది ఆంధ్రపత్రికలో శోభావారి 'పరోపకారం'లో జి. వరలక్ష్మి, ముక్కామల అని ప్రకటించారే. శోభావారు (ఘంటసాల) 'స్ట్రైక్‌హాం' అనే చిత్రం గాక మరొక చిత్రం తీస్తున్నారా?

—'స్ట్రైక్‌హాం' అనేది ఇంగ్లీషులో తాత్కాలికంగా పెట్టుకున్న పేరు. దానికే ఇప్పుడు "పరోపకారం" అని నామకరణం చేశారు

* * *

శ్రీ వై. వి రమణరావు—గుంటూరు.

పాముకు కప్ప సహజమైన ఆహారము గనుక పాము నోటిలోని కప్పను రక్షించుటకై పాముకు దొరకవలసిన ఆహారమైన కప్పను పాము నోటినుండి తప్పించేయవచ్చునా?

—యుక్తివాదం, హేతువాదాతీతమైన మానవభావ పరికల్పిత ధర్మాధర్మ విచక్షణ, అర్థానాతీతమైన ఉపకారాలు మన సామాన్య తర్కాన్ని అనువర్తించదు. పాము నోటిలో కప్పను చూసినవానికి మీ తర్కం వర్తించదు ప్రయోజించలేక ప్రమాద

స్థితిలో ఉన్న తల్లిని రక్షించడానికి సజీవమైన శిశువును వధించడం కలదు. దయారసం తర్కానికి అందదు. తర్కవాదానికి కట్టుబడి ఉండదు.

*　　*　　*

గొర్తి జానకిరామశర్మ—బందరు.

"దాసి"ని సమీక్షిస్తూ, 'బండిరామయ్య' నటన అసహజంగా వుందనీ; గుజ్జువు బండిపాటలోని పదజాలం హిందీవనిన్నీ మీరు వ్రాశారు. ఆమాదిరి నటన, గ్యేనటుడూ, చెయ్యలేడనీ, పాటల్లోని పదముల పొందిక అదేవిధంగా వుండాలి కనుక తప్పులేదనీ అభిప్రాయపడుతున్నాం. మీరు దీన్నెలా సమర్థిస్తారు?

—అది అలాగే ఉండాలని మీరూ, ఉండకూడదని మేమూ అంటే వాదమే లేదు. "దాసి"లో ఎన్. టి. రామారావు పట్టిపట్టి యాసభాష పలికినట్లూ, కొన్ని (*Mannerisms*) అలవాటైన నటించినట్లూ మా సమీక్షకుడు అభిప్రాయపడ్డాడు. బండితోలుతూ పాడినపాటలో తెలుగు, తురకం పదాలు కలగలుపుగా ఉన్నాయి. రామయ్య హిందువు. తెలుగుదేశపు మహమ్మదీయుడైతే అలాటిపాట పాడినా ఫరవాలేదు. కాని హిందువు చేత కలగలుపు పాట పాడించటంలో ఔచిత్యం ఏమిటి? తురకం మాట్లాడటం అతని అలవాటేమో ననుకుందామంటే ఇతర సందర్భాల్లో ఎక్కడా తురకపదాలు ఉపయోగించలేదే?

అదే సందర్భంలో చిత్రాన్ని *Interval* తర్వాత ఎవరో వచ్చి రక్షించినట్టుందని వ్రాశారు; కాని, చిత్రం చూచేప్పుడు దాన్ని కనిపెట్టలేరనీ, బహుశా మీరు చిత్రం షూటింగు టైములో చూచివుండవచ్చునని అంటాం. మీ సంజాయిషీ ఏమిటి?

—షూటింగ్ చూడకుండానే చిత్రం చూస్తున్నప్పుడు అలాటి అభిప్రాయం కలగటానికి వీలున్నది. ఎక్కువ సీక్వెన్సులు చప్పగా, కృత్రిమంగా ఉండి, చివరి భాగంలోని సీక్వెన్సులు ముఖ్యంగా 'క్లైమాక్టిక్' సీక్వెన్సు రసవంతంగా ఉన్నందున ఈ అభిప్రాయం సహజంగా కలుగుతుంది. చిత్రం అంతా ఒకరే డైరెక్టుచేసి ఉండవచ్చుగాని డైరెక్షన్ అంతటా సమాన స్థాయిలో లేదు.

*　　*　　*

బి. మంగరాజు—బొబ్బిలి.

ప్రస్తుతం నాటకాభివృద్ధికి మన ప్రభుత్వం ఎంతవరకు సహకరించింది? ఇకముందయినా సహకరించే సూచనలున్నాయా? లేవా?

—సినిమా అభివృద్ధికి ఎంతసహకరించిందో నాటకాభివృద్ధికీ అంతే సహకరించింది. ఇకముందు సహకరించే సూచనలు కూడా అట్టే లేవు.

*　　*　　*

సర్వేపల్లి భాస్కరరావు—నగరి.

ప్రసిద్ధాంధ్ర సినిమాతార శ్రీమతి పి. భానుమతిగారు క్రొత్తగా స్టూడియో నిర్మించినారా? అయిన దానిపేరేమి? స్టూడియో అడ్రసు తెలియజేస్తారా?


—భానుమతి ఇటీవలనే భరణీస్టూడియో అనే పేరుతో స్టూడియో నిర్మించినది. ఎడ్రెసు—భరణీ స్టూడియో, కోడంబాకం, మద్రాసు.

*　　*　　*

శ్రీ దూర్వాసుల సుబ్బరాయశాస్త్రి—జేగురుపాడు తూ. గోదావరి.

"మీసాలపై తేనియల్" అని అనేక రంగములయందు వీరశృంగారాది రసములు నిరూపించిన మనజాతిలో యీనాడు అర్ధ మీసములు పావుమీసములు ఉండుటయు, అసలు మీసములు పూర్తిగా తీసివేయుటయు జరుగుచున్నది. దీనికి కారణమేమిటి?

—"మా సములైన వారెవ్వర"ని భారతజాతిగాని ఆంధ్రజాతిగాని ప్రపంచములో తలయెత్తుకొని తిరిగిన కాలములో మన వాళ్ళు "మీసములు" మెలియపెట్టగల్గిరి. "మీ సములము మేము కాము"అని ఆంధ్రులు ఇతరులకు జోహారుచేయుచున్న యీ కాలములో మీసములను తీసివేయడం యుక్తమే.



అంజలి దేవి, ప్రసాద్, కమల్ ఘోష్, ఆదినారాయణరావు, నాగిరెడ్డి మున్నగు పెద్దలు వాహినీలో "పరదేశి" సెట్ మీద చేరి మాట్లాడు కుంటున్నారు.

*　　*　　*

శ్రీ సి హెచ్. సింహాచలం—శనివారపుపేట, ప. గోదావరి.

ఉత్తరేణి పుల్లతో పండ్లు తోముటవల్ల లాభమా నష్టమా?

—ఉత్తరేణి ఉత్తమమైన దనుట కొత్త మాట కాదు. ఉత్తమాట కాదు. ఆ పుల్ల వల్ల నష్టమనుట కల్ల. దానితో,—"తోము వచ్చు పండ్లు—దొరకిన యన్నాళ్లు."

*　　*　　*

*　　*　　*

శ్రీ కే. దశరథరామయ్య — పెద లింగాల.

కోహినూరువజ్రం, నెమలి సింహాసనం బ్రిటిష్‌వారి ఆధీనంలోనే ఉన్నదా?

—కోహినూరు వజ్రం బ్రిటిష్‌వారి స్వాధీనంలోనే ఉంది. నెమలిసింహాసనమును ఇండియానుంచి యూరోపు ఖండానికి ఒక నావమీద తీసికొనిపోతూ ఉండగా సుమారు 200 ఏండ్లక్రింద ఆనావ ఆఫ్రికాఖండపు కోస్తావద్ద తుపానువల్ల పగిలిపోయింది. ఆ నెమలి సింహాసనం సముద్ర గర్భంలోనే ఉంది. ఈరోజువరకూ దానికై శోధన జరుగుతోంది. ★

ఫిలింపరిశ్రమపై పన్నులభారం

తున్నది. 400 మంది ప్రొడ్యూసర్లు (స్టూడియోఓనర్లు తప్పించి) ఈ ఫిలింపరిశ్రమలో కృషి చేస్తున్నారు. సంవత్సరానికి 250 నుంచి 280 వరకూ చిత్రాలను ఇండియా నిర్మించగలుగుతున్నది.

ఇటీవల విడుదలయే చిత్రాలకు చెప్పుకో దగ్గ రాబడి ఏమీలేదు. క్రమశః రాబడి ఒక వంకపడి పోతుంటే మరొక వంక పన్నులభారం హెచ్చిపోతున్నది. ఆ భారం తగ్గించని పక్షంలో వ్యాపారం గట్టిదెబ్బ తినగలదని ఫిలిం పరిశ్రమలోని పెద్దలు భయపడుతున్నారు. నూటికి ఏ ఇరవై మందో తప్పిస్తే ఈ పరిశ్రమవల్ల ఎవరూ అంతగా బాగుపడినట్లు కనబడదు. రకరకాలపేర్లతో లాభంలో మూడవవంతు సొమ్ముపన్నుల రూపానకేంద్రరాష్ట్రీయ ప్రభుత్వాలకే పోతూంది. వినోదం పన్ను పరిశ్రమ అభివృద్ధికి నిరోధకం. ఇది ప్రేక్షకుడికి త్తిసేపడుతున్నది. నూటికి 60 వంతులు చొప్పున పరిశ్రమనుంచి తీసికొనే ప్రభుత్వం పరిశ్రమ పట్ల ఎంతో ఉదారంగా న్యాయంగా ప్రవర్తించి వుండాల్సింది. కాని అది మృగ్యం.

గతసంవత్సరం దక్షిణాదిని తయారైన చిత్రాలు మరెన్నడూ తయారుకాలేదు 52 వారాల్లో 58 చిత్రాలు తయారైనాయి. 25 తమిళం, 20 తెలుగు, 7 మళయాళం, 6 ఇతర భాషాచిత్రాలు. అటువంటప్పుడు ప్రభుత్వం ఉత్తమ చిత్రాలకిచ్చే బహుమానాలను ఆపివేయడం ఎంతటి నిరుత్సాహజనకమైన పనో వేరే చెప్ప నవసరంలేదు. ప్రభుత్వం పరిశ్రమకు తగు సహాయం చేయకపోగా ఇటు పన్నులను పెంచుతూ ఆర్థికంగా కృషించి పోతున్నపరిశ్రమను మరింత బలహీనపరచవస్తే గాక, అటు అమలులోనున్న ప్రోత్సాహజనక కార్యక్రమాన్ని సైతం ఉపసంహరించుకో బూనడం అద్యతన భావిలో యావద్భారతానికే అసదృశకీర్తి ప్రతిష్ఠలను సముపార్జించ నున్న దక్షిణాది ఫిలిం పరిశ్రమకు తీవ్రాఘాతం కలిగించినదనవచ్చు.

గతించిన జూన్‌నెల పార్లమెంట్ సమావేశంలో 19F2 సంవత్సరపు క్రొత్తసినీమా శాసనం ఆమోదింపబడి 1952 జులై 28 తేదీనుంచి అమలులోనికివచ్చింది. ఈ కొత్తశాసనంలో 1918 సం॥ సినీమాటోగ్రాఫ్ చట్టం రద్దుచేయబడినట్లు ఒక క్లాజ్ వుంది. హైద్రాబాద్‌లో ఇటువంటి శాసనం అప్పుడే అమలు జరిగింది రాజస్థాన్‌లోకూడ ఆ యత్నం సాగుతున్నది. ఈ 1952 సినిమాటోగ్రాఫ్ చట్టాన్ని అమలుపరచడానికి బదులు ఫిలిం దర్యాప్తు సంఘం చేసిన సూచనల మేరకు మరొక సమగ్రమైన చట్టాన్ని అమలుపరచి వున్నట్లయితే బహుసమంజసంగావుండేది. ప్రస్తుతం వసూలుచేసే వినోదపు పన్నును నూటికి 12½కు మించకుండా చేయాల్సి వుంది. మైసూరు, మద్రాస్‌లలో 'ప్రదర్శన'లపై పన్నువిధించడం అక్రమం అన్యాయం. కనుక ప్రభుత్వం వెంటనే దానిని తొలగించాల్సివుంది. ప్రొడ్యూసర్లకు తోడ్పడేందుకు ఫిలిం ఫినాన్సు కార్పొరేషన్ స్థాపించాలి. సెన్సార్ షిప్ రుసుమును తగ్గించాలి. ఫిలింకు సంబంధించిన వివిధవిషయాల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం ఒక శాఖను నియమించాలి

ప్రభుత్వం థియేటర్లవిషయంలో కూడ కొంత శ్రద్ధవహించాలి. నేడు థియేటర్ల అవసరంకూడ అధికంగా కనుపిస్తున్నది. కొత్తథియేటర్ల నిర్మాణానికయే సాధనసామగ్రిపై కంట్రోల్సును సడలించాలి. థియేటర్ యజమా 'ఇషారాజ్యం' అరికట్టాలి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో స్థానిక కమర్షియల్ టాక్సు ఆఫీసర్లుపన్ను విధింపు నిబంధనలపట్ల చెప్పే అపార్థం పరంగా వసూలుచేసిన అదనపు పన్ను మొత్తాలను తిరిగి వాపసు చేయించాలి.

ప్రస్తుతంలో ముడిఫిలిం దిగుమతికై ఇండియా పెక్కుకోట్ల రూపాయలు వ్యయపరుస్తున్నది ముడిఫిల్ము ఉత్పత్తికి కావలసిన ముడిపదార్థాలు ఇండియాలోనే లభ్యమౌతాయని అందుకు శీతోష్ణాదికపరిస్థితులు కూడ అనుకూలంగానే వున్నవని, అందుకు మైసూరు ప్రాంతము తగినదని చెప్పబడుతూంది. ఇది ప్రభుత్వం వెంటనే ప్రారం



ఎం. ఆర్. ఏ. ప్రొడక్షన్స్‌వారి 'లేడీడాక్టర్'లో విజయకుమార్



అశోకావారి "నాచెల్లెలు"లో అన్నా చెల్లెళ్లుగా
అమర్ నాథ్, కొత్తనటి సూర్యకళ.

ఖర్చు చేసినట్లయితే పరిశ్రమకు గొప్ప ఉపకారం జరుగుతుంది.

రెండుసంవత్సరాలక్రితం పూనాలో స్థాపింపబడిన నేషనల్ లేబొరేటరీస్ మాదిరిగా ఫిల్మ్ రీసెర్చి లేబొరేటరీని దక్షిణాదిని కూడ స్థాపించడం అవసరం. అటువంటి ప్రాజెక్టులను ఫిలిం పరిశ్రమ పేరుతో బాగుపడే ప్రతిభను ప్రోత్సహించగలరు. దానివల్ల నిర్మాతలకూ, టెక్నీషియన్లకూ డైరెక్టర్లకూ మహోపకారం జరగడానికి, 10,15 సంవత్సరాల్లో పరిశ్రమమహోచ్ఛస్థితిలోనికి రావడానికి సహాయపడుతుంది.

శాంతారాం చెప్పినట్లు నిర్మాతలంతా నియమబద్ధంగా ఉత్తమచిత్రాల నిర్మాణానికి పూనుకుంటే ఆర్థికమాంద్యం అనేది ఫిలింపరిశ్రమ దరిచేరదు సరికదా, ప్రేక్షకుల అభిరుచికూడ ఉత్తమచిత్రాల పట్ల హెచ్చుతుంది.

అభివృద్ధిలోవున్న ఈ పరిశ్రమపై ప్రభుత్వం అనవసరపు పన్నులను తొలగించి పరిశ్రమను కంట్రోల్ చేస్తూ ఒక నిర్దిష్టమైన విధానంలో కొనసాగించవలసిన అవసరం నేడెంతైనా వుంది! ★

సినిమా వార్తలు

సెన్సారుబోర్డుచే సర్టిఫై చెయ్యబడిన చిత్రాలను కేంద్రప్రభుత్వం నిషేధిస్తూ ఉండటం బొంబాయి, మద్రాసు చిత్రనిర్మాతలకు ఆగ్రహకారణమైనది. ఫిలిం ఫెడరేషన్, భారత చలనచిత్ర నిర్మాతల సంఘం, దక్షిణభారత ఫిలిం వాణిజ్యమండలి మున్నగు సంస్థలు భారతప్రభుత్వానికి తీవ్ర అధిక్షేపణలు తెలిపినవి. కేంద్ర సమాచారశాఖా మంత్రి డా॥ కేస్కార్ ఇటీవల "షిన్ షినాకీ బుబ్లాబూ" అనే హిందీ చిత్రాన్ని నిషేధించారు. ప్రదర్శనయోగ్యమని సెన్సారువారిచే అంగీకరింపబడి, ఒక చిత్రం విడుదల అయిన తరువాత దాన్ని నిషేధించే అధికారం కేంద్రప్రభుత్వం చెలాయించటం మొత్తంమీద నిర్మాతలందరికీ నిరుత్సాహజనకంగా ఉన్నది. ఏ చిత్రం ప్రదర్శనకు యోగ్యమో, ఏది కాదో తెలియని సందిగ్ధావస్థలో చిత్రనిర్మాణపరిశ్రమ సవ్యంగా జరగటం అసంభవమని వారు అధిక్షేపిస్తున్నారు.

* * *

నాగోర్ సినీ ప్రొడక్షన్స్ వారు తెలుగు, తమిళం, మళయాళం భాషలలో "సందేహి" అనే చిత్రాన్ని న్యూటోన్ స్టూడియోలో తీస్తున్నారు. ఇందు సి. ఎస్. ఆర్. అంజనేయులు, ఎం. జి. చక్రపాణి, లక్ష్మీప్రభ, ఎం. వి. రాజమ్మ, శివరావు ప్రభృతులు నటిస్తున్నారు. డైరెక్షన్—ఎఫ్. నాగోర్.

'హఠాత్తుగా వచ్చేశావు నన్నయ్యా! యిట్లా జరుగుతుందని వూహించనైనా లేదు.'

'ఏం - జరిగింది —'

'నా కంపెనీలో కొత్తగా ఉంచిన వెంటు పెట్టి తక్కువ సర్వీసు వాళ్లను తీసేశారు.'

'అరె! తీసేశారూ! —'

'మరలా ఎక్కడైనా ఉద్యోగం దొరికిందా కా—'

'......................'

'ఇక్కడే ఏదన్నా ప్రయత్నం చేద్దామను కుంటున్నాను. ఆఖరికి గన కూలికైనా ఏ షైప్ వాడినో ఆశ్రయిస్తామను కుంటున్నాను.'

'......................'

'పదిరోజుల్లో ఏదో దొరక్కపోతే పిల్లను వాళ్ల అమ్మగారింటికి పంపేసి—'

'ఇప్పుడు ఏం [illegible] - చూస్తాంగా—' [illegible] అన్నాడు భానుమూర్తి.

'నేనటు వస్తాను. ఏదో ఒకటి చిక్కిందాకా నా మనస్సు కుదుటబడదు—' అంటూనే వాకిలిదాటాడు రామమూర్తి. భానుమూర్తికి వూపిరి తిరిగినట్లయింది. తీరిగ్గా ఆత్మవిమర్శన చేసుకోసాగాడు.

'తమ్ముడింటికొస్తే - ఏమిటి తానేం అయిపోవటం - నౌకరిపోయి కష్టకాలంలో అన్న వున్నాడని కొవా వాడింతదూరం వచ్చింది. తన మనోభావం - వాలకం చూసి వాడేంత బాధపడ్డాడో - ఛా! ఛా!! వాడింతో నాలుగురోజు లుంటాడో లేదో తానెందుకీలా గిజగిజలాడిపోవటం. మునుపు తానూ వాడూ ఎంత బాగా వుండేవారు. ఇల్లమ్మినప్పుడు ఎంత కర్చు పెట్టానో -యిచ్చినమటుకు తీసుకున్నాడేగాని - నా వాటా ఏది అని నాడు అడిగినన్నా అడగలేదే - అటువంటివాణ్ణి తానెలా...'

భానుమూర్తి హృదయం [illegible]. అతడు తన ప్రవర్తనకు తానే సిగ్గుపడ్డాడు. తన నైచ్యానికి తానే [illegible]. తన హృదయం యింత కలుషితమైనదేమా అని కుమిలిపోయాడు. కాని అతడు [illegible] తరువు. యీ [illegible] బట్టీ. [illegible] మారింది. [illegible] బడ్డాడు. [illegible] నగరంలో [illegible] వస్తువులతో [illegible] కొంటున్నాడు. భానుమూర్తి [illegible] వారి [illegible]

★

'తాజమహలు' శిల్పపథక కల్పన ఎవరిది?

తాజమహలు నిర్మాణమునకు ప్లాను (నక్షా) తయారుచేసి దాని శిల్ప పథకమును కల్పించినవాడు యూరోపియను అని యూరోపియను చరిత్రకారులు వ్రాశారు. ప్రపంచంలో కెల్ల అత్యద్భుతమైన యీ నిర్మాణముయొక్క ప్రజ్ఞ అంతా పాశ్చాత్యులదే అని నిరూపించడానికి పాశ్చాత్య చరిత్రకారులు ప్రయత్నించారు.

"ఉస్తాద్ - ఈసా" అనే ఒక ప్రముఖుడు తాజమహలు యొక్క ప్లాను అంతా తయారుచేసినట్లుగా ఆనాటి పరిషియా దేశపు చరిత్ర గ్రంథాలలో వ్రాయబడి ఉంది. "ఈసా" అనే మాట "ఏసు" అనే మాటకు అపభ్రంశరూపం అనిన్నీ, ఏసుక్రీస్తును నమ్మినటువంటి ఒక క్రయిస్తవుడు, షాజహాను చక్రవర్తి వద్ద ఉంటూ ఉండేవాడనిన్నీ, అతడే తాజమహలుకు ప్లానులు తయారుచేసి ఉంటాడనిన్నీ "స్లీమన్" అనే పాశ్చాత్య చరిత్రకారుడు అర్థం చెప్పియున్నాడు. కాని, స్లీమన్ చెప్పిన అర్థం తప్పు.

పరిషియాలో ఆనాడు వ్రాయబడిన చరిత్ర గ్రంథములు కొన్ని లభించాయి. (1) బాద్షానామా (2) అమలీసాలీ మొదలైన గ్రంథములు లభించాయి. తాజమహలుకు ప్లానులు ఎవరు తయారుచేశారో, కట్టిన శిల్పులెవరో, వారి జీత బత్తెములు ఎంతో, మొత్తము ఖర్చు ఎంతో, ఏ సామగ్రులు ఎంతెంత ఖర్చు అయినదో ఆ వివరాలన్నీ పై చెప్పిన గ్రంథములలో పూసగ్రుచ్చినట్లుగా వ్రాయబడెను.

టర్కీలోని కాన్‌స్టాంటినోపిల్ నగరం (నేడు దాని పేరు - ఇస్తాన్‌బుల్) ఉంది. ఆ నగర నివాసియైన "మహమ్మదు ఈసా ఎఫెండీ" అనే ప్రముఖుడు ఉండేవాడు. అతడే యీ "మహమ్మదు ఈసా" అని పిలువబడుతూ ఉండేవాడు. అతడే తాజమహలు శిల్పపథక రచయిత యని చెప్పబడుచున్నది.

"జెరోనిమో వెరోనియో" అనేవాడు ఇటలీ దేశంలోని వెనిస్ నగర నివాసి. ఇతడే తాజమహలుయొక్క ప్లాను తయారుచేసినాడని "ఫాదర్ మాన్రిక్" అనే పేరుగల స్పెయిను దేశీయుడైన పాదరీదొర వ్రాశాడు. ఇతడు వ్రాసిన గ్రంథం యూరోపు ఖండంలో 1649 సంII లో ప్రకటింపబడింది. ఈ పాదరీదొర షాజహాను కాలంలో భారతదేశంలో ఉన్నాడు. షాజహానుయొక్క భార్యయైన "ముంతాజ్" యొక్క తండ్రియైన "అసఫ్ ఖాను" యొక్క స్నేహితుడుగా యీ పాదరీదొర ఉంటూ ఉండేవాడు. 1649 సంII నాటికి టాజమహలు నిర్మాణం పూర్తి కాలేదు.

టాజమహలుకు ప్లాను యావత్తూ ఇటలీ దేశపు వెనిస్ నగరవాసియైన "జెరోనిమో వెరోనియో" తయారు చేశాడని మాన్రిక్ అనే స్పెయిను దేశీయుడు ఒక్కడే వ్రాశాడు. ఈ దేశమునకు వచ్చి పర్యటనచేసి యీ దేశవిశేషములను విపులంగా ఆనాడు వర్ణించి వ్రాసినటువంటి యూరోపియను యాత్రికులు (1) బెర్నీర్ గాని (2) ట్రావర్నియర్ గాని (3) మానూసీ గాని "జెరోనిమో వెరోనియో" పేరును తమ భారతదేశ యాత్రావివరణ గ్రంథాలలో వ్రాయలేదు. తాజమహలును గూర్చి తాము వినినట్టునంటి ఆనాటి కింవదంతులను మాత్రం చాలా వ్రాశారు.

"తాజమహలు" అనేది ఏ ఆగ్రా నగరంలో నిర్మింపబడెనో "జెరోనిమో వెరోనియో" కూడా యీ ఆగ్రాలోనే 1640 సంIIలో సమాధి చేయబడెను. 1640 సంII నాటికి టాజమహలు నిర్మాణం ప్రారంభదశలోనే ఉంది. పర్షియా దేశములో ఆనాటి కాలములో వ్రాయబడిన చరిత్ర గ్రంథములలో తాజమహలు నిర్మాణమును గూర్చిన వివరాలు చాలా వ్రాయబడెను. కాని, పై చెప్పిన ఇటాలియను శిల్పి పేరు ఆ పరిషియను చరిత్ర గ్రంథాలలో ఎక్కడా లేదు... ఒకవేళ "జెరోనిమో వెరోనియో" తో కూడా, షాజహాను చక్రవర్తి ఏమైనా తాజమహలు నిర్మాణ సందర్భంలో సంప్రతిస్తే సంప్రతించి యుండవచ్చు. కాని, అతడు ఆ శిల్పకల్పన చేసిన [illegible] పథకరచయిత కాడు.

కాలక్షేపం

(5-పేజీ తరువాయి)

యోచన. ఏనుగు గడ్డితిన్నట్టుగా ప్రభువైనవాడు ప్రజల సొమ్ముతో ప్రభుత్వాధికారం సాగిస్తాడు. ఆ ప్రభువునే ఆశ్రయించి ప్రజలు జీవించుచున్నామనియు, జీవింపవలసి యున్నదనియు, సిద్ధాంతీకరించుచున్నారు. ఇదంతా ఒక విధమైన అన్యోన్యాశ్రయ ధర్మంగా ఉంది.

పూర్వ మొకప్పుడు బాగా లౌక్య మెరింగిన ఉపాయశాలి తన జీవనోపాధికి తగిన మార్గం కన్పించక ఒక వీధి అరుగు మీద దీర్ఘాలోచనా నిమగ్నుడై ఉన్నాడు. ఆ సమయంలోనే ఒక పేదబ్రాహ్మణ యువకుడు ఎక్కడా ఉద్యోగంగాని ఉపాధిగాని లభించక, ఆ గ్రామంలోని పెద్దమనుష్యులను కొందరిని సందర్శించి సహాయం పొందవలెనని వచ్చాడు. అరుగు మీద కూర్చుండిన లౌక్యశిఖామణివద్దకు యీ బ్రాహ్మణయువకుడు వచ్చి తన గోడు ఏకరువు పెట్టాడు. ఇదే మంచి తరుణమని ఆ లౌక్యశిఖామణి నిర్ణయించి, ఆ కుర్రవానితో యీ క్రింది రీతిగా అన్నాడు.

"అబ్బాయి! నీ అన్నవస్త్రములకు లోపంలేకుండా నేను నిన్ను పోషిస్తాను: నీవు నా వద్దనే ఉండి నేను చెప్పిన పని పాటులు చేస్తూఉండాలి" అన్నాడు. ఆ యువకుడు ఆ మాటలకు పరమానంద భరితుడైనాడు. "స్వామీ! తమరు చెప్పిన చొప్పున చేయగలనని మీ చేతిలో చెయ్యివేసి చెప్పుచున్నాను. మీరిచ్చిన అభయహస్తం అమూల్యమైనది. మీ ఋణం నేను తీర్చుకోలేను" అన్నాడు. మరునాడుదయము ఆ బ్రాహ్మణ కుర్రవానిని చక్కగా స్నానంచేయించి, తెల్లని మడుగు ధోవతిని కట్టుకొనుటకిచ్చి, ముఖమున విభూతి రేఖలు చక్కగాదిద్ది, తెల్లగా తోమిన ఒక పెద్దపాత్రను చేతికిచ్చి, "యీ యూరిలోను, ప్రక్క గ్రామములోను సంపన్న గృహస్థులయిండ్లు వెరశి వందగడపఉన్నవి. శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః అని నీవు ఆయా గృహస్థులయింటి గుమ్మములవద్దకువెళ్ళి బిగ్గరగా ఒకటిరెండుసార్లు కేక వేసినట్లయితే, యీ పాత్రలో బియ్యం వేస్తారు. పాత్ర నిండినట్లయితే, ఆ బియ్యం యీ జోలెలో పోయవలెను. మధ్యాహ్నపు ప్రొద్దు ఎక్కక పూర్వమే 10 లేక 11 గంటలకు నీవు యింటికి చేరుకోవలెను." అని ఆయన ఉత్తరువులు జారీచేశాడు. ఆయనచెప్పిన ప్లానుప్రకారంగానే, ఆయన ఆజ్ఞను సుగ్రీవాజ్ఞగా శిరసావహించి సరిగ్గా 10 గంటలయ్యేసరికి జోలె నిండా బియ్యం తెచ్చి జమాబందీలెక్కలను తాలూకా ఆఫీసులో దాఖలుచేసినట్లుగా దాఖలుచేశాడు. "శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః" అని సంపాదించిన బియ్యం "కృష్ణార్పణం" అని సమర్పించాడు. ఈ విధంగా అతడు వసూలు చేసిన బియ్యము అయిదారు శేర్లకు తక్కువ వుండేవి కావు. కావలసిన బియ్యం తమ భోజనానికి వినియోగించి, మిగిలిన బియ్యం నిల్వచేసి, అమ్మి రొక్కం చేసి, ఆ లౌక్యశిఖామణి తాను తరించి తన్నాశ్రయించిన బ్రాహ్మణ యువకుని కూడా తరింపజేశాడు. రాజుకు రైతుకూ ఉండే అన్యోన్యాశ్రయంకూడా కొంత వరకు యిటువంటిదే. పండించేది ప్రజలు-పండినఊళ్లకు అంతా ప్రభువులే.

ఒకపర్యాయము, ఒక పెద్దవర్తకుడు పదిమందితో కలిసి భద్రాద్రి యాత్రకై శ్రీరామనవమికి చాలారోజులు ముందుగానే బయలుదేరి అరణ్య మార్గంగా పోతూవున్నాడు. త్రోవలో ఒక చోట పెద్ద ఎలుగుబంటి ఉన్నదనిన్నీ, జాగ్రత్తగా కనిపెట్టి పోవలసిందనిన్నీ త్రోవలో ఒక చెంచువాడు వాళ్ళను హెచ్చరించాడు. అప్పుడు ఆ వర్తకుడు తనతో వచ్చుచున్న మిగిలిన పదిమంది మిత్రులతో యిలా అన్నాడు: "మీరేమీ భయపడవద్దు. భయపడి చిందరవందరగా నలువైపులకుపారిపోవద్దు-నేనుఉన్నాను." "నా కేలల్లాడకు బంధులారనిలుడీ!" అన్నట్లుగా ధైర్యవచనం చెప్పాడు. "మీ ప్రాణానికి నాప్రాణం అడ్డంపెడ్తాను. ఆ భల్లూకంవచ్చిందంటే, మీరేమీ భయపడకుండా నన్ను గట్టిగా కావిలించుకోండి" అన్నాడు. కొంతదూరం నడిచేసరికి ఆ ఎలుగుబంటి కనుచూపు మేరలో కన్పించింది. వెంటనే ఆ వర్తకుణ్ని మిగిలినవాళ్లందరూ గట్టిగా కౌగలించుకున్నారు. ఆ వర్తకుడు "ఇంతకన్నా భద్రంగా నన్ను కావిలించుకొనే ఉపాయం చూపిస్తాను" అని చెప్పి నేలమీద పరుండి ఆ పదిమంది మిత్రులను తనమీద గట్టిగా కావిలించుకొని పరుండవలసినదన్నాడు. వాళ్ళందరు ఆ విధంగా అతనిని కమ్ముకొని పరున్నారు. ఆ ఎలుగుబంటి వచ్చి ఆ వర్తకునిపైన కమ్ముకొని పరుండిన పదిమందిలో ఒకనిని పట్టి యీడ్చుకొని పారిపోయింది. ఆ క్రూరమృగము పారిపోయిన తర్వాత మిగిలినవాళ్లు "బ్రతుకు జీవుడా!" అని లేచి, ఆ వర్తకుని వెంటబడి భద్రాద్రి చేరుకున్నారు. వారిలో ఒక్కడు యీ ఆపత్తుకు ఆహుతి అయినందుకు చాలా చింతించారు. ఆ వర్తకుడు ధనవంతుడు గనుక, గతించిన అభాగ్యుని ఆలుబిడ్డలకు ఆత్మబంధువులకు ఉత్తరము వ్రాయించి వెయ్యి రూపాయీలు వారి కుటుంబ జీవనాధారంగా ధారాళమైన విరాళంగా యిచ్చి తన వితరణ చూపించి, గోదావరిలో తర్పణాలు విడిచాడు. ఆ వర్తకునివెంట వచ్చిన పదిమంది మిత్రులున్నూ (లేదు, లేదు క్షమించాలి: ఎలుగుబంటి భక్షించిన ఒకడు పోగా మిగిలిన 9 మంది మిత్రులున్నూ) ఆ వర్తకునియందు భక్తివిశ్వాసములు గలవారై అతని ఆశ్రయము తమకు లభించినందుకు అనేక విధాలుగా ఆయనను స్తుతించారు. రాజువెంట ఉండే భట నివహ సమూహం కూడా భద్రంగా రాజును రక్షిస్తూఉంటుంది. అయితే యీ భటసమూహాన్ని భరించి రక్షించేది తానే అంటాడు ప్రభువు.

"నన్ను నమ్ముకోండి! జర్మనుజాతిని నేను ఉద్ధరిస్తాను" అని హిట్లరు హెచ్చరిస్తే "జై! హిట్లరుకూ జై!" అని జర్మనులన్నారు. జర్మనులను హిట్లరు రక్షించలేకపోయినాడు. కాని, హిట్లరు "మూలంగా జర్మనులు యుద్ధంచేసి వాళ్ళ కర్మ వాళ్ళు అనుభవించారు." అంతే కాదు. జర్మనీని ఎదిరించి అమెరికాయున్నూ ఇంగ్లాండున్నూ తమ సర్వశక్తులను వినియోగించి యుద్ధం చేసినప్పటికీ, జర్మనీని ఓడించలేకపోయినవి. రష్యాకూడా జర్మనీని ఎదిరించి పోరాడవలసినస్థితి వచ్చింది. జర్మనీకి రష్యాతో యుద్ధం ప్రబలంగా జరుగుతోంది. "కరిమకరికి, మకరి కరికిని" అనట్లుగా గజేంద్రమువలె రష్యా పోరాడింది. అంత హోరాహోరిగా పోరాడినప్పటికీ, జర్మను సేనలధాటిని రష్యనులు అరికట్టడం చాలా దుష్కరమైంది. జర్మను సేనలో కొంత భాగానికి మరొకచోట పని కల్పించి ఆకర్షించడం అవసరమునిన్నీ ఆ విధంగా జర్మనుసేనను మరొక రంగంలో ఇదే ముహూర్తంలో ఢీకొనడం అవసరమునిన్నీ రష్యా [illegible] సలహా యిచ్చింది. అమెరికా యింగ్లాండులు ద్వితీయ యుద్ధరంగం యింకొకచోట "యిదిగో ప్రారంభిస్తాం, అదిగో ప్రారంభిస్తాం!" అని రష్యాకు కమ్మని మాటలు

కాలక్షేపం

తెప్పి కాలహరణం చేశాయి. స్టాలిన్‌గ్రాడు యుద్ధంలో జర్మను సేనలను రష్యనులు పటాపంచలు చేశారనే శుభవార్త విన్నతర్వాత అమెరికా యింగ్లాండులు ద్వితీయ యుద్ధరంగం ఉత్తరాఫ్రికాలో ప్రారంభించాయి. జర్మను సైనికబలం రష్యను రంగంలో తల యెత్తకొనలేకుండా తన్నులు తిన్నదనే ధైర్యం చిక్కినతర్వాత, రష్యను సైనికబలంకూడా బాగా నిరసించిన తర్వాత, అప్పుడు రష్యాకు సహాయంగా, జర్మను సేనలను మరొక రంగంలో ఎదిరించడానికి అమెరికా ఇంగ్లాండులు ద్వితీయ యుద్ధరంగాన్ని ధైర్యంగా ప్రారంభించాయి. ఈ యుద్ధతంత్రంలో ఎవరు ఎవరిని రక్షించారు? ద్వితీయ యుద్ధరంగమును ఉపక్రమించిన అమెరికా యింగ్లాండులే రష్యాను రక్షించెనా? జర్మను సేనలను లక్షోపలక్షలుగా భక్షించిన స్టాలిన్‌గ్రాడు యుద్ధమును అతి సాహసంగా చేసిన రష్యా మూలంగా అమెరికా యింగ్లాండులకు ప్రాణగండం తప్పినదంటారా?

అమెరికావంటి భాగ్యశాలి అనేమాట ఏమిటి? నేను "శ్రీగల భాగ్యశాలిని" లోకమంతా నన్ను ఆశ్రయించుకొని ఉండక తప్పదు. సమస్తవాహినులు సముద్రములో చేరినట్లుగా, అంత సహజంగానే లోకంలోని రాజ్యములన్నియు నా సహాయం కావాలని కోరక తప్పదు. ఇది అమెరికావారి అహంభావం. "నీరు పల్లమెరుగును" అనేమాట నిజమే. నదీప్రవాహములలోని నీరుఅంతా సముద్రంలోనికే ప్రవహించి పోతున్నది. ఈ విధంగా ప్రవహిస్తున్న నదులు తమ జలమును "కృష్ణార్పణం!" అన్నట్లుగా సముద్రునకు సమర్పిస్తున్నాయి. అంతేగాని, రత్నాకరుడనే ప్రసిద్ధ నామంగల ఆ సముద్రునివద్దనుంచి యీ నదులు పొందుచున్న సహాయసంపద ఏమిటి? ఏమీ లేదు. నదీజలములు సముద్రంలో కలిసి ఆ సముద్రంలోని జలము మరింత వృద్ధిఅవుతోంది. అందువల్ల శ్రీగల భాగ్యశాలి కడ చేరినటువంటి ప్రజల మూలంగా, ఆ భాగ్యశాలి మరింత మహాభాగ్యశాలి అవుతున్నాడు. కాని సముద్రంలో ఉన్న నీరు ఎండవేడికి ఆవిరియై ఆకాశంలో మేఘమై పర్వతాల మీద వర్షించి ఆ నీరు తిరిగి నదులలోకి పూర్తిగా సప్లయి అవుతున్నమాట వాస్తవమే. యేమైనప్పటికీ, నదిలోనుంచి ప్రవహించి పోయిన నీరే తిరిగి నదిలోకి వచ్చినది. "మాది మా కివ్వడమే మడిమాన్యము లివ్వడం" అన్నట్లయింది. ఏన్నాళ్లయినా, మహాసముద్రం మహాసముద్రంగానే ఉంది. మహానది మహానదిగానే ఉంది.

మహాసముద్రంలోనికి పోయే మహానదుల నీటిని, ఆ విధంగా మహాసముద్రం పాలు కాకుండా చేయవలెననే మహాసంకల్పం మద్రాసువంటి రాష్ట్రంలోని మహాజనులకు కూడా కలిగింది. కృష్ణలోని నీరుఅంతా కృష్ణార్పణం అని సముద్రంపాలు అయితే ఏమిలాభం అన్నారు. ఆ నీరు కృష్ణాతీర ప్రాంతప్రజల పాడిపంటలకు వినియోగపడేటట్లుచేయడం ఉత్తమం అన్నారు. అందుకొరకై నందికొండవద్ద ముందుగా ఆనకట్ట కట్టవలెనని నెహ్రూప్రభుత్వం నియమించిన ఖోస్లాకమిటీ నిర్ణయించింది. కాని, యీ మహాసంకల్పానికే ఆనకట్టను అడ్డుకట్టను నిర్మించవలెనని రాజాజీప్రభుత్వం నిర్ణయించింది.

కృష్ణనీరు మా అరవజిల్లాలకు చేరవలెనని అరవవారి ఆతురతగా ఉంది. కృష్ణనీరు ఆంధ్రమండలములకు చేరవలెనని ఆంధ్రుల ఆతురతగా ఉంది. "కృష్ణా!" నీవు మా మండలములకు వస్తావా! అని అరవసోదరులున్ను "కృష్ణా!" నీవు మా మండలములనే అభిమానించి రావా? అని ఆంధ్రులున్నూ ఒక్కసారిగా పోటీపడుతున్నారు. కాని, కృష్ణుడు పాండవ పక్షపాతి. "యతో ధర్మస్తతో జయః" ధర్మమెటువైపు ఉంటే అటువైపుకే జయం కలిగేటట్లు చేశాడు.

ఏ ఆంధ్ర ప్రజామండలికి కృష్ణ మహాతృష్ణమైన అండగా ఉన్నదో, ఏ ఆంధ్రమండలికి గోదావరి కోరినవరము లిచ్చునో, అట్టి కృష్ణా గోదావరీ మహాస్రవంతులే ఆంధ్రభూమికి కామధేనువులు, కల్పవృక్షములు. ఆంధ్రదేశాన్ని అయిశ్వర్యంతో తులతూగేటట్లు చేయగల నదీరత్నము లివి. ఈ ఆంధ్ర నదీరత్నములు సముద్రములోనికి ప్రవహించడంవల్లనే సముద్రుడు రత్నాకరుడైనాడు. ఈ ఆంధ్రస్రవంతుల జలము వల్ల ఆంధ్ర సంకల్ప జపము కూడా సార్థకముగాక సాగరము పాలవుతోంది. దీనికే అత్యవసరముగా గట్టి ఆనకట్ట కట్టవలెనని శ్రీ పొట్టి శ్రీరాములుగారు తమ తపశ్శక్తిని ధారవోసి ప్రాయోపవేశ ధ్యానముద్రాసముద్రములో లీనమైనారు. వారి సంకల్పసిద్ధియే ఆంధ్రులకష్టైశ్వర్యసిద్ధి. "ఆంధ్ర శ్రీ!", "ఆంధ్ర శ్రీ!" అని జపించిన ఆంధ్రశ్రీరాముని బ్రహ్మాస్త్రము ప్రయోగింపబడినది. "ఒకమాట ఒక బాణము" అనే లక్ష్యంతో ఆంధ్ర నాయకులు ఒక్కమాటమీద నిలువబడితే చాలు. అదే ఆంధ్రమాతకు "శ్రీరామరక్ష" అదే శ్రీరామ దీక్ష.

ఆంధ్రులు తపస్సంపన్నులైన యోధుల స్వరాష్ట్రశ్రీ వారికి సిద్ధించుట తథ్యము. తపస్సంపదకు మించిన సంపద మరొకటి లేదని మహాత్ముల మహోపదేశము. అట్టి లక్ష్మీసంపన్నులకడకు లోక మాకర్షింపబడిన దగును.

"తపశ్శ్రీగల భాగ్యశాలి కడ
చేరగవచ్చును రాష్ట్రమైన."

తథాస్తు - శ్రీరస్తు.


శ్రీరామజయం.

ఇటీవల ఒక పత్రికలో క్రింది విధంగా ఒక ప్రకటన పడింది.

"సిగరెట్లు కాల్చే అలవాటు వదిలించుకోవటానికి మార్గం చూపించగల మహానుభావులు ఎవరైనా వుంటే బాక్సు నెం. ....కు వెంటనే వ్రాయండి.

పరా-మనోబలం, మనో నిశ్చయాలను గురించి సలహా లిచ్చే మహానుభావులకు మాత్రం యీ ప్రకటన వర్తించదు."

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras.



ఏకశిలా స్తంభం, పల్లవుల శిథిలశిల్పాలు, తాడిపత్రి

—ఫోటో శ్రీ పి రాఘవరావు


జనవరిలో విడుదల
ఐశ్వర్యం పోగొట్టుకొని నాయకుడు
ఒక ఆడదాని చేతుల్లో చిక్కిపోయి తన
ఆలుబిడ్డలకు దూరమైపోయాడు
నాగయ్య..లింగమూర్తి
రామశర్మ..దొరస్వామి
రాజకుమారి..విద్య
గిరిజ..ఛాయాదేవి
నటించిన
అవరిండియా
వారి
నాయిల్లు
డైరెక్షన్... నాగయ్య..
రచన.. దేవులపల్లి.యడవల్లి.
సంగీతం.నాగయ్య.అద్దేపల్లి.
నృత్యం.వెంపటి.
కెమెరా.రహిమాన్..
స్టూడియోస్.
వాహినీ.రేవతి.
KRISHNA